బ్రహ్మసూత్ర కథామంజరి

స్వామి పరమానందనాథ

శ్రీ గణపతి సచ్చిదానంద ప్రశస్తి అవార్డు గ్రహీత
విశిష్ఠ విద్యాశిరోమణి, ప్రముఖ శ్రీవిద్యా ప్రచారకులు,
చతుర్వేద భాష్యకారులు, శ్రీవిద్యాబ్రహ్మసూత్ర భాష్యకారులు
అవధూత దత్తపీఠ ఆస్థాన విద్వాంసులు,
ఇండియా కల్చరల్ సెంటర్ & టెంపుల్, అమెరికా.
ఆస్థాన విద్వాంసులు, కనకాభిషేకగ్రహీత,
గండపెండేర సన్మానిత, సువర్ణ ఘంటాకంకణ,
శ్రీవిద్యారత్నాకర, శ్రీవిద్యావిశారద

డా॥ క్రోవి పార్థసారథి

ప్రకాశకులు :

శివకామేశ్వరి గ్రంథమాల

41-22/4-36, భ్రమరాంబాపురం, కృష్ణలంక,

విజయవాడ-520 013, ఫోన్ : 0866-2522824

బ్రహ్మసూత్ర కథామంజరి

స్వామి పరమానందనాథ

(డా॥ క్రోవి పార్థసారథి)

ప్రథమ ముద్రణ : హేమళంబి నామ సంవత్సర వైశాఖ శుద్ధ పంచమి,
ఆదివారం 30-4-2017 శ్రీ శంకర జయంతి

ప్రతులు : 1000

వెల : రూ. 45-00

ప్రతులకు :

1. **శివకామేశ్వరి గ్రంథమాల**
   41-22/4-36, భ్రమరాంబాపురం,
   కృష్ణలంక, విజయవాడ-520 013.
   ఫోన్ : 0866-2522824

2. **శివకామేశ్వరి ఆర్ష గ్రంథమాల**
   27-18-59, కాంగ్రెస్ ఆఫీస్ రోడ్డు,
   గవర్నర్‌పేట, విజయవాడ-520 002.
   ఫోన్ : 0866-6661777

ముద్రణ :
నిర్మలా ఆఫ్‌సెట్ ప్రింటర్స్,
గాంధీనగర్, విజయవాడ-3.

ఈ గ్రంథం



పొట్టిశ్రీరాములు జిల్లా,

పెనుశిలకోన మణిద్వీప మహాసంస్థానాధిపతి

మాతా విజయేశ్వరీ దేవికి

అంకితం చేయబడింది.

విషయ సూచిక

ప్రణతులు

భారతీయ వేదాంత వాఙ్మయంలో అత్యంత ఉన్నతమైనవి 'బ్రహ్మసూత్రాలు'. వీటిని వ్యాసభగవానుడు వ్రాశాడు. శంకర భగవత్పాదుల వారు బ్రహ్మసూత్రాలకు అద్వైతపరంగా భాష్యం వ్రాశారు. అదే మొదటి భాష్యం.

బ్రహ్మసూత్రాలు కేవలము పండితులకు తప్ప ఇతరులకు అర్థం కావు. అనేది ఒక నానుడి. శంకరుడు వీటికి అద్వైతపరంగా భాష్యం వ్రాయగా మిగిలిన వారందరూ సగుణబ్రహ్మను ప్రతిపాదిస్తూ భాష్యం వ్రాశారు. 2015 సం॥లో శంకర భాష్యం అనుసరించి అద్వైతపరంగా **'బ్రహ్మసూత్రభాష్యము'** నేను వ్రాయటం జరిగింది. దాన్ని మణిద్వీప మహాసంస్థానము, పెనుశిలకోన వారు ప్రచురించారు. 2016లో పరాశక్తియే పరబ్రహ్మ స్వరూపమని నిరూపణ చేస్తూ **'శ్రీవిద్యా బ్రహ్మసూత్ర భాష్యము'** వ్రాయటం జరిగింది. దీన్ని (శివకామేశ్వరి గ్రంథమాల, విజయవాడ) వారు ప్రచురించారు. ఏమైనా సరే బ్రహ్మసూత్రాలు సామాన్యుడికి చేరువ కావాలనే ఉద్దేశ్యంతో ఇప్పుడు బ్రహ్మసూత్రాలలోని కథలను తీసుకుని **బ్రహ్మసూత్ర కథామంజరి** వ్రాశాను. ఇది కొంతవరకైనా సామాన్యులకు చేరుతుందని ఆశ.

గతంలో వ్రాసిన గ్రంథాలలాగానే దీన్నికూడా ఆదరిస్తారని భావిస్తూ....

నా భార్య స్వర్గీయ రమాదేవిని స్మరిస్తూ.....

నమస్సుమాంజలులతో

బుధజనవిధేయుడు

స్వామి పరమానందనాథ

హేమళంబి నామ సంవత్సర వైశాఖ శుద్ధ పంచమి

ఆదివారం (శ్రీశంకరజయంతి)

30-4-2017



జననం 25.10.1952 **శ్రీమతి క్రోవి రమాదేవి గారు** మరణం 12.01.2014

బ్రహ్మసూత్ర కథామంజరి

1. అర్చిరాదిమార్గము

బ్రహ్మలోకానికి చేరే మార్గమే అర్చిరాది మార్గము. ఈ మార్గం గుండానే ముక్త పురుషులు బ్రహ్మలోకం చేరతారు అని బ్రహ్మసూత్రం 518లో చెప్పబడింది. ఇప్పుడు అర్చిరాది మార్గము అంటే ఏమిటో చూద్దాం.

కౌషీతకీ బ్రాహ్మణంలో దీన్ని గురించి వివరించటం జరిగింది. అర్చిషము అంటే వెలుగు నిచ్చేది, కాంతి నిచ్చేది, మంట, అగ్ని అని అర్థం.

పూర్వకాలంలో చిత్ర అనే పేరుగల గార్గ్యాయణిముని ఒకయాగం చెయ్య సంకల్పించినవాడై ఉద్దాలకఅరుణి వద్దకు వచ్చి ఆ యాగము పూర్తి చేయించమని అడిగాడు. అప్పుడు ఉద్దాలకుడు తనకుమారుడైన శ్వేతకేతువుకు ఆ యాగము బాధ్యతలు అప్పగించాడు. శ్వేతకేతువును వెంటబెట్టుకుని బయలుదేరాడు గార్గ్యాయణి ముని. త్రోవలో గార్గ్యాయణి శ్వేతకేతువుకు నమస్కరించి "శ్వేతకేతూ ! నన్ను ఊర్ధ్వలోకాలకుపంపగలవా? లేకపోతే ఊర్ధ్వలోకాలకు వెళ్ళేమార్గము చెప్పగలవా?" అని అత్యంతవినయంతో అడిగాడు. దానికి శ్వేతకేతువు "నాకు ఆవిద్య తెలియదు. నాతండ్రిని అడిగిచెబుతాను." అని ఆశ్రమానికి వెళ్ళి తండ్రియైన ఉద్దాలకుణ్ణి ఈ విషయము అడిగాడు. ఉద్దాలకుడు తనకుకూడా ఆ విషయము తెలియదు అని చెప్పి, దర్భలు చేత్తోపట్టుకుని కొడుకుతో కలిసి గార్గ్యాయణి దగ్గరకు వెళ్ళి అతడు అడిగిన విషయాన్ని వివరించమని ప్రార్థించారు. ఆ ప్రార్థన ఆలకించిన గార్గ్యాయణి ఈ విధంగా చెప్పటం ప్రారంభించాడు.

దక్షిణాయనంలో ప్రయాణం చేసినవారు చంద్రలోకం చేరతారు. చంద్రలోకము స్వర్గానికి ద్వారముగా ఉన్నది. చంద్రలోకం చేరినవారు తిరిగి భూలోకంలో

జన్మించాలి. ఏజీవులైతే తాముచేసిన పుణ్యకర్మలకు సమాధానంచెప్పగలరో, వారే స్వర్గానికిపోగలరు. వీరు తమపుణ్యఫలము స్వర్గంలో అనుభవించిన తరువాత, కర్మశేషముఅనుభవించటానికి వర్షముద్వారా భూలోకానికివస్తారు. ఆ తరువాత వారి కర్మఫలాన్నిబట్టి క్రిమికీటకాలుగానో, పశుపక్ష్యాదులు, మృగాలు ఈ రకంగా జన్మిస్తారు.

నివృత్తిమార్గం అదే దేవయానము. దీనిగుండా ప్రయాణించిన జీవుడు ముందుగా అగ్నిలోకం చేరుకుంటాడు. ఆతరువాత వాయులోకము, వరుణలోకము, ఆదిత్యలోకము, ఇంద్రలోకము, ప్రజాపతిలోకాలకు వెళ్ళి చివరకు బ్రహ్మలోకము చేరతాడు.

ఛాందోగ్యోపనిషత్తు, బృహదారణ్య కాలంలో ఈ మార్గాలలో కొంత తేడా కనిపిస్తోంది. అందుకని వ్యాసభగవానుడు ఆ మార్గాన్ని క్రమబద్ధీకరించాడు.

సంవత్సర దేవత తరువాత, ఆదిత్య లోకానికి ముందు వాయులోకమున్నది. (బ్ర.సూ. 519)

విద్యుల్లోకానికి పైన వరుణలోకమున్నది. (బ్ర.సూ. 520) అన్నాడు. బ్రహ్మలోకం చేరే వాడికి అర్చిరాది మార్గంలో ఉన్న లోకాలన్నీ అతివాహికలు. ఉపాసకుణ్ణి వెంట పెట్టుకుని బ్రహ్మలోకానికి తీసుకుపోతాయి. ప్రతిలోకంలోను ఆయా దేవతలు ఉపాసకుణ్ణి జాగ్రత్తగా తరువాత లోకానికి చేరుస్తారు. (బ్ర.సూ. 521) ఉపాసకుడు శరీరం లేనివాడు. అతడికి మార్గం తెలియదు. కాబట్టి బ్రహ్మలోకం చేరలేడు. అందుకని ఆ లోకాలలోని దేవతలు అతణ్ణి తరువాత లోకానికి మోసుకుపోతారు. (బ్ర.సూ. 522) విద్యుల్లోకం తరువాత ఒక పురుషుడు ఉపాసకుణ్ణి బ్రహ్మలోకం చేరుస్తాడు. (బ్ర.సూ. 523) బ్రహ్మలోకంలో 'అరః' అనే సరస్సుఉన్నది. అక్కడ 'యేష్టిహా' ముహూర్తములు గడుపుతాడు. 'విరజానది' ఉన్నది. 'ఈల్య' అనేవృక్షము 'సాయుజ్యము' అనేపట్టణము ఉన్నాయి. 'అపరాజితము' అనేసౌధమున్నది. ఆ సౌధములో ఇంద్రుడు, ప్రజాపతి ద్వారపాలకులుగా ఉంటారు. అందులో 'విభు' అనేపేరుగల సభావేదిక ఉన్నది. దానిమీద 'విచక్షణా' అనే తేజోవంతమైన సింహాసనమున్నది. 'అమితేజః' అనే గొప్పవాహనమున్నది. మానసీ, చాక్షుషీ అనే పేర్లుగల ఇద్దరుదేవకాంతలు పుష్పములు చేత్తో పట్టుకుని జగత్తులను

చూపుతుంటారు. అప్సరసలు, మాతృదేవతలు, నదీమతల్లులు, దాసీజనము అక్కడ సహకరిస్తారు. ఇక్కడికి చేరినవారు బ్రహ్మలోక సుఖమనుభవిస్తారు. బ్రహ్మ స్వయంగా వచ్చి వారితో "నా ఐశ్వర్యాన్ని దర్శించండి. అనుభవించండి. విరజానదిలో స్నానం చెయ్యండి మీకు ముసలితనము రాదు" అని చెబుతాడు.

బ్రహ్మలోకము చేరిన జీవుడి దగ్గరకు ఐదు వందల మంది అప్సరసలు వస్తారు. ఇందులో

వందమంది	–	మధురమైన పళ్ళు తెస్తారు.
వందమంది	–	సుగంధలేపనము తెస్తారు.
వందమంది	–	పూలమాలలు తెస్తారు
వందమంది	–	సుగంధద్రవ్యాలు తెస్తారు

మిగిలినవారు అక్కడకుచేరినవారిని బ్రహ్మలాగా అందంగాఅలంకరిస్తారు. అలంకరణ పూర్తిఅయిన తరువాత బ్రహ్మదగ్గరకు బయలుదేరతాడు జీవుడు. త్రోవలో అరఅనేసరస్సులో మనస్సుతోనేస్నానంచేస్తాడు. యేష్టిహా అనే ముహూర్తాలు గడుపుతాడు. అక్కడనుండి విరజానదికి బయలుదేరతారు. ఈనది జీవులను అమరులుగా చేస్తుంది. అందులో కూడా మనస్సుతోనే స్నానం చేస్తారు. అక్కడ పాపపుణ్యాలన్నీ వదిలేస్తారు. అలా వదలిపెట్టబడిన పాపపుణ్యాలు తనవారిని చేరతాయి. అంటే ఆ జీవికి ప్రియమైన వారికి పుణ్యము, అప్రియమైన వారికి – పాపము చేరుతుంది. ఈ విధంగా పాపపుణ్యాలు, సుఖదుఃఖాలు వదలి జీవుడు బ్రహ్మను చేరటానికి వెళతాడు.

త్రోవలో 'ఈల్య' వృక్షముదగ్గరకు చేరతాడు. అప్పుడు బ్రహ్మయొక్క సుగంధ చైతన్యము ఇతడిలోచేరుతుంది. అక్కడ నుంచి సాయుజ్యము అనే పట్టణం చేరతాడు. అక్కడ బ్రహ్మచైతన్యము ఇతనిలోచేరుతుంది. అపరాజితఅనే సౌధాన్ని చేరతాడు. అక్కడ బ్రహ్మతేజస్సు ఇతనిలోచేరుతుంది. అప్పుడు ద్వారపాలకులైన ఇంద్రుడు, ప్రజాపతిల దగ్గరకు వస్తాడు. వారు అతిప్రేమతో జీవుడికి త్రోవనిస్తారు. తరువాత 'విభు' అనే సభావేదికచేరతాడు. బ్రహ్మతేజము ఇతనిలోచేరుతుంది. తరువాత 'విచక్షణ' అనే బ్రహ్మసింహాసనము చేరతాడు జీవి. అక్కడ బృహద్రథంతర సామగానములు సింహాసనము ముందుకాళ్ళలోను, దైత్యనౌధస గానములు వెనక కాళ్ళలోను

వినిపిస్తాయి. వైరూప, వైరాజ, శాక్వర, రైవత ప్రజ్ఞలుప్రకాశిస్తాయి. వాటితో సంభాషణ జరుగుతుంది. అక్కడ 'అమితౌజసనము' అనే వాహన ముంటుంది. అది ప్రాణవాయువు. భూతభవిష్యత్తులు దానిముందుకాళ్ళు. సంపదలు, ఆహారము వెనుకకాళ్ళు. భద్రయజ్ఞా యజ్ఞీయములు రెండుశిరస్సులు, బృహత్ రథంతర సామగానములు రెండుప్రక్క కర్రలు. యజస్సులు అడ్డంగా ఉండే చెక్కలు. సోమలతలు క్రిందఉన్న చాపలు. ఉద్గీతములు మెత్తనిదిండ్లు. అక్కడ బ్రహ్మ ఆసీనుడై ఉంటాడు. జీవుడు బ్రహ్మదగ్గరకు వెడతాడు. అక్కడ బ్రహ్మ జీవుని కొన్ని ప్రశ్నలు అడుగుతాడు. వాటికి జీవుడు సమాధానం చెబుతాడు.

బ్రహ్మ : మీరెవరు ?

జీవి : నేను ఋతుదేవతను. ఋతుధర్మముతో నాకు సంబంధమున్నది. ఆకాశంనుంచి శుక్లరూపంలో స్త్రీగర్భంలో చేరాను. సంవత్సర తేజస్సుగా, అన్ని జీవాత్మలవలె ఉన్నాను. నీవు సర్వజీవాత్మలకు ఆత్మవై ఉన్నావు. నీకులానే నేనుకూడా ఆత్మనే.

బ్రహ్మ : నేను ఎవరు ?

జీవి : నీవు సర్వాత్మవు.

బ్రహ్మ : సర్వాత్మ ఎవరు ?

జీవి : ఇంద్రియదేవతలు కాదు, ప్రాణవాయువు కాదు, అదే సత్యము. అదే సమస్తజగత్తు. నువ్వు కూడా ఈ జగద్రూపమై ఉన్నావు.

బ్రహ్మ : తెలియరాని నా పురుష రూపములు నీవు ఏ విధంగా తెలుసుకున్నావు.

జీవి : ప్రాణవాయువు శ్వాసవల్ల తెలుసుకున్నాను.

బ్రహ్మ : స్త్రీ రూపాన్ని ఎలా తెలుసుకున్నావు ?

జీవి : వాక్కుద్వారా తెలుసుకున్నాను.

బ్రహ్మ : నపుంసక రూపము ఏ రకంగా తెలుసుకున్నావు ?

జీవి : మనస్సు ద్వారా

బ్రహ్మ : వాసనలు ఏ రకంగా తెలుసుకున్నావు ?

జీవి : ఘ్రాణేంద్రియము ద్వారా

బ్రహ్మ : రూపమును ఎలా తెలుసుకున్నావు?

జీవి : నేత్రములద్వారా

బ్రహ్మ : శబ్దమును ఎలా తెలుసుకుంటున్నావు ?

జీవి : శ్రోత్రేంద్రియములద్వారా

బ్రహ్మ : రసములనెలా తెలుసుకుంటున్నావు ?

జీవి : జిహ్వాద్వారా

బ్రహ్మ : నువ్వు చేసే కర్మలనెలా తెలుసుకున్నావు ?

జీవి : రెండు చేతులద్వారా

బ్రహ్మ : సుఖదుఃఖాలనెలా తెలుసుకున్నావు ?

జీవి : శరీరము ద్వారా

బ్రహ్మ : ఆనందము, రతిసౌఖ్యము, సంతానోత్పత్తి ఎలా తెలుసుకున్నావు ?

జీవి : ఉపస్థేంద్రియము ద్వారా

బ్రహ్మ : నడవటం ఎలా తెలుసుకున్నావు ?

జీవి : పాదాలద్వారా

బ్రహ్మ : సంకల్పములను, భావనలను, కోరికలను ఎలా తెలుసుకున్నావు ?

జీవి : బుద్ధిప్రజ్ఞతో. జలమయమైన ప్రపంచం అంతా నాదే. నీది కూడా. సమస్త జగత్తు బ్రహ్మమయము. ఈ విషయం తెలిసినవాడు కూడా బ్రహ్మమే"

ఆ మాటలకు ఆనందించిన వాడై **"నేను అనుభవించే సుఖాలు మీరుకూడా అనుభవిస్తూ నాతోపాటు ఇక్కడే ఉండండి" అంటాడు పరమేశ్వరుడు.** పరమేశ్వరుని మాట తలదాల్చినవారై ఈ భక్తులు కూడా ఆ పరమపదంలోనే ఉంటారు. సాకారాన్ని ఉపాసించిన వారు ఈ మార్గం ద్వారానే పరమపదం చేరతారు. పరమపదం చేరిన వారికి పునర్జన్మ ఉండదు. అని వారంటారు. ఇదే మహదైశ్వర్యము. బ్రహ్మానందము.

దీన్నే పరమపదము, కైవల్యము అంటారు. ఇక్కడకి చేరినవారు పరమేశ్వరుణ్ణి సేవిస్తూ, అక్కడ జరిగే నిత్యోత్సవ, పక్షోత్సవ, మాసోత్సవ, సంవత్సరోత్సవాది వివిధ ఉత్సవాలు కళ్ళారాచూస్తూ ఉండిపోతారు. అక్కడ కష్టాలు, బాధలు, దుఃఖము అనేవి ఉండవు. అంతా ఆనందమేఉంటుంది. అదేబ్రహ్మానందం. అర్చిరాది మార్గం ద్వారా బ్రహ్మలోకం చేరిన పురుషుడు బ్రహ్మానందాన్ని అనుభవిస్తాడు.

౨. ముక్తపురుషుడు జగత్సృష్టి చెయ్యలేడు

సాధకుడు పరమేశ్వరుణ్ణి ధ్యానం చేస్తున్నప్పుడు తాను ఉన్న స్థితినుంచి ఒక్కొక్క మెట్టే పైకి వెళతాడు. అంటే భగవంతునికి దగ్గరవుతున్నాడన్న మాట. ఈ స్థితిలో భగవంతుడికి ఉన్న శక్తులు కొన్ని అతడికి కూడా వస్తాయి. ఆక్రమంలోనే అతడికి అణిమాది అష్టసిద్ధులన్నీ లభిస్తాయి. కాని జగత్తును సృష్టించే శక్తి మాత్రం ఉండదు. ఆ పని పరమేశ్వరుని వల్లనే జరుగుతుంది.

సృష్టి సమయంలో పరమేశ్వరుడు ఒక్కడే ఉంటాడు. అతనికి సన్నిహితులు గాని, అతనితో సమానమైన వారుగాని ఎవరూ ఉండరు.

ఏకాకీ భూమరూపా నిర్ద్వైతా ద్వైతవర్జితా

విద్వాంసుడికి ఈశ్వరునితోపాటు సమానమైన ఐశ్వర్యం కలుగుతోంది. అంతమాత్రంచేత జగద్వ్యాపారము, జగత్కర్తృత్వము కలగవు. వీరంతా బ్రహ్మలోకంలోనే ఉంటారు. కాబట్టి వీరిశక్తి అక్కడి వరకే పరిమితము. వీరంతా పరబ్రహ్మకు లోబడేఉంటారు. లోకాలనుసృష్టించే అధికారం వీరికిలేదు.

పరమేశ్వరుని రూపం వికారమందు మాత్రమే ఉండేదికాదు. నిత్యమైనది కూడా. ఇది సగుణము, నిర్గుణము అని రెండు రకాలుగా ఉన్నది అని వేదంలో చెప్పబడింది.

ఈ వికారమంతా పరమేశ్వరుని వ్యాప్తి. ఆయన మాత్రం వికారానికి ఆవల ఉన్నాడు. నిర్వికారుడై ఉన్నాడు. ఈ సమస్తభూతాలు పరమేశ్వరుని యొక్క ఒక పాదముమాత్రమే. మిగిలిన మూడుపాదాలు స్వర్గంలో ఉన్నాయి. ఈశ్వరుడికి సగుణ, నిర్గుణ రూపాలు రెండూ ఉన్నాయి. నిర్గుణరూపాన్ని సగుణోపాసకులు పొందలేరు. సగుణోపాసకులు సూక్ష్మదేహంతో బ్రహ్మలోకంచేరి, బ్రహ్మతోపాటు మహదైశ్వర్యము పొందుతూ అక్కడేఉంటారు. ఇదేముక్తి అని ద్వైతులంటారు. వీరికి సాయుజ్యంలేదు. వీరిజీవాత్మ పరమాత్మలో లీనంకాదు.

ప్రత్యక్షం అంటే వేదం. అనుమానం అంటే స్మృతి పురాణాలు.

న తత్ర సూర్యోభాతి, న తత్ర చంద్రతారకం.

జ్యోతి స్వరూపుడైన పరబ్రహ్మ యందు లోకాలను ప్రకాశింపచేసే సూర్యుడు ప్రకాశింపడు. చంద్రుడు కాంతులివ్వడు. తారకలు ప్రకాశింపవు అని ఉపనిషత్తులు

చెబుతున్నాయి. ఇవి వేదంలో భాగాలు. పరబ్రహ్మ నుంచి వచ్చే కాంతులవల్ల సూర్యచంద్రాగ్నులు ప్రకాశిస్తున్నారు.

ఇదే విషయాన్ని పురాణాలు కూడా చెబుతున్నాయి. స్వయం ప్రకాశమానుడైన పరమాత్మను సూర్యచంద్రాగ్నులు ప్రకాశింపచేయలేవు అంటోంది భగవద్గీత.

పరమాత్మది తేజస్సులకన్నా అధికమైన తేజస్సు. కాబట్టి సగుణ, నిర్గుణరూపాలు రెండూ ఆయనకు ఉన్నాయి.

ఉపాసకులకు ఈశ్వరునితోపాటుగా భోగమాత్రమైన సామ్యమే ఉన్నదని వేదాలు చెబుతున్నాయి. అందుచేత వారికి జగత్తునుసృష్టించే శక్తి, అధికారములేవు.

సమస్తప్రాణులు హిరణ్యగర్భుని పూజించినట్లే ఉపాసకులను కూడా పూజిస్తాయి. అంటే హిరణ్యగర్భునికి మల్లేనే ఉపాసకునికి కూడా భోగసాధనా లవుతాయి.

బ్రహ్మలోకం చేరిన ఉపాసకులతో బ్రహ్మ "ఓ ఉపాసకులారా! ఇక్కడ అమృత రూపమైనభోగాలను నేనుఉపయోగిస్తున్నట్లే, మీరుకూడా ఉపయోగిస్తారు" అంటాడు. అంటే సగుణోపాసకులు బ్రహ్మలోకంచేరి, బ్రహ్మతోపాటే వీరుకూడా అక్కడ ఉన్న సమస్తభోగాలు అనుభవిస్తారు. వీరికి భోగసామ్యమేతప్ప జగద్వ్యాపారం లేదు.

నిర్గుణోపాసకునిఆత్మ పరబ్రహ్మలో లీనమైపోతుంది. కాబట్టి అది ప్రత్యేకంగా జగద్వ్యాపారం చెయ్యలేదు.

అయితే ఇక్కడ చిన్న అనుమానం వస్తుంది. **'యోగవాసిష్టం'**లో ఋషి కుమారులు ఆరుగురు జగత్తును ఆరురకాలుగా సృష్టించారు. అలాగే **త్రిపురా రహస్యం**లో 'తంగణపుత్రుడు' అనే ముని కుమారుడు ఒకకొండలో జగత్తును సృష్టించి దాన్ని మహారాజుకు చూపిస్తాడు. ఇలాటి సందర్భాలలో పరబ్రహ్మ కాకుండా ఇతరులుకూడా ఈసృష్టి చేశారు కదా ? అని అనుమానం వస్తుంది.

సృష్టిఅనేది రెండురకాలుగా ఉంటుంది. 1.వ్యష్టి 2.సమిష్టి.

వ్యష్టి సృష్టిలో అతడు చేసిన సృష్టి అతడికి, మహా అయితే ఇంకా ఒకరిద్దరికీ మాత్రమే కనిపిస్తుంది. ఇది గారడీవాడు చేసే సృష్టి. పూర్వకాలంలో అంటే నా చిన్నప్పుడు **'విప్రతినోదివాళ్ళు'** అనే యాచకులు వచ్చేవాళ్ళు. వాళ్ళు చేత్తో వేపాకు తీసుకుని నేలమీద వేస్తే అది కాస్తా తేళ్ళుగా మారిపోయేది. మేమంతా చూసేవాళ్ళం.

ఆ తరువాత ఆ తేళ్లను చేతులోకి తీసుకుని చిలకగా మార్చేసేవాడు. ఇదంతా కనికట్టు. గారడీవిద్య. ఈ రకమైన సృష్టి ఎక్కువసేపు నిలవదు. కలలాగా క్షణాల్లో కరిగిపోతుంది. విశ్వామిత్రుడు సృష్టించిన త్రిశంకుస్వర్గం కూడా ఇలాంటిదే.

2. సమిష్టిసృష్టి అనేది పరమేశ్వరుడుచేసేది. ఈసృష్టి అందరికీ ఒకేలా కనిపిస్తుంది. ఇక్కడ పులి అందరికీ పులిలాగానే కనిపిస్తుంది. ఈసృష్టి ఎక్కువ కాలంనిలుస్తుంది. ఇది బ్రహ్మచేసేసృష్టి.

కాబట్టి గతంలో పరబ్రహ్మతప్ప ఎవరైనా సృష్టిచేశారు అంటే అదివ్యష్టి సృష్టి. గారడీవిద్య లాంటిది. జగద్వ్యాపారము పరమేశ్వరుడి వల్లే జరుగుతుంది. అది కూడా సృష్టి చెయ్యాలంటే సగుణబ్రహ్మకు మాత్రమేసాధ్యం. నిర్గుణబ్రహ్మ సృష్టిచెయ్యదు. అందుకే **'సృష్టికర్త్రీ బ్రహ్మరూపా'.** చతుర్ముఖ బ్రహ్మరూపంలోనే ఆ పరమేశ్వరి జగత్తును సృష్టిస్తుంది.

అర్చిరాది మార్గం గుండా బ్రహ్మలోకం చేరినవారికి కూడా పునరావృత్తి లేదు. ఈ విషయమంతా 550 నుంచి 555 వరకు గల సూత్రాలలో వివరించారు.

3. దక్షిణాయనంలో మరణించినా జ్ఞాని బ్రహ్మలోకానికే పోతాడు.

ఉత్తరాయణము, దక్షిణాయనము అనేవి కాలగమనంలో తేడాలు. జనవరి 14 నుంచి జులై 13 వరకు ఉత్తరాయణం. ఈ సమయంలో సూర్యుడు ఉత్తరదిక్కుకు వంగి ఉంటాడు. దక్షిణాయనం జులై 14 నుంచి జనవరి 13 వరకు. ఈ సమయంలో సూర్యుడు దక్షిణ దిక్కుకు వంగి ఉంటాడు. ఇవి సూర్యుడు సంచరించే మార్గాలు. కాగా వేదాంత పరిభాషలో చెప్పినవి జీవి ప్రయాణించే దేవయాన పిత్రుయానాలు. వీటిని కూడా ఉత్తరాయణము, దక్షిణాయనము అనే అంటారు. కాని వాటికి, వీటికీ ఏ సంబంధము లేదు. కేవలము పేర్లు మాత్రమే ఒకటి. సూర్యగమనంలోని ఉత్తరాయణం ఆరోగ్యప్రదమైన కాలం. అందుకే దాన్ని పుణ్యకాలము అంటారు.

ఉత్తరాయణపుణ్యకాలంలో స్వర్గద్వారాలు తెరిచి ఉంటాయి. కాబట్టి ఉత్తరాయణంలో మరణించిన వారు బ్రహ్మలోకానికి పోతారు. దక్షిణాయనంలో మరణించిన వారికి బ్రహ్మలోక ప్రాప్తిలేదు అంటారు ఇది నిజమేనా?

పుత్రులులేనివారికి ఊర్ధ్వలోకాలకుపోయే అర్హతలేదు అంటారు. వివాహమే చేసుకోని శుకమహర్షి మోక్షాన్ని పొందాడుకదా? వంశం విస్తరించాలంటే పుత్రులు కావాలి. ఈవిషయం చెప్పటానికే అలాచెబుతారు. అలాగే ఇదికూడా.

ఉత్తరాయణము, దక్షిణాయనము అనేవి మనం చెప్పుకుంటునట్లుగా సూర్యగమనంవల్ల కలిగేవికాదు. అవి దేవయాన, పిత్రుయానాలు. ఈ జ్ఞానమనేది ఎప్పుడూ ఉండేది. కాబట్టి దక్షిణాయనంలోచనిపోయినప్పటికీ బ్రహ్మలోకప్రాప్తి జరుగుతుంది. అలాగే అజ్ఞానులు ఏసమయంలోమరణించినా, వారికి బ్రహ్మలోకం లభించదు.

ఉత్తరాయణంలో ఉరివేసుకునిచచ్చినా బ్రహ్మలోకంపొందుతారు అనేది కేవలము ఉత్తరాయణంపుణ్యకాలము అనటానికి చెప్పేమాట.

యోగుల కోసం చెప్పేస్మృతిలో కాలవిశేషాన్ని వివరించారు. ఈ యోగము, సాంఖ్యము అనేవి పురాణాలలో చెప్పబడ్డాయి. అంతేకాని వేదంలో కాదు.

గీతలో చెప్పబడిన అర్చిరాదిమార్గము, ధూమమార్గము యోగుల నుద్దేశించి చెప్పబడినది. సాంఖ్య, యోగశాస్త్రాలు పురాణాల్లోనే చెప్పబడ్డాయి. అవి వేదప్రమాణాలు కావు. అయితే వేదాలలోచెప్పబడ్డ దేవయాన పిత్రుయానాలు, పురాణాలలోచెప్పబడ్డ అర్చిరాది, ధూమాది మార్గాలు ఒకటే అని చెప్పవచ్చు.

క్రమముక్తికి కాలనియమంలేదు. జ్ఞానియైనవాడు దక్షిణాయనంలో మరణించినా బ్రహ్మలోకంచేరతాడు. మరి భీష్ముడు ఉత్తరాయణం వచ్చేదాకా ఆగాడు కదా! అంటారు. భీష్ముడికి స్వచ్ఛంద మరణంఉంది. దానిశక్తిని అందరికీ తెలియచెయ్యాలనే ఆ విధంగాచేశాడు. అంతేకాని ఏ కాలంలో మరణించినా జ్ఞాని బ్రహ్మలోకానికే పోతాడు. ఇందులో సందేహం లేదు. ఈ విషయం 516, 517 సూత్రాలలో వివరించబడింది.

4. దేవయానము (ఉత్తరాయణము)

దేవయానం ద్వారా వెళ్ళిన ఉపాసకుడు ముందుగా కార్య బ్రహ్మను చేరతాడు. ఇతడే సాకారబ్రహ్మ, అపరబ్రహ్మ, కార్యబ్రహ్మ. పరబ్రహ్మకు సమీపంగా ఉంటాడు కాబట్టి అపరబ్రహ్మను కూడా బ్రహ్మము అనే అంటారు. కల్పాంతాన కార్యబ్రహ్మ పరబ్రహ్మలో లీనమవుతాడు బ్ర.సూ. 524–531లో ఈ విషయాలు వివరించబడ్డాయి.

అవసాన దశలో మానవుడి ప్రాణాలు నవరంధ్రాలలోను ఏదో ఒక రంధ్రం గుండా పోతాయి. దీన్నే ఉత్క్రమణ అంటారు. సామాన్య మానవుల ప్రాణాలు ఇలాగే పోతాయి. కాని బ్రహ్మవేత్త ప్రాణాలు ఉత్క్రమించవు. బ్రహ్మరంధ్రం గుండానే పోతాయి. ఈ విషయం 508, 509, 510 సూత్రాలలో వివరించటం జరిగింది.

మానవులు తామాచరించే కర్మ ననుసరించి వారు ప్రయాణించే మార్గాలు నిర్దేశించబడతాయి. మానవులు రెండు రకాల కర్మలనాచరిస్తారు.

1. ఉత్తరాయణ మార్గము (శుభమార్గము)
2. దక్షిణాయన మార్గము (అశుభమార్గము)

1. ఉత్తరాయణ మార్గము : దీనినే అర్చిరాది మార్గము దేవయానము అని కూడా అంటారు. సాధకులు ఏ కోరిక లేకుండా కేవలం పరలోక చింతనతో, చేసే కర్మను ఉత్తరాయణ మార్గము అంటారు. ఈ మార్గంలో పరబ్రహ్మ తత్త్వానుభవం కలిగి కృతకృత్యులయిన వారు పరబ్రహ్మలో లీనమవుతారు. వీరు మోక్షసాధన కోసం వేదవిహితమైన కర్మలు కూడా (యజ్ఞయాగాదులు) చేస్తుంటారు.

2. దక్షిణాయన మార్గము : కేవలము ఐహిక వాంఛలతో కొట్టుమిట్టాడుతూ, వాటికోసం కర్మలను ఆచరించటాన్ని దక్షిణాయన మార్గము అంటారు. ఈ మార్గంలో పయనించేవారు పితృలోకాలకు పోతారు. వీరు పరలోకంలో తమ కర్మఫలాలు అనుభవించి మళ్ళీ భూలోకంలో పుడతారు. ఈ రకంగా సంసార చక్రంలో పడి తిరుగుతూ ఉంటారు. దీన్ని ధూమమార్గము, పితృయానము అని కూడా అంటారు.

ఈ రెండు మార్గాలు తెలియనివారు క్రిమికీటకాలు, పక్షులు, పాములు, జెర్రులుగా పుడతారని **బృహదారణ్యకోపనిషత్తు**లో చెప్పబడింది.

"అథమ ఏతౌ పంథానౌ నవిదు స్తే కీటాః పతంగా మదిదం దందమాకమ్"

పరబ్రహ్మ తత్త్వము తెలిసిన సాధకుడు ఈ శరీరాన్ని వదలిన తరువాత పరబ్రహ్మలో లీనమవుతాడు అంతేకాని ఎక్కడికీ వెళ్ళడు. అంటే బ్రహ్మజ్ఞాని యొక్క ప్రాణములు ఉత్క్రమింపవు, ఉత్క్రమణ అంటే దేవయాన, పితృయానముల ద్వారా పైకి పోవటము. సాధకులు పరలోకాలకు ప్రయాణమయ్యే సమయంలో అంటే అవసాన దశలో, అతడి ఇంద్రియాలన్నీ జీవుడి దగ్గరకు చేరతాయి. అప్పుడు ఆ జీవియొక్క తత్తరపాటు, అవస్థలు వర్ణణాతీతం. అతనికి ఊపిరి సలపక సతమతమవుతాడు. క్రమంగా కర్మేంద్రియాలు, జ్ఞానేంద్రియాలు వశం తప్పుతాయి. కేవలం మనస్సు ఒక్కటే పనిచేస్తుంది. విషయం మాత్రం తెలుస్తుంది. కాని మాట్లాడలేడు. ఈ స్థితిలో ఇంద్రియాలన్నింటినీ కూడ తీసుకున్న మనసు ప్రాణముతో ఏకమవుతుంది. అంటే మనోవ్యాపారం కూడా అంతరిస్తుంది. అప్పుడు ఈ లోకంలో జరిగే విషయాలు అతనికి తెలియవు. క్రమంగా ప్రాణము జీవుడితో కలిసిపోతుంది ప్రాణి ఎగఊపిరి దిగఊపిరితో కొట్టుకుంటాడు. సకలేంద్రియ వ్యాపారము అంతరిస్తుంది. ఇప్పుడు అతడు చేసిన పాపపుణ్యాలు అతణ్ణి ఆవరిస్తాయి. ఈ రకంగా సకలేంద్రియాలను కూడగట్టుకున్న జీవుడు శబ్దస్పర్శాదులైన పంచతన్మాత్రలతో ఏకమయి పరలోకయాత్రకు బయలుదేరతాడు, జీవి బయలుదేరే వరకు దేహము వేడిగా ఉంటుంది. ఆ తరువాత దేహం చల్లబడుతుంది. బంధువులు ఆ దేహానికి అంత్యక్రియలు చేస్తారు. అంటే స్థూలదేహం నశిస్తుంది. సూక్ష్మదేహం పరలోకయాత్రకు బయలుదేరుతుంది.

లోకంలో కొంతమంది కర్మలను ఫలాపేక్షతో చేస్తే మరికొంతమంది నిష్కామ కర్మలను చేస్తూ సగుణోపాసన కూడా చేస్తుంటారు. దేహాన్ని వదలి జీవుడు బయలు దేరటానికి ఈ రెండు రకాల వారికి తేడాలేదు. కర్మోపాసకులు ధూమ మార్గమున (దక్షిణాయనంలో) పోగా, రెండవ వారు అర్చిరాది మార్గములో పోతారు. ఈ రెండు రకాల వారు కూడా మొదటగా హృదయాన్ని చేరుకుంటారు. అక్కడ నుండి వీరి ప్రయాణం మొదలవుతుంది. శరీరంలో ఉన్న డెబ్బది రెండు వేల నాడీమండలమే వీరి ప్రయాణానికి సిద్ధంగా ఉన్న వాహనాలు. ఈ నాడీ మండలం నవరంధ్రాలలోను ఏదో ఒక రంధ్రంతో కలిసి ఉంటుంది. జీవుడు వారివారి కర్మలననుసరించి దేహము

యొక్క కళ్ళు, ముక్కు, నోరు మొదలైన అవయవాల నుంచి బయటకు వస్తాడు. కాని జ్ఞానులకు మాత్రం బ్రహ్మరంధ్రం ద్వారా బయటకు వస్తాడు.

మానవుడు సంపాదించిన ఆస్తిపాస్తులు అతని వెంటరావు. అతడు సంపాదించిన ఇల్లు వాకిలి, సంపద అన్నీ అక్కడే ఉండిపోతాయి. ఇతని మరణానంతరము వారసులు ఆస్తులకోసం పోట్లాడుకుంటారు. ఇంత కష్టపడి ఆస్తులు సంపాదించినా మరణించేటప్పుడు నక్షత్రం మంచిది కాదనో, ఇతర కారణాలచేతనో అతణ్ణి వాకిట్లోనే చాపవేసి పడుకోబెడతారు. కాబట్టి సంపాదించిన ఆస్తిపాస్తులు ఇక్కడివరకే పరిమితమై పోతాయి. ఇక ఇతడంటే ఇష్టపడే బంధువులు, మిత్రులు శ్మశానందాకా వెళ్ళి అతణ్ణి సాగనంపుతారు. మహా అయితే అతడికి దహన సంస్కారాలు పూర్తయ్యేదాకా అక్కడ ఉంటారు. చివరకు అతనితో పాటుగా వెళ్ళేది అతడు చేసిన పాపపుణ్యాలే. అతడు మంచి పనులు చేస్తే, అతను మరణించిన తరువాత కూడా అతడు చేసిన పనిని పదిమంది మెచ్చుకుంటారు. ఎంత కాలమైతే అతడి మంచి పనులను జనం కొనియాడుతుంటారో, అంతకాలం అతడు స్వర్గసుఖాలు అనుభవిస్తాడు. అతను మంచివాడని, మహానుభావుడని పదిమంది మెప్పును పొందటమే స్వర్గసుఖం. అతడు చేసిన పనులవల్ల బాధపడిన వారు అతడు పోయిన తరువాత ఆనందిస్తారు. అదే అతడికి నరకం. అందుచేతనే మరణించిన తరువాత అతడితో వచ్చేవి అతడు చేసిన కర్మ ఫలితాలే కాని వేరుకావు.

మరణించబోయే ముందు, ఆఖరిదశలో అతడు చేసిన పాపపుణ్యాలు అతడికి గుర్తుకు వస్తాయి. అతడి మరుజన్మ ఏమిటి అనే విషయాన్ని అతడు తెలుసుకో గలుగుతాడు. పాపకర్ముడు ఇంతకన్న హీనమైన జన్మ రాబోతున్నదని తెలిసి విలపిస్తాడు. జీవి ఈ శరీరం విడిచిపోవటానికి ఇష్టపడడు. చివరకు శరీరం నుంచి జీవి గెంటి వేయబడతాడు. ఈ కారణం చేతనే పాపకర్ముల మరణాలు సాధారణంగా నీచంగా దారుణంగా ఉంటాయి. పుణ్యచరితులకు అనాయాస మరణం లభిస్తుంది.

ఈ రకంగా బయలుదేరిన జీవికి తన మరుజన్మ ఏమిటన్న విషయం తెలుస్తుంది. కర్మలనాచరించిన వారు వాటి ఫలితాలైన పాపపుణ్యాలనుభవించిన తరువాత మళ్ళీ ఈ లోకంలో పుడతారు. నిష్కామకర్మ చేసిన జ్ఞాని సుషుమ్నా నాడి ద్వారా బ్రహ్మరంధ్రం చేరి అక్కడ నుండి సూర్యమండలానికి పోతాడు. ఇక్కడ రాత్రి పగలు అనే భేదం లేదు. **ఉత్తరాయణము అంటే సూర్యుడు మకరరాశిలో ప్రవేశించిన**

నాటినుంచి (జనవరి 14) కర్కాటక రాశిలో ప్రవేశించే వరకు (జులై 17) అని అర్థము కాదు. ఈ మధ్య కాలంలో మరణించిన వారు మాత్రమే పుణ్యలోకాలకు పోతారనేది నిజం కాదు. గతంలో చెప్పిన దేవయానాన్నే ఉత్తరాయణ మంటారు. **జ్ఞాని అయినవాడు దక్షిణాయనంలో మరణించినా సూర్యమండలం చేరతాడు.** బ్రహ్మలోకానికి తలవాకిలి సూర్యమండలం. ఉపాసనాపరులు చేరుకోదగిన స్థానము బ్రహ్మలోకము. ఆమార్గమే అర్చిరాదిమార్గము. అర్చిషము అంటే 'అగ్ని' అని అర్థము.

బ్రహ్మలోకానికి పోయే మార్గము అతి కాంతివంతమైన బింబముచే కప్పబడి ఉంటుంది. ఆ కాంతిని మనం చూడలేము. అప్పుడు సాధకుడు, **ఈశావాస్యోపనిషత్తు** లో చెప్పినట్లుగా ఆ కాంతి బింబాన్ని తొలగించి, బ్రహ్మలోకానికి దారి చూపమని సూర్యభగవానుణ్ణి ప్రార్థిస్తాడు.

హిరణ్మయేన పాత్రేణ సత్యస్యాపిహితం ముఖమ్ ।
తత్త్వం పూషన్న పావృణు సత్యధర్మాయ దృష్టయే ॥
పూషన్నే కర్షే యమ సూర్యప్రాణాపత్య వ్యూహ రశ్మీన్ సమూహ ।
తేజోయత్తే రూపం కల్యాణతమం
తత్తే పశ్యామి యోసావసౌ పురుషః సోఽహమస్మి ॥

ఓ సూర్యభగవానుడా జ్యోతిర్మయమగు పాత్రముచేత బ్రహ్మలోక ముఖద్వారము కప్పబడి ఉన్నది. ఓ దేవా సత్యమైన ధర్మాన్ని ఆచరించే నా కోసం ఆ మార్గాన్ని తెరవవలసినది.

ఓ సూర్యభగవానుడా ! నీ కిరణాలను తొలగించి కాంతిని ఉపసంహరించు. నీ అనుగ్రహం చేత మంగళకరమైన నీ రూపాన్ని చూడగలుగుతాను అని ప్రార్థిస్తాడు.

ఈ నా ప్రాణవాయువు, సర్వవ్యాప్తము శాశ్వతము అయిన ప్రాణమందు లీనమగు గాక, ఈ శరీరము బూడిద అగును గాక. ఓ మనసా! పూర్వకర్మలను గుర్తు తెచ్చుకో. మరణించబోయే మానవుడి ఆలోచన ప్రధానంగా ఉత్తర జన్మల మీద ఉంటుంది. అందుకనే తన జీవితంలో చేసిన కర్మలను అంటే పాపపుణ్యాలను గుర్తు తెచ్చుకోమని మనస్సును హెచ్చరిస్తున్నాడు.

మానవుడు ఎన్ని దుష్కృత్యాలు చేసినా చివరకు సుఖంగా ఉండాలనీ, స్వర్గసౌఖ్యాలనుభవించాలనీ కోరతాడు. అందుకనే సత్కర్మల నాచరించిన మానవుడు తనను మంచి మార్గం ద్వారా తీసుకుపొమ్మని అగ్నిదేవుణ్ణి ప్రార్థిస్తాడు.

ఓ అగ్నిదేవా ! నేను చేసిన కర్మలన్నీ నీకు తెలుసు. నాలోని పాపాలను నిర్మూలించు. నేను చేసిన కర్మఫలితాలను అనుభవించటానికి నన్ను మంచి మార్గం గుండా తీసుకుని పోవలసినది అని ప్రార్థిస్తాడు. ఇక్కడ సూర్యభగవానుడు అంటే ఆ పరమేశ్వరుడే అని గుర్తించాలి.

సాధకుని ప్రార్థన ఆలకించి సూర్యుడు బ్రహ్మలోకానికి అడ్డుగా ఉన్న కాంతి బింబాన్ని తొలగిస్తాడు. ఈ మార్గంలో మొదటగా ఉండేది అగ్నిలోకము. అర్చిషము అంటే అగ్ని. అందుకే దీన్ని అర్చిరాది మార్గము, అగ్నిమార్గము అనికూడా అంటారు. ఇది శుభప్రదమైన మార్గము. ఈ మార్గంలో మొదటగా అగ్నిలోకము, అహిర్లోకము (పగటి దేవత) శుక్ల పక్షదేవత, ఉత్తరాయణ దేవత, మాసదేవత, సంవత్సర దేవత, దేవలోకము, యమలోకము, ఆదిత్యలోకము, చంద్రలోకము, విద్యుల్లోకము, వరుణ లోకము, ఇంద్రలోకము, ప్రజాపతి లోకము ఉంటాయి. చివరకు బ్రహ్మలోకముంటుంది.

జీవుడికి అవయవములు అధీనంలో ఉండవు. అతను ఒకచోటి నుండి మరొక చోటికి కదలలేడు అని ముందే చెప్పబడింది. ఇప్పుడు ఆ జీవుడు ఒక లోకం నుంచి ఇంకొక లోకానికి స్వయంగా పోలేడు కాబట్టి ఆయా లోకాలలో ఆయా దేవతలు, మహాపురుషులు అతడి గమనానికి సాయపడతారు. బ్రహ్మమానస పుత్రుడు జీవిని విద్యుల్లోకం నుంచి బ్రహ్మలోకానికి తీసుకుని పోతాడు. ఈ మార్గంలో వరుణ, ఇంద్ర, ప్రజాపతులంతా జీవి ప్రయాణానికి అనుమతిస్తారు. అంతేకాని అడ్డగించరు. ఈ రకంగా జీవుడు బ్రహ్మలోకం చేరతాడు.

సాధకుడు చేసిన కర్మలవల్ల వచ్చే స్వర్గము శాశ్వతం కాదు. సాధకుడు స్వర్గంలో పుణ్యఫలమును అనుభవించిన తరువాత మళ్ళీ భూలోకంలో పుడతాడు. కాని

బ్రహ్మలోకం చేరినవారు తిరిగి రారు. కల్పాంతము వరకు బ్రహ్మలోకంలోనే ఉండి కల్పాంతాన పరబ్రహ్మలో లీనమైపోతారు. అందుకనే బ్రహ్మలోకము చేరే మార్గము ఉత్తమమైనది. అదే అర్చరాది మార్గము, ఉత్తరాయణ మార్గము అని చెప్పబడింది.

దేవయానం ద్వారా వెళ్ళిన ఉపాసకుడు ముందుగా కార్యబ్రహ్మను చేరతాడు. కార్యబ్రహ్మ అంటే సాకారబ్రహ్మ. పరబ్రహ్మ సర్వాంతర్యామి. అందుచేత ఉపాసకుడు ముందుగా సగుణబ్రహ్మను లేదా కార్యబ్రహ్మను చేరతాడు. కార్యబ్రహ్మనే 'అపరబ్రహ్మ' అని కూడా అంటారు. పరబ్రహ్మకు అతిసమీపంగా ఉంటాడు కాబట్టి అపరబ్రహ్మను కూడా పరబ్రహ్మమనే అంటారు (సూత్రం 526)

ఉపాసన కోసం మనోమయాది గుణాలతో కూడినదిగా చెప్పబడే నిర్వికార బ్రహ్మమే కార్యబ్రహ్మము. అందుచేతనే సగుణ బ్రహ్మను కూడా బ్రహ్మమనే అంటారు. అద్దంలో కనుపించేది ప్రతిబింబమే అయినా, దాన్నికూడా ముఖమనే అంటారు. అలాగే కార్యబ్రహ్మ కూడా పరబ్రహ్మలాంటివాడే. పరబ్రహ్మకు ప్రతిరూపం అపరబ్రహ్మ. కల్పాంతాన కార్యబ్రహ్మ పరబ్రహ్మలో లీనమవుతాడు. బ్రహ్మలోకం చేరిన ఉపాసకులు కూడా అతనితోపాటే పరబ్రహ్మలో లీనమవుతారు. ఇదే క్రమముక్తి.

ఉపాసకుడు ఏ దేవతను పరబ్రహ్మగా ఉపాసిస్తున్నాడో ఆ దేవతే కార్యబ్రహ్మ. వైష్ణవులకు విష్ణువు, శైవులకు ఈశ్వరుడు, శ్రీవిద్యాపరులకు పరాశక్తి కార్యబ్రహ్మలు. అందుచేతనే మరణానంతరము ఉపాసకుడు వైకుంఠము, కైలాసము, మణిద్వీపము మొదలైనవి చేరతాడు.

బ్రహ్మలోకం చేరినవారు కల్పాంతము వరకు బ్రహ్మలోకంలోనే ఉండి, కల్పాంతన కార్యబ్రహ్మతో పాటుగా పరబ్రహ్మలో లీనమవుతారు. ఉపాసకులకు బ్రహ్మలోకమే ప్రాప్తి. అంటే ఇక్కడ ఉండేది కార్యబ్రహ్మ కాదు పరబ్రహ్మమే అని కొంతమంది చెబుతుంటారు. కాని సగుణోపాసకులకు కార్యబ్రహ్మ, నిర్గుణోపాసకులకు పరబ్రహ్మ. సగుణోపాసకులు బ్రహ్మలోకం చేరితే, నిర్గుణోపాసకులు పరబ్రహ్మలో లీనమవుతారు. సాయుజ్యం పొందుతారు.

5. ఆహార నియమాల సడలింపు

సామాన్యంగా ఆహారం తీసుకునేటప్పుడు ఇవి తినవచ్చు, ఇవి తినకూడదు అంటారు. అందులోను ప్రత్యేకంగా కొంతమంది వ్యక్తులు ఈ పదార్థాలే తినాలి అంటారు. ఇలా ఆహారానికి నియమాలు ఏమైనా ఉన్నాయా?

మనం చేసే పనిని బట్టి ఆహారం తీసుకోవాలి. లేకపోతే ఆరోగ్యం దెబ్బ తింటుంది. శరీర దారుఢ్యం కావలసినవారు అంటే సైనికులు, ఆటగాళ్ళు, మల్లయోధులు మాంసము, బలవర్ధకమైన ఆహారము తీసుకోవాలి. తెలివితేటలు కావలసిన వారు వాటిని పెంచే ఆహారం తీసుకోవాలి.

ఘృతేన వర్ధతే బుద్ధి క్షీరేణ ఆయుష్యవర్ధతే ।
శాకేన వర్ధతే రోగం మాంసం మాంసేన వర్ధతే ॥

అంటోంది ఆయుర్వేదం. దీన్ని బట్టి మన అవసరానికి అనుగుణంగా ఆహారం తీసుకోవాలి.

సత్త్వగుణ ప్రధానులైనవారు దానికి తగిన ఆహారమే తీసుకోవాలి. ఉదా : బ్రాహ్మణుడు ఉల్లిపాయ తినరాదు అంటారు. ఎందుకని అంటే నిరంతరము సత్యాన్వేషణలో ఉండేవాడు బ్రాహ్మణుడు. అతడికి సత్త్వగుణం కావాలి. ఉల్లిపాయ రజోగుణాన్ని పెంచుతుంది. ఈ రెండింటికీ సరిపడదు. అందుకే బ్రాహ్మణుడు ఉల్లిపాయ తినరాదు. అంతేగాని, తింటే అతడికి అరగదు అని మాత్రంకాదు.

భక్ష్యాభక్ష్య నిర్ణయ శాస్త్రం ఈ విధంగా చెప్పింది కాబట్టి అలాగే చెయ్యాలి. (బ్ర.సూ. 454)

వేదంలో "ఆహారం నిర్మలంగా, పరిశుద్ధంగా ఉంటేనే మనసు కూడా పరిశుద్ధంగా ఉంటుంది" అని చెప్పబడింది. అందుకే ఇది తినవచ్చు, ఇది తినరాదు అని నిర్ణయించబడింది.

మోక్షమార్గంలో నడిచే వారికి ప్రత్యేకంగా కొన్ని ఆహార పదార్థాలు చెప్పారు. ఉప్పు, కారం పనికిరావు. రుచి ఉండకూడదు. కేవలము కందమూలాలు ఉడికించి తినాలి. చెట్టు నుంచి చిలకలు కొరికితే క్రింద రాలిన పండ్లు, కోతులు రాల్చిన కాయలు వంటివి ఏరుకుని తినాలి. వీరు తినే కాయగూరలు తమ పెరట్లో పండినవే కావాలి. ఇప్పుడు మనం వాడుతున్నట్లుగా డ్రైనేజి నీళ్ళతో పండిన కాయగూరలు

వాడరాదు. వంట చేసేవారు కూడా మంచి మనసుతో, మనమీద అమితమైన భక్తి, ప్రేమ, అభిమానము కలిగి ఉండాలి. అందుకే ఎవరు పడితే వారు వండినవి, ఎక్కడ పడితే అక్కడ తినరాదు. కాని ప్రాణాపాయ స్థితిలో నియమాలను పాటించవలసిన అవసరం లేదు.

ఛాందోగ్యోపనిషత్తులో విరాట్‌ప్రాణానికి విరాట్‌అన్నమే ఆహారము అని చెప్పబడింది. అంటే అన్నిరకాల పదార్థాలను భక్షించవచ్చు అని చెప్పబడింది. అలాగే ఉషస్తికథలో **ప్రాణంపోయేసమయంలో మాత్రమే నియమోల్లంఘనం చెయ్యవచ్చు** అని చెప్పబడింది. కురుదేశంలో ఇభ్య అనే పల్లె ఉన్నది. ఆ పల్లెలో ఉషస్తి అనే ఋషి ఉండేవాడు. అతని భార్యపేరు ఆటకి. ఉషస్తి వేదవేదాంగ విదుడు, పండితుడు.

ఒకసారి కురుదేశంలో భయంకరమైన కరువు వచ్చింది. పంటలు పండలేదు. కాటకం విలయతాండవం చేస్తోంది. తినటానికి ఎక్కడా ఏమీ దొరకలేదు. తిండిలేక ప్రజలు మలమల మాడిపోతున్నారు.

ఆ రోజుల్లో ఉషస్తి ఆహారం లేక బాధపడుతూ ఒక మావటి వాడి దగ్గరకు వెళ్ళి తినటానికి ఏమైనా పెట్టమని అడిగాడు. అప్పుడా మావటివాడు భయపడుతూ "బ్రాహ్మణోత్తమా! నావద్ద మినుములు తప్ప ఏమీలేవు. అవి కూడా నేను ఎంగిలి చేసినవి. కాబట్టి నేను మీకు ఏమి ఇవ్వగలను?" అన్నాడు. దానికి ఉషస్తి.

"ఫరవాలేదు. ఆ ఎంగిలి చేసినవే నాకు కొద్దిగాపెట్టు" అన్నాడు. మావటివాడు ఆ ఎంగిలి మినుములు కొన్ని ఉషస్తికి దానం చేసి, తాగటానికి నీరు కూడా ఇచ్చాడు.

ఉషస్తి మినుములను మాత్రం తిని నీరు వద్దన్నాడు. ఆ మాటలకు ఆశ్చర్యపోయిన మావటి "బ్రాహ్మణోత్తమా! ఎంగిలి మినుములు తిన్నావు కదా! మరి ఎంగిలి నీరు త్రాగటానికి అభ్యంతరం ఏమిటి?" అన్నాడు.

దానికి ఉషస్తి 'మిత్రమా! ప్రాణము నిలుపుకోటానికి ఎక్కడి ఆహారమైనా తినవచ్చు. అందులో దోషంలేదు. ఇప్పుడు నాకు ఓపిక వచ్చింది. కాబట్టి నీవిచ్చే నీళ్ళు అవసరం లేదు' అన్నాడు. అంటే అభ్యంతరం ఉన్నది అనే చెప్పాలి. చాలా రోజుల నుంచి ఆహారం తీసుకోలేదు. దాంతో నీరసం వచ్చి పడిపోయాడు లేవలేడు. అటువంటి స్థితిలో ఒక శూద్రుని దగ్గర ఆహారం ఉంది. దాన్ని తీసుకుని తినవచ్చా? లేదా? ఇక్కడ గమనించాల్సింది ఏమంటే – మనం జీవించి ఉంటే సంప్రదాయాలు

పాటిస్తాం. మనమే లేకపోతే ఈ సంప్రదాయాన్ని పాటించేదెవరు? కాబట్టి ముఖ్యమైనది ఏమంటే, అటువంటి స్థితిలో ముందు ప్రాణాలు నిలబడాలి. లేకపోతే అసలుకే మోసం వస్తుంది. అంటే ప్రాణాపాయ స్థితిలో ఆహార నియమాలకు సడలింపు ఉన్నది.

ప్రాణాపాయ స్థితిలో ఏ విధమైన అన్నానైనా తినవచ్చును అని వేదం చెబుతోంది. ఆ మాటే ఛాందోగ్యోపనిషత్తు, బృహదారణ్యకోపనిషత్తులలో కూడా చెప్పబడింది. కుక్కలు, పిల్లులు, పక్షులు మొ॥ జంతువుల ఆహారమే నీకు ఆహారము "విరాట్‌ప్రాణానికి విరాట్‌అన్నమే ఆహారము" కాబట్టి ప్రాణాపాయ స్థితిలో ఏ ఆహారమైనా తినవచ్చును. ఆహార నియమం ఆ సమయంలో లేదు. (బ్ర.సూ.453)

స్మృతులలో కూడా ఈ విషయం చెప్పబడింది. మనుస్మృతిలో 'ప్రాణాపాయ స్థితిలో భక్ష్యాభక్ష్య విచారణ లేకుండా ఏ వస్తువైనా తినవచ్చును అని చెప్పబడింది. (బ్ర.సూ. 455) ఎటువంటి సమయంలో నైనా మధ్యము మాత్రము నిషేధము.

మామూలు పరిస్థితులలో మాత్రం మోక్షగామికి ఆహార విషయంలో స్వేచ్ఛ పనికిరాదు. శాస్త్రం అంగీకరించిన వాటినే తినాలి. ప్రాణాపాయ స్థితిలో ఆహార నియమాలకే కాదు. అన్ని నియమాలకు సడలింపు ఉంది. మనమంటూ ఉంటేనే నియమాలు, సంప్రదాయాలు.

పూర్వకాలంలో కేరళ రాష్ట్రంలో ఒక పండితుడు. చాలా గొప్పవాడు. ఆచారాలకు సంప్రదాయాలకు విలువ ఇచ్చేవాడు. కుమార్తెకు వివాహం చేశాడు. కాని విధివశాత్తు చిన్నప్పుడే భర్త మరణించాడు. ఆ పిల్ల తండ్రి వద్దే ఉంటోంది. ఆ పిల్లకు ఇరవై సంవత్సరాలు ఉంటుంది. ఒకరోజున ఆ పండితుడు భార్యా, కుమార్తెతో కలిసి యాత్రలకు బయలుదేరాడు. ఇంటిపాలేరు బండి తోలుతున్నాడు. మధ్యాహ్నాం పన్నెండు గంటలు. ఎండ మండిపోతుంది. విపరీతమైన దాహం వేస్తోంది. త్రోవలో ఒకచెరువు కనిపించింది. బండి ఆపారు. చెరువులో దిగి తనివితీరా నీరు త్రాగారు. ఇంతలోనే ఊహించని విధంగా పండితుని కుమార్తె చెరువులో పడిపోయింది. మునిగిపోతోంది. తల్లి తండ్రి పెద్దగా కేకలు పెడుతున్నారు. కుమార్తె మునిగిపోతోంది. పాలేరు ధైర్యం చేసి చెరువులో దూకి ఆ పిల్ల చెయ్యి పట్టుకుని బయటకు లాగాడు. కుమార్తె ప్రాణాలతో బయట పడింది. కాని పాలేరువాడు పిల్ల చెయ్యి పట్టుకున్నాడు.

సంప్రదాయం ప్రకారం కుమార్తె మైలపడింది. అందుకని ఆ పండితుడు ఆ అమ్మాయిని అక్కడ వదిలేసి ఇంటికి వెళ్ళిపోయాడు. ఆ అమ్మాయి గతి ఏమిటి?

ఇటువంటి నియమాలే పనికిరావు అంటున్నాడు వ్యాసభగవానుడు. **ప్రాణాపాయ స్థితిలో నియమోల్లంఘన చేయవచ్చు. మామూలు స్థితిలో కాదు. మనమంటూ ఉంటే సంప్రదాయాలు, నియమనిష్ఠలు, ఆచార వ్యవహారాలు ఉంటాయి. కాబట్టి ప్రాణాపాయ స్థితిలో నియమాలను ఉల్లంఘించవచ్చును. అంటున్నారు పరమానందనాథులు.**

6. పరబ్రహ్మ లక్షణాలు

పరబ్రహ్మ లక్షణాలు ఏవి? అనేది అనేకసార్లు ఉపనిషత్తులలోను, పురాణాల లోను కూడా వివరించబడింది. **ఎవ్వనిచే జనించు జగము, ఎవ్వని లోపల నుండు లీనమై.** ఆ పరమేశ్వరియే ఈ జగత్తుకు సృష్టికర్త. సృష్టికి ముందు ఈ జగత్తంతా ఆ పరాశక్తిలోనే లీనమై ఉన్నది. తనలో అంతర్గతంగా ఉన్న సృష్టిని బహిర్గతం చేసింది. అందుకే ఒకపరి జగముల వెలినిడి, ఒకపరి లోపలికి గొనుచు తనలో దాగి ఉన్నటు వంటి లోకాలన్నింటిని బయటకు పంపుతున్నది. అంటే సృష్టి చేస్తున్నది. అలాగే ఈ లోకాలను తనలోపలికి తీసుకుంటున్నది. అనగా జగత్తును లయం చేస్తున్నది. ఈ రకంగా సృష్టి, లయము రెండూ చేస్తూ, జగములు ప్రవర్తిల్ల చేస్తున్నది. అనగా స్థితికార్యంకూడా చేస్తున్నది. ఇదే విషయాన్ని **తైత్తిరీయోపనిషత్తు**లో చెప్పటం జరిగింది.

జీవులు దేని నుంచి పుడుతున్నాయో, దేనివల్ల జీవిస్తున్నాయో, చివరకు దేనియందు లీనమవుతున్నాయో, అదే బ్రహ్మము అని తెలుసుకో.

వరుణ మహర్షి కుమారుడు భృగుమహర్షి. విద్యాభ్యాసం పూర్తి చేసి తండ్రి దగ్గరకు వచ్చి బ్రహ్మవిద్యను చెప్పమని అడిగాడు. ఆ మాటలు విన్న వరుణమహర్షి 'నాయనా ! జీవులన్నీ దేని నుంచి పుట్టి, దేనివల్ల జీవించి, దేనియందు లయం చెందుతున్నాయో అదే పరబ్రహ్మ. ఇది ఒకరు చెబితే తెలిసేది కాదు. వెళ్ళి తపస్సు చెయ్యి' అన్నాడు. తండ్రి మాటల ననుసరించి కొంత కాలం తపస్సు చేశాడు భృగువు. ఇప్పుడు

అన్నం పరబ్రహ్మ స్వరూపము అని తెలిసింది. అదే మాట తండ్రికి చెప్పాడు. 'అన్నం కూడా పరబ్రహ్మ స్వరూపమే. కాని అన్నమే పరబ్రహ్మ కాదు. మళ్ళీ వెళ్ళి తపస్సు చెయ్యి' అన్నాడు తండ్రి.

కొంత కాలం తపస్సు చేశాడు భృగువు. ప్రాణము పరబ్రహ్మ అని తెలిసింది. అదే మాట తండ్రికి చెప్పాడు. 'ప్రాణం కూడా పరబ్రహ్మమే. కాని ప్రాణమే పరబ్రహ్మ కాదు. మళ్ళీ వెళ్ళి తపస్సు చెయ్యి.' అన్నాడు తండ్రి.

మళ్ళీ కొంత కాలం తపస్సు చేశాడు భృగువు. ఇప్పుడు మనస్సే పరబ్రహ్మ అని తెలిసింది. అదే మాట చెప్పాడు తండ్రికి. 'మనసుకూడా పరబ్రహ్మమే. కాని మనసే పరబ్రహ్మ కాదు. మళ్ళీ వెళ్ళి తపస్సు చెయ్యి' అన్నాడు తండ్రి.

ఇంకా కొంతకాలం తపస్సు చేశాడు భృగువు. ఇప్పుడు విజ్ఞానమే బ్రహ్మ అని తెలిసింది. అదే మాట చెప్పాడు తండ్రికి. 'విజ్ఞానం కూడా పరబ్రహ్మమే. కాని విజ్ఞానమే పరబ్రహ్మ కాదు. మళ్ళీ వెళ్ళి తపస్సు చెయ్యి' అన్నాడు.

ఆనందం నుంచే జీవులన్నీ పుడుతున్నాయి. ఆనందంతోనే బ్రతుకుతున్నాయి. చివరకు ఆనందంలోనే లీనమవుతున్నాయి. కాబట్టి ఆనందమే పరబ్రహ్మ. ఆ మాట వినగానే సంతోషించాడు తండ్రి. కుమారుడికి బ్రహ్మోపదేశం చేశాడు. సమస్త భూతాలు, సమస్త ప్రాణులు ఎవరివలన పుట్టి, ఎవరివలన జీవించి, ఎవరియందు లయం అవుతాయో అతడే బ్రహ్మ అన్నాడు. ఆ పరబ్రహ్మ ఆదిమధ్యాంత రహితుడు, జన్మమృత్యుజరాదులు లేనివాడు. **సత్యం జ్ఞానమనన్తం బ్రహ్మ.** అతడు సత్యస్వరూపుడు. జ్ఞానరూపుడు. అనంతుడు. దేశకాల వస్తుకృతమైన మార్పులు లేనివాడు. జగత్తుకు ఆధారమైనవాడు.

పరమాత్మ నిరాకారుడు, నిర్గుణస్వరూపుడు. అనగా దేనియందు ఆసక్తి లేనివాడు కదా ! మరి అలాంటప్పుడు సృష్టిస్థితిలయాలు ఎందుకు చేస్తున్నాడు? వీటితో అతడికి సంబంధం ఏమిటి? అసలు సృష్టి చెయ్యటమనేది అతని లక్షణమా? లేక తన వినోదం కోసం చేస్తున్నాడా? ఇది అనుమానం. దీనికి సమాధానం చూడండి.

భగవంతుడు ఆకారం లేనివాడు. ఇచ్ఛారహితుడు. గుణరహితుడు అనేది నిజమే. అయితే ఈ సృష్టి ఎందుకు చేస్తున్నాడు అన్నదే ప్రశ్న. నిరాకారుడు, నిర్గుణ

స్వరూపుడు అయిన పరబ్రహ్మ ఈ సృష్టి చెయ్యాలి అనుకున్నటువంటి వాడై తనలోని కొంతశక్తిని బయటకు పంపాడు. అయితే అసలు సృష్టి చెయ్యాలని ఎందుకు అనుకున్నాడు? గతంలో ప్రళయం సంభవించినప్పుడు కర్మ పరిపక్వం కాకుండా తనలో లీనమై పోయిన జీవరాశుల యొక్క కర్మను క్షయం చేసి, వాటికి మోక్షం కలిగించాలనే ఆలోచనతో సృష్టి చెయ్యాలని సంకల్పించాడు" అయితే కర్మపరిపక్వం కాని జీవరాశులు పరబ్రహ్మలో ఏ విధంగా లీనమైనాయి?

జగత్తంతా లయం అయిపోగానే జీవరాశి అంతా నశించిపోయింది. వస్తుజాలము రూపుమాసిపోయింది. ఈ పరిస్థితిలో కర్మక్షయం చెందిన జీవరాశులు పరమాత్మలో లీనమయిపోయినాయి. అంటే సాయుజ్యం పొందినాయి. మరి కర్మక్షయం కాని జీవుల సంగతి ఏమిటి? కర్మఫలాన్ని అనుభవించటానికి మళ్ళీ జన్మ ఎత్తాలి కదా ! మరి అవి ఏ విధంగా పరబ్రహ్మలో లీనమైపోతాయి? అన్నదే ప్రశ్న. ప్రళయ కాలంలో కర్మక్షయం అయిన జీవరాసితో పాటు కర్మక్షయం చెందని జీవులు కూడా తమయొక్క కర్మను తమతోపాటుగా మూటకట్టుకుని పరమేశ్వరునిలో లీనమవుతాయి. ఈ రకంగా కర్మక్షయం కాకుండా తనలో ఉన్న జీవరాశులు కర్మలను క్షయం చేసి వాటికికూడా మోక్షం ప్రసాదించాలనే కోరికతో సృష్టి కార్యక్రమము చేస్తున్నాడు పరబ్రహ్మ. కాబట్టి చరాచర జగత్తును సృష్టించటము అనేది జీవులకు మోక్షము ప్రసాదించటానికే కాని తన లీలా వినోదం కోసం మాత్రం కాదు. అసలు పరమేశ్వరుడికి లీలావినోదం అనేది ఉండదు. ఈ రకంగా సృష్టిస్థితిలయాలు చెయ్యటం పరమేశ్వరుని యొక్క లక్షణమే కాని వేరు కాదు.

సృష్టి చెయ్యటము పరమేశ్వరుని లక్షణమే. ఐతరేయోపనిషత్తులో ఈ విషయం పూర్తిగా వివరించబడింది. "ఆత్మయే ఆలోచనా పూర్వకంగా ఈ లోకాలను సృష్టించింది. సృష్టి జరగటానికి ముందు జగత్తు అంతా బ్రహ్మమయంగానే ఉండేది. దానికి భిన్నమైన పదార్థం ఏదీ లేదు. దానినే 'ఆత్మ' అంటారు. ఆ ఆత్మయే లోకాలను సృష్టించాలి అనుకున్నది. కొంతకాలానికి అంభస్సు, మరీచి, ఆపః, మర అనే పేర్లు గల లోకాలను సృష్టించింది.

ద్యులోకానికి ఆవల ఉన్నది అంభస్సు. దానికి ఆశ్రయము సువర్లోకము. అదే స్వర్గము. దానిక్రింద భువర్లోకమున్నది. దాని క్రింద భూలోకమున్నది. ఇది మరణము

గుణముగా గలది. ఇక్కడ పుట్టిన ప్రతిప్రాణీ మరణిస్తుంది. భూలోకానికి క్రిందగా జలలోకమున్నది. అది క్రిందనున్న లోకాలచే పొంద బడుతున్నది. కాబట్టి అపోలోకమనబడుతుంది. ఈ లోకాలన్నీ పంచభూతాలచే నిర్మించబడ్డాయి. ఈ రకంగా లోకాలను సృష్టించిన తరువాత విరాట్ స్వరూపాన్ని, ఇంద్రియాలను, ఇంద్రియాలకు అధిష్టాన దేవతలను సృష్టించింది పరమేశ్వరి. ఆ తరువాత అన్నాన్ని సృష్టించింది. ఇప్పుడు ప్రాణికోటిని సృష్టించింది. ఈ మానవ శరీరంలో నేను లేకపోతే ఎలాగ? అని ఆలోచించి బ్రహ్మరంధ్రం గుండా మానవశరీరంలో ప్రవేశించింది. ఈ రకంగా ఆత్మ లోకాలను, ప్రాణికోటిని సృష్టించి మానవులందరి లోనూ కూడా తాను ప్రవేశించింది. పరబ్రహ్మయే ఈ లోకాలను సృష్టించింది. ఈ రకంగా **సృష్టి చెయ్యటము అనేది బ్రహ్మయొక్క లక్షణము"**

సృష్టిలో మనకు కనుపించే ప్రతివస్తువూ పరిమితమైనది. నాశనమయ్యేది. అశాశ్వతమైనది. బ్రహ్మము దీనికి వ్యతిరేక లక్షణాలుగల శుద్ధ, బుద్ధ ముక్తస్వభావం గలది. ఇట్టి బ్రహ్మస్వరూపం ఎవరికీ అంత తేలికగా తెలిసేది కాదు గదా? ఇలా అంటే బ్రహ్మమనేది అప్రసిద్ధమైనది. ప్రసిద్ధమైన దానికే లక్షణాలుంటాయి. మరి బ్రహ్మ అప్రసిద్ధమైనది కదా? దానికి లక్షణము ఉండదు కదా?" ఇది అనుమానం. తైత్తిరీయోపనిషత్తులో చెప్పినట్లుగా నామరూపాత్మకమైన జగత్తు అంతా కూడా పరబ్రహ్మ వల్లనే జరుగుతున్నది. ఈ రకంగా సృష్టించబడిన జగత్తుకు ఉపాదాన కారణము, నిమిత్త కారణము రెండూ కూడా బ్రహ్మమే.

ఉపాదాన కారణము అనగా – ప్రధాన కారణము

నిమిత్త కారణము అనగా – ఉపకారణము

చిత్రకారుడు ముందుగా చిత్రాన్ని మనసులో ఊహించుకుని, తరువాత చిత్రాన్ని గీసినట్లే, పరబ్రహ్మ కూడా నామరూపాత్మకమైన జగత్తును ముందుగానే ఊహించి తరువాతనే సృష్టిస్తున్నాడు. పరబ్రహ్మ సర్వశక్తి సంపన్నుడు. అందుచేతనే అనేక పేర్లు, రూపాలు, కర్తలు, భోక్తలు, క్రియాఫలాలు గల ఈ జగత్తును సృష్టిస్తున్నాడు. కాబట్టి ఈ సృష్టికి కారణము బ్రహ్మ. సృష్టి అనేది అతనిలక్షణం.

"జాయతే అస్తి పరిణమతే వర్ధతే క్షీయతే వినశ్యతి"

అని సృష్టి పరిణామము ఆరు విధాలుగా 'నిరుక్తం'లో చెప్పబడింది. నిరుక్తము అంటే వేదానికి నిఘంటువు. అందులో

జాయతే	–	పుడుతున్నది
అస్థి	–	అస్థిత్వము పొందుతున్నది
పరిణమితే	–	పరిణామాన్ని పొందుతున్నది
వర్ధతే	–	వర్ధిల్లుచున్నది. పెరుగుచున్నది
క్షీయతే	–	క్షీణిస్తున్నది
నశ్యతి	–	నశించుచున్నది

అయితే ఈ ఆరు దశలు ఒకదానితో ఒకటి కలిసి మొత్తం మూడే అవుతాయి.

పుట్టుక, అస్థిత్వము	–	సృష్టి
పరిణామము పొందటము, వర్ధిల్లటము	–	స్థితి
క్షీణించటము, నశించటము	–	లయము

ఈ రకంగా ఈ ఆరు దశలూ, రెండు రెండు దశలు కలిసిపోయి మొత్తం మూడు దశలు అవుతున్నాయి. అవే సృష్టి, స్థితి, లయాలు. వీటన్నింటికీ కారణం పరబ్రహ్మ."

సృష్టి స్థితి లయాలకు కారణం పరబ్రహ్మ అంటున్నారు. మరి ఇతర మతస్తులు అంటే సాంఖ్యులు, శూన్యవాదులు మొ॥ వారు ఒప్పుకుంటారా?" అనేది అనుమానం.

"సాంఖ్య మతంలో సృష్టికి కారణం 'ప్రకృతి'. అయితే ప్రకృతి జడము. కాబట్టి జడంవల్ల ఈ సృష్టి జరగదు. శూన్యవాదులు సృష్టి స్థితి లయాలకు కారణం 'శూన్యం' అంటారు. కాని శూన్యమనేది అభావరూపం. జగత్తు భావరూపం. ఇసుక నుండి నూనెరానట్లే అభావంనుంచి భావం ఉత్పత్తి కాదు.

అణువాదులు ఈ జగత్తంతా అణువులచేత నిర్మించబడినది అంటారు. అణువులు జడములు. కాబట్టి జడములైన అణువులు తమంత తాము సృష్టి చెయ్యలేవు. నైయాయికులు అంటే న్యాయశాస్త్రం తెలిసినవారు సృష్టి స్థితి లయాలకు కారకుడుగా ఈశ్వరుణ్ణి అనుమాన ప్రమాణంతో నిరూపిస్తారు.

ఎవరు ఏం చెప్పినప్పటికీ సృష్టి స్థితి లయాలకు పరమేశ్వరుడే కారణము. సాలెపురుగు తన నోటిలో నుండి వచ్చిన దారంతో గూడుఅల్లి మళ్ళీ దాన్ని తన నోటిలోకి తీసుకున్నట్లు గానే పరమేశ్వరుడు ఈ జగత్తును సృష్టించి మళ్ళీ తనలో లీనం చేసుకుంటాడు. అక్షర స్వరూపుడైన పరబ్రహ్మనుంచే ఈ జగత్తు సృష్టించబడి మళ్ళీ అతనిలో లీనమై పోతున్నది.

అవిద్య ఆవరించటం వల్ల మానవుడు ఈ విషయం తెలుసుకోలేకపోతున్నాడు. అటువంటి అజ్ఞానికి గనక ఎవరైనా ఒక గురువు జ్ఞానోదయం చేసినట్లైతే అతడు ఆత్మస్వరూపాన్ని పొంది దుఃఖము నుంచి విముక్తుడౌతాడు. మరి ఆత్మజ్ఞానం పొందటం ఎలా? ఈ విషయం ఛాందోగ్యోపనిషత్తులో వివరించబడింది.

ఉద్దాలకుడు తన కుమారుడైన శ్వేతకేతువుకు ఆత్మజ్ఞానం పొందే మార్గం వివరిస్తున్నాడు.

"నాయనా! ఒక మనిషిని కళ్ళకు గంతలు కట్టి, చేతులు కదలకుండా కట్టేసి దట్టమైన అరణ్యంలో త్రోవ తెలియని చోట వదిలేశామనుకో, అప్పుడు అతడు ఏం చేస్తాడు? పెద్దగా అరుస్తాడు. త్రోవ కనపడదు. భయపడతాడు. ఏడుస్తాడు. ఇప్పుడు ఎవరైనా వచ్చి కళ్ళగంతలు విప్పేశారనుకో. అప్పుడు అతడు దోవ వెతుక్కుంటూ కనిపించిన వారిని తన ఇంటికి దోవ అడుగుతూ చివరకు ఇల్లు చేరగలుగుతాడు. అదే విధంగా అజ్ఞానంతో కొట్టుమిట్టాడుతున్న మానవుడు తన లక్ష్యమైన ఆధ్యాత్మిక సాధన కోసమే ప్రయత్నించాలి. మనం వేసే ప్రతి అడుగుకూ గమ్యం ఆత్మే కావాలి. అప్పుడు అతడికి ఆత్మసాక్షాత్కారం జరిగి అతడే పరబ్రహ్మ అవుతాడు."

సృష్టి, స్థితి, లయము, తిరోదానము, అనుగ్రహము వీటినే పంచకృత్యములు అంటారు. ఇవన్నీ సాక్షాత్తు పరమేశ్వరుని వల్లనే జరుగుతాయి. ముక్తపురుషులుకూడా ఈ పనులు చెయ్యలేరు. ఈ విషయమంతా రెండవ సూత్రంలో వివరించబడింది.

7. బ్రహ్మము ఆనందమయము

ఈశ్వరుడొక్కడే. అయినప్పటికీ సాకారుడు, నిరాకారుడని రెండుగా చెప్పబడుతున్నాడు. నామరూపాలున్న వాడు, ఆకారంలో మార్పు చెందేవాడు, ఉపాధి అంటే శరీరము గలవాడు ఉపాస్యుడు. ఉపాసన చేయబడతాడు. జపాలు, పూజలు, అర్చనలు అభిషేకాలు అతనికే జరుగుతాయి. నామరూప వికారాలు లేనివాడు నిరాకారుడు జ్ఞేయుడు తెలుసుకోదగినవాడు అనబడతాడు. ఈ ఇద్దరిలో ఎవరు బ్రహ్మ అనే అనుమానం వస్తుంది. ఇక్కడ మనం గుర్తించవలసిన విషయం ఏమంటే **'వీరిద్దరిలో ఎవరివల్లైతే నీకు ఆనందం కలుగుతుందో అతడే బ్రహ్మ.**

తైత్తిరీయోపనిషత్తులో అన్నమయ, ప్రాణము, మనోమయ, విజ్ఞానమయ కోశాలు దాటిన తరువాత ఆనందమయ కోశమున్నది. అదే పరమాత్మ స్థానము. చరాచర జగత్తంతా బ్రహ్మమయమే. సృష్టికి పూర్వం అంతా శూన్యంగానే ఉండేది. ఆ శూన్యంలో పరబ్రహ్మ ఒక్కడే ఉండేవాడు. అతడే నామరూపాత్మకమైన జగత్తును సృష్టించాడు. అతడే ఆనందమయుడైన బ్రహ్మ.

బ్రహ్మను తెలుసుకున్నవాడు మోక్షానికి అర్హుడు. అంటే తానే పరబ్రహ్మ అవుతాడు. దహరాకాశంలో ఉన్న పరబ్రహ్మని తెలుసుకున్న వాడికి జ్ఞానము, ఇష్టకామ్యార్థ సిద్ధి కలుగుతుంది. సాయుజ్యం లభిస్తుంది.

ఆనందమయుడు బ్రహ్మ. అంటే ఆనందాన్ని కలుగజేసేవాడు బ్రహ్మ. ఆనందము అంటే క్షణికమా? శాశ్వతమా? తైత్తిరీయోపనిషత్తులో చెప్పినట్లుగా,

భీషాఽస్మాద్వాతః। పవతే భీషోదేతి సూర్యః। భీషాఽస్మాదగ్నిశ్చేన్ద్రశ్చ।
మృత్యుర్ధావతి పఞ్చమ ఇతి। సైషాఽఽనన్దస్య మీ మాగ్ంసా భవతి
యువా స్యాత్సాధు యువాధ్యాయకః ఆశిష్ఠో ద్రఢిష్ఠో బలిష్ఠః।
తస్యేయం పృథివీ సర్వా విత్తస్య పూర్ణాస్యాత్।
స ఏకో మానుష ఆనన్దః। శ్రోత్రియస్య చాకామహతస్య।
తేయే శతం మానుషానన్దాః।
స ఏకో మనుష్య గన్ధర్వాణామానన్దః।

శ్రోత్రియస్య చాకామహతస్య ।

తే యే శతం మనుష్యగన్ధర్వాణామానన్దః ।

స ఏకో దేవగన్ధర్వాణా మానన్దః । శ్రోత్రియస్య చాకామహతస్య ।

తే యే శతం దేవగన్ధర్వాణామానన్దః ।

స ఏకః పితౄణాం చిర లోకలోకానామానన్దాః ।

శ్రోత్రియస్య చాకామహతస్య ।

తే యే శతం పితౄణాం చిరలోకలోకానామానన్దః ।

స ఏక అజానజానాం దేవానామానన్దః । శ్రోత్రియస్య చాకామహతస్య ।

తే యే శతమాజానజానాం దేవానా మానన్దాః ।

స ఏకః కర్మ దేవానాం దేవానామానన్దః ।

యే కర్మణా దేవానపియన్తి । శ్రోత్రియస్య చాకామహతస్య ।

తేయే శతం కర్మదేవానాం దేవానామానన్దాః ।

స ఏకో దేవానామానన్దః । శ్రోత్రియస్య చాకామహతస్య ।

తేయే శతమిన్ద్రస్యా నన్దాః ।

స ఏక ఇన్ద్రస్యానన్దః శ్రోత్రియస్య చాకామహతస్య ।

తే యే శతం శతమిన్ద్రస్యానన్దాః ।

సఏకోబృహస్పతేరానన్దః । శ్రోత్రియస్య చాకామహతస్య ।

తే యే శతం బృహస్పతేరానన్దః ।

స ఏకః ప్రజాపతేరానన్దః । శ్రోత్రియస్య చాకామహతస్య ।

తే యే శతం ప్రజాపతే రానన్దాః । స ఏకో బ్రహ్మణ ఆనందః ॥

కోరికలను అనుభవించటం వల్ల పొందే ఆనందం క్షణికానందం. అనుభవించగానే ఈ ఆనందము తరిగిపోతుంది. రెండవది శాశ్వతమైన ఆనందం. అదే బ్రహ్మానందం. ఈ లోకంలోని సంపదఅంతా యువకుడు, సదాచార సంపన్నుడు, వేదాధ్యాయి, శరీరబలము గలవాడు అనుభవించటానికే ఉన్నది. ఇటువంటి వ్యక్తి అనుభవించే ఆనందాన్ని మానుషానందము అంటారు.

మానుషానందానికి నూరు రెట్లు	- మనుష్యగంధర్వానందం
మనుష్య గంధర్వానందానికి నూరురెట్లు	- దేవగంధర్వానందం
దేవగంధర్వానందానికి నూరురెట్లు	- చిరలోక పితరానందం
చిరలోకపితరానందానికి నూరురెట్లు	- అజానజదేవానందం
అజానజదేవానందానికి నూరురెట్లు	- కర్మదేవానందం
కర్మదేవానందానికి నూరురెట్లు	- దేవానందం
దేవానందానికి నూరురెట్లు	- ఇంద్రానందం
ఇంద్రుని ఆనందానికి నూరురెట్లు	- బృహస్పతి పొందే ఆనందం
బృహస్పతి ఆనందానికి నూరురెట్లు	- ప్రజాపతి ఆనందం
ప్రజాపతి ఆనందానికి నూరురెట్లు	- బ్రహ్మానందం

బ్రహ్మానందము అనేది ఐదు రకాల ఆనందాల కలయిక. అవి 1. జ్ఞానానందము 2. విషయానందము 3. ఆత్మానందము 4. అద్వైతానందము 5. యోగానందము.

ఇతడే ఆనందస్వరూపుడైన పరబ్రహ్మ.

ఆనందమయుడైన బ్రహ్మ పంచకోశముల లోపల ఉన్నాడు. అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ కోశముల మధ్య ఆనందమయ కోశమున్నది. అందులో ఉండే ఆనందమయ పురుషుడికి-

ప్రియము (తనవారిని చూచినప్పుడు కలిగే సంతోషము)	- శిరస్సు
మోదము (కోరుకున్నది లభించినప్పుడు కలిగే సంతోషము)	- దక్షిణ పక్షము
ప్రమోదము (మోదము ఎక్కువైనపుడు కలిగేది)	- ఉత్తర పక్షము
ఆనందము (అన్నింటినీ మించినది)	- ఆత్మ

అని చెప్పబడింది. ఇక్కడ చివరలో చెప్పిన ఆనందాన్ని మించినది లేదు. అదే పరమాత్మ. ఈ ఆనందాన్ని కోరికలు లేనివాడు కూడా పొందుతాడు.

బ్రహ్మము ఆనందమయము. **ఆనందోబ్రహ్మేతి వ్యజానాతు** అంటోంది తైత్తిరీయం. కాబట్టి ఆనందమే బ్రహ్మము ఈ విషయం 12 నుంచి 19 వరకు గల సూత్రాలలో వివరించటం జరిగింది.

8. కర్మఫలాన్నిచ్చేది పరమాత్మ

మానవులు ఇష్టము, అనిష్టము, మిశ్రమము అని మూడు రకాల కర్మఫలాలను అనుభవిస్తున్నారు. ఈ కర్మ ఫలాన్ని ఇచ్చేదెవరు. కర్మమా? ఈశ్వరుడా?

ప్రారబ్ధ కర్మ మూడు రకాలు

1. ఇచ్ఛాప్రారబ్ధము – పూర్తి ఇష్టంతో చేసిన పని.

2. అనిచ్ఛా ప్రారబ్ధం – ఇష్టం లేకపోయినా, తప్పనిసరిగా చేసేది.

3. పరేచ్ఛా ప్రారబ్ధము – ఇతరుల ఆనందం కోసం చేసిన కర్మ. ఈ కర్మల ఫలాన్నిచ్చేది ఆ పరమాత్మ.

ఉపపత్తి వల్ల కర్మ అనేది ఈశ్వరునివల్లనే కలుగుతోంది. సర్వాధికారి. సృష్టి స్థితి లయాలకు కారకుడు పరమేశ్వరుడు. ఆయన సర్వజ్ఞుడు కాబట్టి, కర్మలు ఆచరించనటువంటి వారికి, వారి వారి కర్మలను బట్టి ఫలితాన్ని ఇస్తాడు.

కర్మఫలాన్ని ఈశ్వరుడే ఇస్తాడని శ్రుతులు చెబుతున్నాయి.

అన్నభక్షణ చేసేవాడు, కర్మఫలాన్ని ఇచ్చేవాడు కూడా ఆ ఆత్మే. అని వేదాలు చెబుతున్నాయి. ధనాన్ని భోగాన్ని ఇచ్చేవాడు ఆ పరమాత్మే.

యాగాది రూపమైన ధర్మమే ఫలమిస్తుంది అని జైమిని అంటున్నాడు.

జైమిని పూర్వమీమాంస వ్రాశాడు. అందులో ఈశ్వరుణ్ణి అంగీకరించరు. కాబట్టి ఈశ్వరుడుగాని, యాగాదిదేవతలుగాని ఫలాన్ని ఇవ్వరని, కర్మలవల్ల కలిగిన **'అపూర్వము'** అనే సూక్ష్మశక్తే ఫలితము ఇస్తుంది అంటారు. కర్మము ఫలితము ఇవ్వదనే మాట వీరు కూడా అంగీకరిస్తున్నారు.

కాని కర్మయొక్క ఫలితాన్ని ఇచ్చేది ఈశ్వరుడు అంటాడు బాదరాయణుడు. (వ్యాసుడు) కర్మ అనేది స్వయంగాకాని, అపూర్వంగాకాని కర్మఫలానికి కారణం కాదు.

ఈ రకంగా అన్ని కర్మలకు ఫలాన్ని ఇచ్చేవాడు బ్రహ్మ. బ్రహ్మమే కారణము. **కౌశీతకీ ఉపనిషత్తు**లో ఆ పరమేశ్వరుడు ఎవరిని ఈ లోకం నుండి ఉద్ధరించాలనుకుంటున్నాడో, వారితో మంచి పనులు చేయిస్తాడు. అథోలోకాలకు పంపాలనుకునే

వారితో చెడ్డపనులు చేయిస్తాడు" అని చెప్పబడింది. కాబట్టి కర్మఫలాన్ని ఇచ్చేవాడు బ్రహ్మమే తప్ప వేరుకాదు. అదే పరాశక్తి.

ఈ విషయమంతా 356-359 సూత్రాలలో వివరించారు.

9. మోక్షము

ముక్తి, మోక్షము, జన్మరాహిత్యము, సాయుజ్యము ఇవన్నీ పర్యాయపదాలు ఐహిక బంధాల నుంచి విముక్తి పొందటమే ముక్తి. అదే మోక్షము. చరాచర జగత్తంతా పరమేశ్వర స్వరూపమే. జగత్తేపరమేశ్వరుడు, పరమేశ్వరుడేజగత్తు. ఈ విషయం తెలిసినవాడు మహాజ్ఞాని. అతని జీవాత్మ పరమాత్మలో లీనమవుతుంది. అతనికి పునర్జన్మఉండదు. అయితే ఇక్కడ చిన్నఅనుమానం వస్తుంది. ఇప్పుడు చెప్పిన విషయం మనకందరికీ తెలుసుకదా? పుస్తకాలు చదివి, ఉపన్యాసాలువిని తెలుసుకోవచ్చు. అదిచాలదు. మనసావాచాకర్మణా తెలుసుకోవాలి. అనుభవ పూర్వకంగా తెలుసుకోవాలి. అటువంటివాడే మహాజ్ఞాని. అతడే ముక్తపురుషుడు. ఇతడికి పిపీలికాదిబ్రహ్మపర్యంతము తనలానే కనిపిస్తుంది. ప్రతి వస్తువునందు, ప్రతిజీవియందు ఇతడు పరమాత్మని చూడగలుగుతాడు.

అయితే పూర్వకాలంలోలాగా ఈరోజుల్లో ఎక్కువమంది ఈజ్ఞానాన్ని పొందలేక పోతున్నారు. ముక్తులు కాలేకపోతున్నారు. కొందరైతే అనుకోని పొరపాట్లు, చేయకూడని పనులుచేసి అవమానాలుకూడా పొందుతున్నారు. దీనికి కారణం ఏమిటి? నిశితంగాఆలోచిస్తే భవబంధాలే కారణము అనిపిస్తోంది. మమ అనుకుంటే బంధము. నమమ అనుకుంటే మోక్షము. మోక్షంకావాలనుకున్నవాడు రాగద్వేషాలు, అహంకారమమకారాలు, అరిషడ్వర్గాలు అన్నీ జయించాలి. వీటిని జయించకుండానే సన్యసించటం, మోక్షంకావాలనుకోవటం జరుగుతోంది. అగ్ని చాలా గొప్పగా, బ్రహ్మాండంగా మండుతోంది. అయినప్పటికి మణి, మంత్ర, ఔషధాదులచేత కట్టడిచేయబడినట్లైతే, ఆఅగ్ని గడ్డిపోచనుకూడా దహించలేదు. అలాగే ఆత్మజ్ఞానము ఉన్నప్పటికీ బంధాలను వదలించుకోకపోయినట్లైతే అతడికి మోక్షం సిద్ధించదు.

ప్రతిబంధో వర్తమానో విషయాసక్తి లక్షణః

ప్రజ్ఞామాంద్యం కుతర్కశ్చ విపర్యయ దురాగ్రహః ॥

1. **విషయాసక్తి** – విషయముల యందు ఆసక్తి, కోరిక
2. **ప్రజ్ఞామాంద్యం** – బుద్ధి పరిశుద్ధం కాకపోవటం
3. **కుతర్కము** – ప్రతిదానికి విపరీతార్థాలు చెప్పటం
4. **విపర్యము** – అనాత్మ పదార్థాల యందు ఆత్మబుద్ధి కలిగి ఉండటం.
5. **దురాగ్రహము** – అనవసరంగా కోపం తెచ్చుకోవటం.

ఇవన్నీ రజోగుణ, తమోగుణ లక్షణాలు. మోక్షానికి ప్రతిబంధకాలు. ఇవి పోవాలంటే విపరీతమైన తపస్సు చెయ్యాలి. అగ్నిలో కట్టెలుదహించబడినట్లే, ఈ గుణాలు తపస్సువల్ల దహించబడతాయి.

ఈ విషయాల గురించి అనేకసార్లు వినవచ్చు. వినటంచాలదు. విన్నదాన్ని మననంచెయ్యాలి. విచారణచెయ్యాలి. ధ్యానంచెయ్యాలి. అప్పుడే విషయం గట్టి పడుతుంది. ఈ కారణంచేతనే నిరంతరము ధ్యానం చెయ్యాలి. ఇలా ధ్యానం చెయ్యగా చెయ్యగా, సముపార్జించిన జ్ఞానం బలపడుతుంది. ఒకచెట్టుకు పూలు, పిందలు, కాయలు, పండ్లు ఉన్నాయి. ఇప్పుడు మనకు కనిపిస్తున్న పండు కొన్ని రోజుల క్రితం కాయ, ఇంకొన్ని రోజుల క్రితం పింద, ఇంకొన్ని రోజుల క్రితం పూవు. అంత క్రితం మొగ్గ. ఆ మొగ్గే ఇప్పుడు పండు అయింది. ఇదే ముక్తావస్థ. పండుకు పులుపు, వగరు, చేదు అనేవి ఉండవు. అందులోని దోషాలు అన్నీ నశించిపోయి వేపకాయ అయినా సరే పండితే తియ్యగా ఉంటుంది. అలాగే **మానవుడిలో ఎన్ని దోషాలు ఉన్నా నిరంతర ధ్యానం వల్ల అవన్నీ నశించి ముక్తుడవుతాడు.** ఒకవేళ పండు ఇంకా పుల్లగా ఉన్నది అంటే, అది ఇంకా బాగా పండలేదు అని అర్థం. అలాగే మానవుడిలో ఎంత ధ్యానం చేసినా ఇంకా గుణదోషాలున్నాయి అంటే అతడికి ఇంకాపరిపక్వత సిద్ధించలేదని అర్థం.

మోక్షాన్ని వెతుక్కుంటూ మనం పరుగులు పెట్టవలసిన అవసరం లేదు. మోక్షార్హత సాధించిన వారిని అదే వెతుక్కుంటూ వస్తుంది. కావలసిందల్లా అర్హత సాధించటమే. కలెక్టరుకావాలి అంటే దానికికావలసిన అర్హత మనంసాధించాలి.

ఐఎఎస్ ప్యాసయినప్రతివారు కలెక్టరుఅవుతారు. ఇందులో సందేహంలేదు. ఐఎఎస్ ప్యాసవకపోతే ఎన్ని ప్రయత్నాలు చేసినా కలెక్టరు కాలేరు. అలాగే మోక్షానికి కావలసిన అర్హతఏమంటే బంధవిముక్తి. ఐహికబంధాల నుంచి విముక్తి పొందినవాడు, చరాచర జగత్తంతా పరమేశ్వరమయమనే జ్ఞానాన్ని అనుభవ పూర్వకంగా పొందినవాడు మోక్షం పొందుతాడు. అతడికి మాత్రమే పునర్జన్మ ఉండదు అంటున్నారు పరమానందనాథులు.

పుట్టుకతోనే ఎవరూ గొప్పవాళ్ళు కారు. గొప్పవారింట్లో పుట్టినంత మాత్రంచేత గొప్పదనం రాదు. గట్టి పట్టుదల, విశేషమైన ప్రయత్నము, కార్యదీక్షలు మనిషిని గొప్పవాడుగా చేస్తాయి. గొప్ప వంశంలో పుట్టినవారికి జన్మతః కొన్ని లక్షణాలు, సంస్కారాలు అబ్బుతాయి. **అజామీళుడు** ఉన్నతమైన కుటుంబంలో బ్రాహ్మణుడుగా జన్మించాడు. వేదవేదాంగాలు చదువుకున్నాడు. కాని భ్రష్టుడైపోయాడు. భాగవతంలో అంగరాజు చాలా గొప్పవాడు. పిల్లల కోసం పుత్రకామేష్టి చేసి ఒక కుమారుణ్ణి కన్నాడు. అతడే **వేనరాజు.** మహాదుర్మార్గుడు. చివరకు మునీశ్వరులు, ఋషీశ్వరులు అతణ్ణి సంహరించారు. పుట్టుకతోనే ఎవరూ గొప్పవాళ్ళు కారు. విపరీతమైన సాధనతోనే గొప్పవాళ్ళవుతారు. ఆలయంలో భగవద్దర్శనానికి ఎక్కి వెళ్ళే గడప, భగవంతుడి విగ్రహం రెండూ ఒకేరాయిలోని ముక్కలు. అయినా విగ్రహంగా ఉన్న రాయి పూజించబడుతోంది. గడప అందరిచేత త్రొక్కబడుతోంది. కారణం విగ్రహం కావటానికి ఆ రాయి ఎన్నివేల సుత్తి దెబ్బలు తిన్నదో లెక్కలేదు.

అలాగే మోక్షం కావాలంటే మోక్షం పొందాలంటే, జన్మరాహిత్యం జరగాలంటే కేవలము కోరికే కాదు. విపరీతమైన పట్టుదల కావాలి. ఐహిక భోగాలు, లౌకిక వాంఛలు అన్నీ వదిలెయ్యాలి. సాధించవలసిన విషయం మీదనే దృష్టి పెట్టాలి. ఇంకొక ఆలోచన మనసులోకి రాకూడదు. లింగపురాణంలో "మోక్షం పొందాలంటే ఏం చెయ్యాలి" అని శివుణ్ణి అడుగుతారు. దానికి ఈశ్వరుడు "మోక్షం పొందాలనే విపరీతమైన పట్టుదల ఉండాలి" అంటాడు. అలా పట్టుదల ఉన్నవాళ్ళే కావలసిన సాధన చేసి మోక్షము లేదా జన్మరాహిత్యము పొందుతారు.

ఇక్కడ గుర్తించాల్సిన విషయం ఇంకోటుంది. సామాన్యంగా అందరూ "నాకు ఇదే ఆఖరు జన్మ కావాలి. నాకు మోక్షం రావాలి' అంటుంటారు. మోక్షం అనేది

బస్సులోనో, రైల్లోనో, విమానంలోనో ఎక్కడినుంచో రాదు. అది మన దగ్గరే ఉంది. దాన్ని గుర్తించటమే మోక్షం.

ఐతరేయోపనిషత్తులో చెప్పినట్లుగా మానవదేహాన్ని సృష్టించిన తరువాత ఆత్మపురుషుడు ఈ దేహంలో బ్రహ్మరంధ్రం గుండా ప్రవేశించి, నవరంధ్రాలతోను అన్ని సుఖాలు అనుభవిస్తూ, తానువేరు, దేహంవేరు అనే మాట మర్చిపోయి, వచ్చిన దారికూడా గుర్తులేక, తానే దేహము అనే అజ్ఞానంలో కూరుకుపోయి జీవాత్మవేరు, పరమాత్మవేరు అనుకుంటున్నాడు. అజ్ఞానంగనక వదలిపోతే జీవాత్మ పరమాత్మ రెండూఒకటే అనేవిషయం తెలుస్తుంది. తానే పరమేశ్వర స్వరూపం అని తెలుసు కుంటాడు. అదేమోక్షస్థితి. కాబట్టి మోక్షమనేది ఎక్కడినుంచో రాదు. తనను తాను తెలుసుకోవటమే మోక్షము. స్వస్వరూపజ్ఞానమేమోక్షము.

కాబట్టి ఓ సాధకుడా ! **మోక్షమనేది క్రొత్తగా ఎక్కడినుంచోరాదు. అది నీ దగ్గరేఉన్నది. నిన్ను నువ్వు తెలుసుకోవటమే మోక్షము అంటున్నాడు పార్థసారథి.**

10. ముక్తపురుషుడు స్వస్వరూపంలోనే ఉంటాడు

జీవుడు శరీరంనుండిలేచి అంటే శరీరాన్నివదలి పరబ్రహ్మను పొంది స్వరూపంతో నిలుస్తున్నాడు అని ఛాందోగ్యోపనిషత్తు చెబుతోంది. ఇందులో చెప్పిన ముక్తి అనేది స్వర్గములాగా ఉంటుందా? స్వర్గము పొందినవాడు సుఖాలననుభవించి, ఉత్తరజన్మలు ఎత్తుతాడు. అలాగే ఈ ముక్తుడు కూడా ఏదైనా ఆధిక్యాన్ని పొందుతాడా? లేక స్వస్వరూపంతోనే ఉంటాడా?

జీవిలో ఉండేది జీవాత్మ. దాని అసలు స్వరూపం ఏమిటి అంటే పరమాత్మ. ఐతరేయోపనిషత్తులో చెప్పినట్లుగా, పరమాత్మ ఈ దేహాన్ని సృష్టించిన తరువాత నేను ఈ దేహంలో లేకపోతే ఎలా అనుకున్నాడు. అప్పుడు హకార సంజ్ఞగల పరమేశ్వరుడు సకారసంజ్ఞ గల ప్రకృతితో కలిసి శబళబ్రహ్మమై బ్రహ్మరంధ్రం గుండా ఈ దేహంలో ప్రవేశించి నవరంధ్రాల ద్వారా అన్ని రకాలైన లౌకిక సుఖాలు అనుభవిస్తూ వచ్చిన త్రోవనుకూడా మరచిపోయి తానే దేహము అనే అజ్ఞానంతో కూడిన భావనతో నిండిపోయి పంజరంలో బంధించబడిన పక్షిలాగా బయటకు వెళ్ళే మార్గం తెలియక కొట్టుమిట్టాడుతున్నాడు. జీవాత్మ పరమాత్మ రెండూ వేరువేరని

భావన చేస్తున్నాడు. అజ్ఞానం గనక తొలగిపోతే జీవాత్మ పరమాత్మ రెండూ ఒక్కటే అనే విషయం తెలుస్తుంది. ఈ దేహం నుంచి బయటకు పోయే మార్గం కూడా కనిపిస్తుంది. అప్పుడు జీవుడు బ్రహ్మరంధ్రం గుండా బయటకు వెళ్ళి స్వస్వరూపాన్ని పొందుతాడు. సంసారదశలో అవిద్య, అజ్ఞానంలో కూరుకుపోయిన జీవుడు అజ్ఞానం వదలిపోయి ఆత్మజ్ఞానం కలిగిన తరువాత శుద్ధుడు, ముక్తుడు అవుతున్నాడు. అటువంటి జీవుడికి ప్రియము అప్రియము అనేవి ఉండవు. ఆ జీవుడే దేవుడు. పురుషుడి అసలు స్వరూపం పరమాత్మే. అందుచేతనే ముక్తపురుషుడు స్వస్వరూపంలోనే ఉంటాడు. ప్రకాశరూపమైన ఆత్మసాక్షాత్కారం పొంది, ఆ ఆత్మస్వరూపంలో విద్వాంసుడు ఆవిర్భూతుడౌతాడు. జీవుడు తానైన రూపంలో ఉండటమే ముక్తి. అదే స్వరూపస్థితి. అజ్ఞానం వదలిపోగానే స్వస్వరూపం తెలుస్తుంది. కాబట్టి ముక్తి అనేది క్రొత్తగా ఎక్కడినుంచో రాదు.

ముక్తి పొందిన పురుషుడు పరిపూర్ణానంద స్వరూపంలో ఉండిపోతాడు. సంసార దశలో అవిద్యతో బంధించబడి, ఆత్మజ్ఞానం కలిగిన తరువాత శుద్ధుడు, ముక్తుడు అవుతున్నాడు. కాబట్టి ముక్తపురుషుడు స్వస్వరూపంలో అంటే ఆత్మరూపంలోనే ఉంటాడు. ఈ విషయం 534, 535, 536 సూత్రాలలో వివరించబడింది.

11. బ్రహ్మము స్వయంప్రకాశము

ఆత్మ అమితమైన ప్రకాశము గలది. దాని దగ్గర సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు ఏవీ ప్రకాశించవు. అంటోంది **ముండకోపనిషత్తు.**

బృహదారణ్యకోపనిషత్తులో “ఒకరోజున యాజ్ఞవల్క్యుడు జనక మహారాజు ఆస్థానానికి వచ్చాడు. అతడికి నమస్కరించి జనకమహారాజు తన సందేహాలు తీర్చమని అడిగాడు. అలాగే అన్నాడు యాజ్ఞవల్క్యుడు. ఇప్పుడు జనకుడు అడుగుతున్నాడు.

జ : మానవుడు ఏ వెలుగు వల్ల నిత్యకృత్యాలు సాగిస్తున్నాడు?

యా : సూర్యునియొక్క వెలుగు వల్ల

జ : సూర్యుడు లేకపోతే, అంటే రాత్రులందు ఏ వెలుగుచేత నిత్యకృత్యాలు సాగిస్తాడు?

యా : చంద్రుని యొక్క కాంతులలో

జ : సూర్యుడు, చంద్రుడు ఇద్దరూ లేనప్పుడు? అంటే సంధ్య వేళల యందు?

యా : అగ్ని యొక్క కాంతులతో

జ : సూర్యుడు, చంద్రుడు, అగ్ని కూడా లేనప్పుడు?

యా : వాక్కు యొక్క సాయంతో

జ : మరి వాక్కు కూడా లేనప్పుడు?

యా : జనక మహారాజా! ఈ వెలుగులన్నిటికీ ఆవల ఆత్మజ్యోతి ఉన్నది. ఆ ఆత్మ ప్రకాశములకు ప్రకాశము. కాంతులకు కాంతి. అటువంటి ఆత్మవల్లనే మానవుడు తన మనుగడ సాగిస్తాడు.

జ. : స్వామీ ! ఆత్మ అంటే ఏమిటి? శరీరము, ఇంద్రియాలు, మనస్సు, వీటిలో ఆత్మజ్యోతి ఏది?

యా : ప్రాణాల్లోను, బుద్ధివృత్తుల యందు ఉండే విజ్ఞాన జ్యోతియే ఆత్మ. ఇంద్రియాల మధ్య స్వయంప్రకాశమై హృదయంలో ఉండే పురుషుడే ఆత్మ. అతడే జ్యోతిస్వరూపుడు.

ముండకోపనిషత్తులో చెబుతున్నాడు. **నతత్ర సూర్యోభాతి నతత్ర చంద్రతారకం**

అక్కడ సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు ఏవీ ప్రకాశించవు. కేవలము ఆత్మజ్యోతి ప్రకాశము మాత్రమే ఉంటుంది.

పరమేశ్వర స్వరూపము జ్ఞానజ్యోతి. ఆ జ్యోతి నుంచి అనేకవేల లక్షల కోట్ల కోటానుకోట్ల కిరణాలు ప్రకాశిస్తున్నాయి. అందులో 360 కిరణాలు మాత్రమే మనం తీసుకోగలిగాము. అందులో అగ్ని 108 కిరణములు, రవి 116 కిరణములు, చంద్రుడు 136 కిరణములు తీసుకోగలిగారు. ఈ మొత్తం 360 కిరణములు సూర్యుడు, చంద్రుడు, అగ్ని అందరూ ఆ పరమేశ్వరుని కిరణాలవల్లనే ప్రకాశిస్తున్నారు.

అంగుష్టమాత్రః పురుషోంతరాత్మా సదాజనానాగ్ం హృదయే సన్నివిష్టః

పరబ్రహ్మ అంగుష్టమాత్ర పరిమాణంతో హృదయగుహలో నివసిస్తున్నాడు. అంటోంది శ్వేతాశ్వతరోపనిషత్తు. ఈ రకంగా బ్రహ్మవల్లనే ఈ జగత్తు అంతా ప్రకాశిస్తున్నది. పరబ్రహ్మ స్వయం ప్రకాశము గలవాడు. ఈ విషయం 85, 86 సూత్రాలలో వివరించబడింది.

12. జీవుడికి జనన మరణాలు లేవు

జీవుడికి జనన మరణాలున్నాయా?

ఫలానా సత్యవర్ధనుడు పుట్టాడు. జయవర్ధనుడు మరణించాడు. అంటే జీవి పుట్టింది, జీవి మరణించింది అంటున్నాము కదా!" అంటే జీవికి చావు, పుట్టుక ఉన్నట్లే కదా?

జీవుడికి జననమరణాలు లేవు. కాని అవి ఉన్నాయి అని చెప్పటం కేవలము అతని శరీరాన్ని బట్టే. వీటితో జీవుడికి సంబంధం లేదు. జీవుడు శరీరంలో ప్రవేశిస్తే అతడు పుట్టాడు అంటున్నాము. ఆ శరీరాన్ని వదిలిపెడితే మరణించాడు అంటున్నాము. ఇది ఎందుకు జరుగుతుంది? కర్మఫలితాన్ని అనుభవించటానికి. కర్మఫలితం అనుభవించటానికే మాసిన వస్త్రాన్ని వదలి ఏ విధంగా మనం కొత్త వస్త్రము ధరిస్తామో, అలాగే జీర్ణమైన ఈ దేహాన్ని వదలి ఈ జీవి ఇంకొక దేహంలో ప్రవేశిస్తుంది. జీవుడు వేరు, బ్రహ్మ వేరు కాదు. ఇద్దరూ ఒకటే. అయితే అజ్ఞానంతో తాను వేరు, బ్రహ్మ వేరు అనుకుంటుంది. **ముండకోపనిషత్తు**లో చెప్పినట్లుగా ఒకే వృక్షము మీద రెండు పక్షులు కూర్చుని ఉన్నాయి. అందులో ఒకటి తన కర్మలవల్ల వచ్చిన ఫలితాలను అనుభవిస్తున్నది. రెండవది నిర్వికారంగా చూస్తోంది. వీటిలో మొదటిది జీవాత్మ. రెండవది పరమాత్మ. వారిద్దరికీ భేదం లేదు. అజ్ఞానం తొలగిపోతే జీవాత్మ పరమాత్మలో లీనమై పోతుంది. కాబట్టి జీవుడికి చావుపుట్టుకలు లేవు. **ఐతరేయోపనిషత్తు**లో చెప్పినట్లుగా ఈ జీవరాశిని సృష్టించిన తరువాత, పరమేశ్వరుడు తానుకూడా ఇందులో ప్రవేశించాలి అనుకున్నాడు. శరీరంలో ప్రవేశించాడు. కాబట్టి జీవులకు చావుపుట్టుకలు లేవు

జీవుడు పుట్టటము అనేది లేదు. అతడు నిత్యుడు. **బృహదారణ్యకోపనిషత్తు**లో యాజ్ఞవల్క్యుడు మైత్రేయికి బ్రహ్మోపదేశం చేస్తూ, "తడిసిన కట్టెను నిప్పులో వేసినట్లైతే రకరకాల పొగలు వస్తాయి. తరువాత రవ్వలు వస్తాయి. ఈ రవ్వలు అగ్నికన్న వేరైనవి కావు. అలాగే వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలు, మంత్రాలు, కళలు, సూత్రాలు ఇవన్నీ పరమాత్మ యొక్క స్వరూపాలు. రవ్వలు, జ్వాలలు రావటానికి ముందు అంతా అగ్నిమయమే. అలాగే నామరూపాత్మక స్థితికి ముందు జగత్తంతా

ప్రజ్ఞానఘనుని స్వరూపమే” అంటాడు. కాలుతున్న కట్టె నుండి రవ్వలు ఏ రకంగా పుడుతున్నాయో. అదే విధంగా పరమాత్మ నుంచి జీవాత్మలు వచ్చి మళ్ళీ అందులోనే కలిసి పోతున్నాయి. **కఠోపనిషత్తు**లో “ఆత్మకు చావులేదు. ఆత్మ స్వయంభువు నాశరహితమైనది. శరీరం మరణించినా ఆత్మ మరణించదు. ఆత్మ చంపేదీ, చంపబడేదీ కాదు. సూక్ష్మమైన వాటికన్న సూక్ష్మమైనది. పెద్దవైన వాటికన్న ఇంకా పెద్దది” అన్నారు. **ఐతరేయోపనిషత్తు**లో ‘మానవ శరీరాన్ని సృష్టించిన తరువాత, అందులో ప్రవేశించాలి అనుకున్నాడు పరమాత్మ. బ్రహ్మరంధ్రం ద్వారా మానవ శరీరంలో పరమాత్మ ప్రవేశించాడు’ అని చెప్పబడింది.

ఈ విధంగా చూసినట్లైతే జీవాత్మ పరమాత్మ వేరుకాదు. ఒక్కటే. పరమేశ్వరుడు మానవుణ్ణి సృష్టించి, బ్రహ్మరంధ్రం గుండా మానవదేహంలో ప్రవేశించాడు కాబట్టి అందరిలోనూ ఉన్నవాడు పరమేశ్వరుడే. కర్మఫలం అనుభవించిన తరువాత ఈ శరీరాన్ని విడిచి ఇంకొక శరీరంలోకి ప్రవేశిస్తున్నాడు. అంతేకాని జీవికి చావుపుట్టుకలు లేవు. అవి కేవలము శరీరానికి మాత్రమే. **ముండకోపనిషత్తు**లో శౌనకునకు అంగిరసుడు బ్రహ్మతత్త్వాన్ని వివరిస్తూ,

“శౌనకా, ప్రజ్వరిల్లిన అగ్ని నుండి అదే విధమైన ఆకారము, గుణముగల వేలకొలది నిప్పురవ్వలు వెలువడుతున్నట్లే, పరబ్రహ్మ నుండి అనేకమైన శరీరాలు రూపాలు వెలువడి మళ్ళీ అందులోనే లీనమవుతున్నాయి. అంటే ఆత్మకు చావు, పుట్టుకలున్నాయని కాదు. ఆత్మ శాశ్వతమైనది. ఇది పరమేశ్వర స్వరూపము. అంటూ తృతీయ ముండకంలో ఒకే రూపము పేరు గలిగిన రెండు పక్షులు ఒక చెట్టును ఆశ్రయించి ఉన్నాయి. ఈ రెండింటిలోను ఒకటి జీవాత్మ, రెండవది పరమాత్మ. ఈ రెండూ వేరు కాదు. కేవలం అజ్ఞానంవల్ల అవి వేరు వేరుగా అనుకుంటున్నాం. జ్ఞానోదయం గలిగిన మరు క్షణమే జీవాత్మ పరమాత్మలో లీనమవుతుంది. అంతేగాని జీవునికి చావుపుట్టకలు లేవు.

ఈ విషయం అంతా 232, 233 సూత్రాలలో వివరించబడింది.

13. పంచాగ్ని విద్య

ఆ రోజుల్లో శంకరుడు కాశీ చేరి బ్రహ్మసూత్ర భాష్యం వ్రాసి, తాను వ్రాసిన భాష్యాన్ని ప్రతిరోజు గంగానది ఒడ్డున తన శిష్యులకు బోధిస్తున్నాడు. ఒకరోజున శంకరుడు శిష్యులకు సూత్రభాష్యం చెబుతున్నాడు. అపరాహ్నమైంది. ఆ రోజుకు పాఠం పూర్తి చేసి లేచాడు. అక్కడికి కొంత దూరంలో ఒక వృద్ధ బ్రాహ్మణుడు కూర్చుని శంకరుడు చెప్పేది తను కూడా వింటున్నాడు. ఇప్పుడు ఆ వృద్ధుడు శంకరుడి దగ్గరకు వచ్చి

'నాయనా ! నువు ఇంతవరకు చెప్పింది సూత్రభాష్యమేనా?' అన్నాడు. ఔను అన్నాడు శంకరుడు. 'నాకు కూడా సూత్రభాష్యం వినాలని కోరికగా ఉన్నది. ఏమైనా ఒక సూత్రానికి భాష్యం చెప్పవలసింది' అన్నాడు వృద్ధబ్రాహ్మణుడు. ఆ మాటలు విన్న శంకరుడు "ఓ బ్రాహ్మణ వరేణ్యా! ఏదైనా ఒక సూత్రం కాదు. నీకు ఏసూత్రం కావాలో చెప్పు. దాన్నే వివరిస్తాను." అన్నాడు. 'అలా అయితే మూడవ అధ్యాయంలోని మొదటి పాదంలో గల మొదటి అధికరణాన్ని వివరించు' అన్నాడు వృద్ధబ్రాహ్మణుడు. ఆ అధికరణ పేరు **తదంతరప్రతిపత్త్యధికరణము.** దాన్ని వివరించాడు శంకరుడు. అప్పుడు ఆ వృద్ధుడు తన నిజస్వరూపాన్ని చూపించాడు. ఆయనే వ్యాసభగవానుడు. శంకరుడు చెప్పిన భాష్యం విని వ్యాసుడు చాలా ఆనందించాడు. అప్పుడు శంకరుడు వివరించినది **ఛాందోగ్యోపనిషత్తు**లోని పంచాగ్నివిద్య.

పూర్వకాలంలో బ్రహ్మజ్ఞానాన్ని గురించి కొంత పరిజ్ఞానం క్షత్రియుల దగ్గర మాత్రమే ఉండేది. దాన్ని మొదటిసారిగా పాంచాలదేశాన్ని పాలించే ప్రవాహణుడు బ్రాహ్మణులకు చెప్పాడు.

పాంచాలదేశాన్ని ప్రవాహణుడు అనే రాజు పాలిస్తుండేవాడు. ఆ రోజుల్లో ఒకసారి శ్వేతకేతువు అనే బ్రాహ్మణబాలకుడు అమితదర్పంతో రాజాస్థానంలో అడుగుపెట్టాడు. శ్వేతకేతువు విద్యావంతుడు, తండ్రివద్దనే విద్యాభ్యాసం చేశాడు. అతనికి తెలిసింది ఎంతైనా, లోకంలోని విద్యనంతా అభ్యసించానని, విజ్ఞానమంతా తన సొంతమని అపోహచెందాడు.

రాజాస్థానంలో ప్రవేశించే సమయానికి అక్కడ వేదాంతచర్చలు జరుగుతున్నాయి. పండితులంతా సభతీర్చారు. ప్రశ్నలు అడుగుతున్నారు. సమాధానాలు చెబుతున్నారు. యజ్ఞయాగాదులు జరిగేటప్పుడు, ఉత్సవాలు, వేడుకల సందర్భంగా ఇలాంటి సభలు జరగటం ఆచారంగా ఉండేది. ఆ కారణంగానే ఇప్పుడుకూడా ఆధ్యాత్మిక చర్చలు జరుగుతున్నాయి.

శ్వేతకేతువు రాజాస్థానంలోకి ప్రవేశించాడు. ఆ సమయంలో రాజైన ప్రవాహణుడు అక్కడే ఉన్నాడు. లోపలికి వస్తున్న శ్వేతకేతును చూసి రాజు అడుగుతున్నాడు. "కుమారా! నీవు విద్యాభ్యాసం పూర్తి చేశావనుకుంటాను". "అవును మహారాజా! మా తండ్రిగారి దగ్గరే చదువంతా పూర్తిచేశాను" అన్నాడు శ్వేతకేతువు. అతను చెప్పిన సమాధానంలో డాబు, దర్పము కనిపించినాయి. సర్వశాస్త్ర పారంగతుణ్ణి అని గర్వం కూడా తొంగిచూసింది. దాంతో ప్రవాహణుడికి శ్వేతకేతువును పరీక్షించాలనిపించింది. ఇక ప్రశ్నించటం మొదలు పెట్టాడు.

"బ్రాహ్మణబాలకా! మనుష్యులు మరణించిన తరువాత ఎక్కడికి వెడతారు?"

"నాకు తెలియదు" అన్నాడు శ్వేతకేతు.

"మరణించిన తరువాత ఈ లోకానికి ఏ విధంగా తిరిగి వస్తారు."

"నాకు తెలియదు"

"మృతి చెందినవారు ప్రయాణం చేసే దేవయాన, పిత్రుయాన మార్గాలను వివరించు"

"నాకు తెలియదు"

"ప్రకృతి పరిణామక్రమంలో పురుషుడిగా ఆకారం దాల్చే ఉదంతము ఏది?"

నాకు తెలియదు"

"శ్వేతకేతూ! ఇన్ని ప్రశ్నలు అడిగాను. ఏ ఒక్కదానికీ సమాధానం చెప్పలేదు. కాని విద్యాభ్యాసం మాత్రం పూర్తయిందని చెప్పావు. దీన్నిబట్టి చూస్తే ముఖ్యమైన విషయాలను గురించిన పరిజ్ఞానం నీకు శూన్యమనిపిస్తోంది" అన్నాడు రాజు.

ఆ మాటలకు సిగ్గుపడ్డాడు శ్వేతకేతువు. విద్యాభ్యాసం పూర్తయిందని ఇంత వరకు అనుకున్నది భ్రమ అని తెలిసిపోయింది. సరాసరి తండ్రి వద్దకు వచ్చి

నాన్నగారూ ! నేను నేర్చుకోవలసిన విద్య అంతా పూర్తయిపోయింది అని చెప్పారు. అది నిజమే అని నేను కూడా అనుకున్నాను. కాని పాంచాలదేశాధీశుడు ఐదు ప్రశ్నలడిగితే ఒక్కదానికి కూడా సమాధానం చెప్పలేక తెల్లమొగం వేశాను. విద్యాభ్యాసం పూర్తయిందని మీరు ఎందుకు చెప్పారో నాకు అర్థం కావటం లేదు" అన్నాడు. తనకు సభలో ఎదురైన పరిస్థితినంతా వివరించాడు.

రాజుకు శ్వేతకేతువుకు జరిగిన సంభాషణ అంతా విన్నటువంటివాడై 'నాయనా! మహారాజు వేసిన ప్రశ్నలకు సమాధానం నాక్కూడా తెలియదు. తెలిస్తే నీకెందుకు చెప్పను?' అన్నాడు శ్వేతకేతు తండ్రి అయిన ఉద్దాలకుడు.

ఆ తరువాత కుమారునితోపాటుగా రాజు అడిగిన విషయాలను గురించి తెలుసుకోవాలనిపించింది ఉద్దాలకుడికి. తండ్రి కొడుకులిద్దరూ పాంచాలదేశానికి బయలుదేరారు. రాజప్రాసాదం చేరుకుని, రాజదర్శనం కోసం నిరీక్షిస్తూ అక్కడే ఉన్నారు. ఆ మరునాడు రాజదర్శనం లభించింది. వినయ విధేయతలతో రాజుకు నమస్కరించారు.

పాంచాల దేశాధీశుడైన ప్రవాహణుడు శ్వేతకేతువును, అతని తండ్రి ఉద్దాలకుడిని సగౌరవంగా ఆదరించి "బ్రాహ్మణోత్తమా! ఏమాశించి నావద్దకు వచ్చారు? ధనరాసులు కావాలా? సంపద కావాలా? మీకు ఏం కావాలో చెప్పండి." అన్నాడు.

ఆ మాటలు విన్న ఉద్దాలకుడు "మహారాజా! నీ ధనం కోసంగాని, గోధనం కోసం గాని ఇక్కడకు రాలేదు. నీవద్దనున్న జ్ఞానధనంకోసం వచ్చాను. అదే నీవు నాకు చేయవలసిన దానం. నా కుమారుణ్ణి అడిగిన ప్రశ్నలేవో నాతో చర్చించి సమాధానాలు చెప్పి నా సందేహాలు తీర్చు. నాకు జ్ఞానాన్ని ప్రసాదించు. అదే నేను కోరేది" అన్నాడు.

బ్రాహ్మణుడి మాటలకు చాలా ఆనందించి మహారాజు వారిని "కొంత కాలం మీరిక్కడే ఉండండి" అని అభ్యర్థించాడు. రాజుకోరిక మేరకు తండ్రీ కొడుకులు కొంతకాలం రాజాస్థానంలోనే ఉన్నారు.

ఒకరోజు మహారాజు తండ్రీకుమారుల వద్దకు వచ్చి "బ్రాహ్మణ శ్రేష్ఠులారా! ఇంతవరకు ఈ జ్ఞానం సంప్రదాయ సిద్ధంగా క్షత్రియుల దగ్గరే పరంపరగా ఉంటూ

వచ్చింది. మొట్టమొదటిసారిగా బ్రాహ్మణులైన మీకు వివరిస్తున్నాను” అంటూ చెప్పటం ప్రారంభించాడు.

బ్రాహ్మణవరేణ్యా! నీ కుమారుణ్ణి అడిగిన ఆఖరు ప్రశ్నకు ముందుగా సమాధానం చెబుతాను. యజ్ఞాలు ఐదురకాలు. యజ్ఞవిధానం ఈ విధంగా ఉంటుంది. స్వర్గమేఅగ్ని. ఆ యజ్ఞానికి హవిస్సు సూర్యుడు. యజ్ఞఫలం జీవన ప్రదాత్రి అయిన సోమరసం. ఈ సోమరసం మేఘాల వరకు ప్రయాణిస్తుంది. మేఘాలద్వారా భూలోకంలో వర్షిస్తుంది. దానివల్ల అన్నం ఉత్పత్తి అవుతుంది. అన్నం మానవుడికి లభిస్తుంది. అది అతనిలో రేతస్సుగా మారుతుంది. ఆ శక్తి స్త్రీలో ప్రవేశిస్తుంది. అప్పుడామె గర్భందాలుస్తుంది. బిడ్డను ప్రసవిస్తుంది. ఈ రకంగా ఐదుయజ్ఞాల దశలు దాటి ప్రాణంపొంది ఆ యజ్ఞఫలమైన సోమరసం పురుషుడుగా మారుతుంది.

ఉద్దాలక అరుణీ ! ఇప్పుడు మిగిలిన నాలుగు ప్రశ్నలకు సమాధానం చెబుతాను విను. మానవుడు నాలుగు భూతాల సమ్మిశ్రస్వరూపుడు. అతడు మరణించిన తరువాత ఆ నాలుగు భూతాలు ఆయాభూతాలలో కలిసిపోతాయి. మానవుని యోగ్యత అనేది అతడు చేసిన కర్మలమీద ఆధారపడి ఉంటుంది. అతడు గనక ఆత్మానుభవం పొందితే వెలుగు బాటలో ప్రయాణం చేస్తాడు. అదే దేవయానము. ఆ బాటలో ప్రయాణం చేసి పుణ్యఫలాన్ని అనుభవించి మోక్షాన్ని పొందుతాడు. ఇట్టి మానవుడికి పునర్జన్మ ఉండదు. అతడికి శాశ్వతమైన ఆనందం లభిస్తుంది.

అలా కాకుండా ఐహికమైన కోరికలు తీర్చుకోవటానికే జీవిస్తూ, పుణ్యకర్మలను ఆచరిస్తూ జీవనయానం సాగిస్తే పితృయానం గుండా స్వర్గానికి చేరతాడు. అక్కడ అతని పుణ్యఫలం పూర్తిగా అనుభవించి మళ్ళీ ఈ లోకంలో జన్మిస్తాడు.

మానవుడు తన జీవిత రహస్యాన్ని తెలుసుకోలేక పాపాలు చేస్తుంటాడు. త్రాగుడు, జూదము, వ్యభిచారము, దొంగతనము మొదలైన పనులు చేస్తాడు. అటువంటివాడు అటు అమృతత్వాన్ని, ఇటు స్వర్గాన్నీ కూడా పోగొట్టుకుంటాడు. ఇటువంటివారు నీచమైన జన్మలు ఎత్తుతారు.

కొంతమంది అతిప్రయత్నము మీద బ్రహ్మలోకాన్ని పొందుతారు. బ్రహ్మలోకము పొందినవారికి పునర్జన్మ లేదు. అయితే ఎక్కువమంది పుణ్యకార్యాలు చేసి స్వర్గము పొందుతారు. ఎంతమంది అక్కడికి చేరినా స్వర్గము మాత్రం క్రిక్కిరిసిపోదు.

సంస్కారవంతులు, సదాచార సంపన్నులు ఉత్తమయోనిని పొందుతారు. అంటే బ్రహ్మక్షత్రియ వైశ్యాది యోనులు పొందుతారు. సంస్కారహీనులు కుక్కలుగా, పందులుగా, ఛండాలురుగా నీచయోనులందు జన్మిస్తారు. పాపాత్ములు పైన చెప్పిన రెండు మార్గాలలోనూ పోరు. వారు శీఘ్రంగా పుడుతూ చస్తూ ఉంటారు. వీరిది మూడవ మార్గం. అందుకనే ఇన్ని జీవులు నిత్యం చస్తున్నా స్వర్గము మొదలైన పరలోకాలు నిండవు. చచ్చిన వారంతా అక్కడికి పోరు. మరణకాలంలో కూడా పాపాత్ములు నీచమైన చావు చస్తారు. వీరి శరీరం ఏ ప్రమాదంలోనో చిన్నాభిన్నమై పోతోంది. ఆనవాలుకూడా దొరకదు. కొంతమందినైతే కుక్కలు పీక్కు తింటాయి. అటువంటి వారి జీవితాన్ని అందరూ అసహ్యించుకుంటారు.

బ్రాహ్మణుల బంగారం దొంగిలించేవారు, బ్రాహ్మణుడై పుట్టి మదిరపానం చేసేవాడు, గురుపత్నీ సంగమము చేసేవాడు, బ్రహ్మహత్య చేసేవాడు ఈ నలుగురు పతితులు. వీరితో సహవాసం చేసేవాడు కూడా పతితుడే. ఇంతకన్నా నీచపు పనులు చేసేవారు క్రిమికీటకాలుగా జన్మిస్తారు.

ప్రవాహణుడు చెప్పిన ఈ విద్యను 'పంచాగ్ని విద్య' అంటారు. ఈ విద్యను తెలుసుకున్నవాడు పైన చెప్పిన పతితులతో సహవాసము చేసినప్పటికీ అతడికి ఆ పాపము అంటదు.

ఈ విషయం 292-298 వరకు గల సూత్రాలలో వివరించబడింది.

14. దేవతలు బ్రహ్మవిద్యకు అధికారులే

బ్రహ్మవిద్యను ఎవరు అభ్యసించాలి? మానవులకు బ్రహ్మోపదేశం పొందే హక్కు ఉన్నది. మరి దేవతలకు కూడా ఉన్నదా? అనేది అనుమానం.

బ్రహ్మవిద్య యందు దేవతలకు అధికారం లేదు. సూర్య చంద్రాదులు గ్రహాలు. వారికి ప్రత్యేక మండలాలున్నాయి. కాబట్టి వారికి బ్రహ్మవిద్య యందు అధికారం లేదు. అంటున్నాడు జైమిని, 94, 95 సూత్రాలలో

దేవతలు మానవులకన్న ఉన్నతులు, భోగలాలసులు. కాని వారి భోగం శాశ్వతం కాదు. ఈ విషయం వారికీ తెలుసు. అందుచేత వారికి వైరాగ్యం కలుగుతుంది. అప్పుడు వారు బ్రహ్మవిద్యకు అధికారులౌతారు.

దేవతలకు బ్రహ్మవిద్య యందు అధికారమున్నది అంటున్నాడు వ్యాసుడు **ఛాందోగ్యోపనిషత్తు**లో ప్రజాపతి గాథ దీనికి నిదర్శనం.

పూర్వకాలంలో ప్రజాపతి ఇంద్రుడికి ఆత్మతత్త్వాన్ని వివరించాడు.

పూర్వకాలంలో ఒకసారి ప్రజాపతి ఆత్మతత్త్వాన్ని గురించి ఒక ప్రకటన చేశాడు.

"ఆత్మకు పాపం అంటదు. ముసలితనం రాదు. మృత్యువు దాన్ని కబళించదు. శోకం తాకదు. దానికి ఆకలి దప్పికలు లేవు. మానవుడు సత్యకాముడు, సత్య సంకల్పుడు అయి ఆత్మజిజ్ఞాసను అలవరచుకోవాలి. ఆత్మకోసం అన్వేషించినవాడు, ఆత్మను అనుభవించినవాడు ఆత్మస్వరూపాన్ని పొందుతాడు. పూర్ణస్థితి అతనికి వస్తుందన్నమాట."

దేవతలు, రాక్షసులుకూడా ఆ మాటలు విన్నారు. "ఆత్మను గురించి మనంకూడా అన్వేషిద్దాం. ఆత్మవల్ల అన్ని కోరికలు తీరతాయని బ్రహ్మచెప్పాడు కదా!" అని వారు భావించారు.

దేవతలరాజు ఇంద్రుడు, రాక్షసుల రాజు విరోచనుడు ఇద్దరూ ఆత్మజ్ఞానం సంపాదిద్దామని చేతితో దర్భలు పట్టుకుని బ్రహ్మవద్దకు వెళ్ళారు. బ్రహ్మ వీరిద్దరినీ ముప్పైరెండు సంవత్సరాలు బ్రహ్మచర్యదీక్ష వహించమని చెప్పాడు. దీక్ష పూర్తి చేశారిద్దరూ.

"వత్సలారా ! మీరు నాకోసం దేనికి వచ్చారు?" అన్నాడు బ్రహ్మ.

"భగవాన్ ! ఆత్మ తత్త్వాన్ని గురించి చెప్పిన విషయాలు విన్నాం. ఆత్మను గురించి ప్రత్యక్షంగా తమ నోటిమీదుగా వినాలని వచ్చాం" అన్నారు. ఇంద్ర విరోచనులు.

"మనుష్యుల కనుపాపలలో మెదలుతూ కనుపించే పురుషుడే ఆత్మ. ఆత్మ అభయం. అమృతమయం. అదే బ్రహ్మం" అన్నాడు బ్రహ్మ.

అదివిన్నవారు "భగవాన్ ! నీటిలో కనుపించే ప్రతిబింబం, అద్దంలో కనిపించే ప్రతిబింబం. ఈ రెంటిలో ఏది ఆత్మరూపం?" అని అడిగారు.

"నేను మొదటగా కళ్ళలో మెరిసే ఏపురుషుని వర్ణన చేశానో వీటన్నింటిలోనూ ప్రతిఫలించేది ఆ పురుషుడే. ఒకసారి నీళ్ళలోను, అద్దంలోను మీ రూపాలు చూసుకుని

మీ అనుభవాలు నాకు చెప్పండి" అన్నాడు బ్రహ్మ. ఇంద్ర విరోచను లిద్దరూ అలాగే చేసి ప్రజాపతి దగ్గరకు వెళ్ళారు. ప్రజాపతి వీరిని చూసి "మీరు ఏం చూశారు." అన్నాడు.

"నఖశిఖ పర్యంతము కేశపాశాలతో మా శరీరాల ప్రతిరూపమే మాకు నీళ్ళలోనూ, అద్దంలోనూ కూడా కనిపించింది" అన్నారు వారు.

"నాయనలారా ! శరీరాలు శుభ్రపరచుకుని, మంచి వస్త్రాలు ఆభరణాలు ధరించి నీటిలో మీ ముఖాన్ని చూసుకోండి. తరువాత ఏం చేశారో నాకు చెప్పండి" అన్నాడు బ్రహ్మ 'అలాగే' అని చెప్పి ఇద్దరూ వెళ్ళిపోయారు. మరునాడు తిరిగి వచ్చి "స్వామీ ! ఈ చక్కని వస్త్రాలతో ఆభరణాలతో అలంకరించిన మా శరీరాలే నీటిలో కనిపించాయి" అన్నారు.

"అభయమూ, అమృతమయమూ అయిన ఆత్మ అదే. అదే బ్రహ్మము" అన్నాడు ప్రజాపతి

అదివిన్న ఇంద్ర విరోచనులు ఆత్మను గురించి తమకు అంతా తెలిసిందనుకుని తిరిగి వెళ్ళిపోయారు. అలా వెళ్ళిపోతున్నవారిని చూసి" అసలు ఆత్మజ్ఞానం లభించకుండానే వారు తెలిసింది అనుకుని వెళ్ళిపోతున్నారు. వారు దేవతలైనా, రాక్షసులైనా **శరీరాన్నే ఆత్మ అని భావించటం పతన హేతువు"** అనుకున్నాడు.

విరోచనుడు ఆత్మని గురించిన ఈ సిద్ధాంతంతోనే తృప్తి చెంది, రాక్షస జాతి కంతటికీ ఈ సిద్ధాంతాన్నే బోధించాడు. అసలైన పరమసత్యం తనకు లభించిందని తృప్తి చెందాడు. దేహమే ఆత్మ అని ప్రచారం చేశాడు.

ఇంద్రుడు దేవలోకానికి బయలుదేరాడు. దారిలో తాను నేర్చుకున్న దానిలో ఏదో లోపం కనిపించింది. తను నేర్చుకున్న సిద్ధాంతాన్ని ఒకసారి సమీక్షించుకున్నాడు. విషయాన్ని విమర్శచేసి చూశాడు. బాగా అలంకరించుకుంటే అలంకరించినట్లు, మంచి వస్త్రాలు ధరిస్తే ధరించినట్లు, కుంటివాడైతే కుంటివాడిలాగా, గ్రుడ్డివాడైతే గ్రుడ్డివాడిలాగా శరీర ప్రతిబింబం కనిపిస్తుంది. మరణానంతరం శరీరం లేనప్పుడు ఆత్మ ఏమౌతుంది. మృత్యువువాత పడే ఈ శరీరాన్ని అమృతమయమగు ఆత్మ అనటంలో అర్థంలేదు. ఇంద్రుడి సంశయాలు తీరలేదు. సంతృప్తి లభించలేదు. వెనక్కి తిరిగి ప్రజాపతి దగ్గరకు వెళ్ళి నుంచున్నాడు.

తిరిగి వచ్చిన ఇంద్రుణ్ణి చూసి ప్రజాపతి "ఇంద్రా! నీవు విరోచనుడితో వెళ్ళిపోయావు కదా! మళ్ళీ ఎందుకు తిరిగి వచ్చావు?" అని అడిగాడు.

ఇంద్రుడు తన అనుమానాలన్నీ వివరించాడు "ప్రభూ! శరీరంలోగాని, శరీరచ్ఛాయలో గాని నాకు ఏమీ విశేషం కనబడలేదు. అందుకని గతంలో నేర్చుకున్నది తృప్తిని కలిగించలేదు. ఆత్మజ్ఞానాన్ని మీవద్ద అభ్యసించాలని మళ్ళీ వచ్చాను" అన్నాడు.

ఇంద్రుడి జిజ్ఞాసకు ఆనందించాడు బ్రహ్మ. ఇంద్రుణ్ణి మళ్ళీ ముప్ఫై రెండు సంవత్సరాలు బ్రహ్మచర్యదీక్ష పాటించమన్నాడు. ఇంద్రుడు దీక్షతో బ్రహ్మవద్దనే గడిపాడు. దీక్ష పూర్తి అయిన తరువాత ప్రజాపతి ఇంద్రుడితో "స్వప్న ప్రపంచంలో ప్రభువులాగా స్వేచ్ఛగా విహరించే చైతన్యమే ఆత్మ" అన్నాడు.

ఈ మాటలతో ఇంద్రుడు తృప్తిపడి తిరిగి వెళ్ళిపోవటానికి బయలుదేరాడు. అలా వెడుతుంటే త్రోవలో మళ్ళీ అనుమానం వచ్చింది. "స్వప్నాలు అనుభవించే చైతన్యమే ఆత్మ ఎలా అవుతుంది. మనకు ఒక్కొక్కసారి కలలో ఎవరో పీడిస్తున్నట్లు అనిపిస్తుంది. మనం దుఃఖిస్తాము. పాపరహితము, అభయము అయిన ఆత్మ ఈ రకంగా దుఃఖించటంలో అర్థం లేదు. ఇది సత్యంకాదు." అనిపించింది. మళ్ళీ తిరిగి వచ్చాడు ఇంద్రుడు. ప్రజాపతి ఆదేశం మేరకు మళ్ళీ కొన్ని సంవత్సరాలు బ్రహ్మచర్య దీక్ష గడిపాడు. అప్పుడు ప్రజాపతి ఇంద్రుడితో ఈ విధంగా చెప్పాడు. "గాఢసుషుప్తిలో సంతృప్తిగా ఆనందాన్ని అనుభవించేదే ఆత్మ."

ఇంద్రుడు ఈ మాట నిజమే అని నమ్మి దేవలోకానికి బయలుదేరాడు. మార్గమధ్యంలో ఇంద్రుడికి మళ్ళీ అనుమానం వచ్చింది. గాఢనిద్ర అనుభవిస్తున్నదే. ఆత్మ అనుకుంటే ఆత్మ తనను తాను తెలుసుకోలేని స్థితిలో ఉంటుందన్నమాట. తనను గురించి తాను తెలుసుకోలేని అవ్యక్తతత్త్వం ప్రకాశవంతమైన ఆత్మ ఎలా అవుతుంది? ఈ అనుమానంతో ఇంద్రుడు తిరిగి ప్రజాపతి దగ్గరకు వచ్చాడు. ఈ సారి ప్రజాపతి ఇంద్రుణ్ణి కేవలం ఐదు సంవత్సరాలు తనదగ్గర బ్రహ్మచర్య దీక్షతో ఉండమన్నాడు. గడువు పూర్తయిన తరువాత ఇంద్రుడి పట్టుదలకు మెచ్చి ఆత్మతత్త్వాన్ని పూర్తిగా వివరించాడు.

ఇంద్రా! నీ పట్టుదలకు మెచ్చాను. ఆత్మానుభవం పొందటానికి నువు పూర్తిగా అర్హుడవు. శరీరం అశాశ్వతమైనది. ఆఖరుక్షణాలు ఆసన్నం కాగానే శరీరాన్ని మృత్యువు కబళిస్తుంది. శాశ్వతమైన ఆత్మకు అశాశ్వతమైన శరీరమే ఆవాసం. శరీరం ఉన్నంత కాలంలో ఆత్మకు సుఖదుఃఖాలు, గుణదోషాలు అంటినట్లూ, వాటితో సతమతమవుతున్నట్లు కనిపిస్తుంది. ఆత్మశరీరంతో సంబంధం ఏర్పరచుకోవటం వల్లనే జీవులకు సుఖదుఃఖాలు ఏర్పడతాయి. శరీరం ఆత్మనుండి విడివడితే ఈ బంధం నుండి విముక్తి లభిస్తుంది.

భౌతిక విషయాల నుండి విముక్తి పొంది ఆత్మను మనస్సుకు, ఇంద్రియాలకు విలక్షణమైనదిగా గ్రహించి, తేజోమయమని భావించి అనుభవజ్ఞుడు ఆనందిస్తాడు. ఆత్మజ్ఞానం పొందినవాడు ముక్తి సామ్రాజ్యంలో విహరిస్తాడు.

శాస్త్రోక్తంగా గురుకుల వాసం చేసి గురుకులం నుండి సమావర్తనం పూర్తి చేసి, పెండ్లాడి, గృహస్థుడయి పవిత్రమైనచోట స్వాధ్యయనం చేస్తూ పుత్రుల్ని, శిష్యుల్ని ధర్మపరాయణులుగా తీర్చిదిద్దుతూ ఇంద్రియాలను అదుపుచేసి అంటే జితేంద్రియుడై శాస్త్ర విరుద్ధమైన జీవహింస చేయకుండా జీవితాన్ని గడిపేవాడు చివరకు బ్రహ్మలోకం పొందుతాడు. అక్కడ నుండి మళ్ళీ తిరిగిరాడు. ఈ విధంగా అర్చిరాది మార్గం ద్వారా బ్రహ్మలోకానికి పోయిన ఉపాసకుడు బ్రహ్మలోకమున్నంత వరకు అక్కడ దివ్యభోగాలను అనుభవించి తరువాత పరబ్రహ్మలో లీనమవుతాడు. అతడికి పునరావృత్తి ఉండదు." ఈ రకంగా ప్రజాపతి ఆత్మజ్ఞానాన్ని దేవేంద్రుడికి వివరించాడు.

ఇందులో బ్రహ్మదేవుడు దేవరాజైన ఇంద్రుడికి బ్రహ్మవిద్యను ఉపదేశించాడు.

కఠోపనిషత్తులో యమధర్మరాజు నచికేతుడికి బ్రహ్మవిద్యను బోధించాడు. అంటే బ్రహ్మవిద్య యముడికి తెలుసు. అతను అందులో నిష్ణాతుడు. కాబట్టి దేవతలకు బ్రహ్మవిద్య మీద అధికారం ఉన్నది.

15. ముఖ్యప్రాణము బ్రహ్మమే

పూర్వకాలంలో ఒకసారి ఇంద్రియాలన్నీ తమలోతాము పోట్లాడుకోవటం మొదలుపెట్టాయి. దీనికి కారణం తమలో ఎవరు గొప్ప అనే విషయం తేలకపోవటమే. ఆ వాదన ఎంతకీ తెగలేదు. చివరకు అన్నీ కలిసి ఒక నిర్ణయానికి వచ్చి తమకు జన్మనిచ్చిన ప్రజాపతి దగ్గరకు పోయి "ప్రజాపతీ ! మాలో శ్రేష్ఠులెవరో మీరు తేల్చి చెప్పండి" అన్నాయి.

ప్రజాపతి ఒక క్షణం ఆలోచించి "మీలో ఎవరు శ్రేష్ఠులో తేల్చుకునే ఉపాయం ఒకటి చెబుతాను వినండి. మీలో ఎవరు లేకపోతే ఈ శరీరం పనికి రాకుండా, పని చెయ్యకుండా పోతుందో వారు అందరికన్నా శ్రేష్ఠులుగా గుర్తించండి. ఈ విషయం తేలాలంటే ఒక్కొక్క ఇంద్రియము ఒక సంవత్సరంపాటు ఈ శరీరాన్ని విడిచి వెళ్ళండి" అన్నాడు. ప్రజాపతి సలహా ఇంద్రియాలకన్నింటికీ నచ్చింది.

ముందుగా వాక్కు శరీరం నుంచి నిష్క్రమించింది. అది ఒక సంవత్సరంపాటు శరీరానికి దూరంగా ఉండి తరువాత తిరిగి వచ్చి మిగిలిన ఇంద్రియాలను అడిగింది. "నేను లేనప్పుడు మీరెలా జీవించి ఉండగలిగారు?"

"నువు వెళ్ళిపోవటంవల్ల శరీరానికి పెద్ద నష్టం ఏదీ జరగలేదు. కేవలం వాక్కు మాత్రం మూగబోయింది. అంతేగాని మిగిలిన శరీరమంతా యథాతథంగా పనిచేసింది. ఉచ్ఛ్వాస నిచ్ఛ్వాసలు మామూలుగానే జరిగాయి. కళ్ళు చూస్తూనే ఉన్నాయి. చెవులు వింటూనే ఉన్నాయి. ఆలోచనలు సాగుతూనే ఉన్నాయి. ఆ రకంగా మిగిలిన పనులన్నీ జరిగాయి. పసిపిల్లవాడికి మాటలు రావు. అయినావాడు బ్రతకటం లేదా? మూగవాడు జీవించటం లేదా? అలాగే శరీరం జీవించే ఉన్నది." అన్నాయి మిగిలిన అవయవాలు. ఆ మాటలు విన్న వాక్కు మారు మాట్లాడకుండా శరీరంలో ప్రవేశించింది.

తరువాత శరీరం నుంచి దృష్టి నిష్క్రమించి ఒక సంవత్సరం తరువాత తిరిగి వచ్చి మిగిలిన అవయవాలను అడిగింది "నేను లేనప్పుడు మీరంతా ఎలా ఉన్నారని?"

అప్పుడవి "నువు లేకపోతే చెప్పుకోతగ్గ ఇబ్బందేం కలగలేదు. గ్రుడ్డివాడు బ్రతకటం లేదా? అలాగే ఈ శరీరం బ్రతికింది. కేవలం చూపుమాత్రం లేదు. అంతేకాని శరీరంలోని మిగిలిన వ్యాపారాలన్నీ సజావుగానే సాగినాయి. ఊపిరి

ఆడుతూనే ఉంది. నోరు తింటూనే ఉంది. మాట్లాడుతూనే ఉన్నది. ఆలోచనలు బాగానే ఉన్నాయి" అన్నాయి. మారుమాట్లాడకుండా దృష్టి శరీరంలో ప్రవేశించింది.

ఈ రకంగా శ్రేష్ఠమైన ముఖ్యప్రాణము బ్రహ్మమే (బ్ర.సూ. 277)

అయితే ముఖ్యప్రాణము అణుపరిమాణం గలది. మిగిలిన ఇంద్రియాల లాగానే ఇది కూడా సూక్ష్మమైనది. శరీరం నుంచి నిష్క్రమించేటప్పుడు మిగిలిన ఇంద్రియాల లాగానే ఇది కూడా కనుపించదు. (బ్ర.సూ. 282) ముఖ్యప్రాణం బ్రహ్మమే.

16. మోక్షం కావాలంటే కర్మలు చేయవలసిన అవసరం లేదు.

ఈ విషయం చూసేటప్పుడు ముందుగా అసలు కర్మ అంటే ఏమిటో చూద్దాం. కర్మ అంటే పని. ఇది మంచి కర్మ అంటే సత్కర్మ కావచ్చు, దుష్కర్మ కావచ్చు. ఏదైనా ఒక కర్మ చేసినప్పుడు దాని ఫలితం మనం తప్పకుండా అనుభవించాలి. కర్మ చేసిన వెంటనే దాని ఫలితము సూక్ష్మరూపంలో నీ హృదయంలోకి చేరి, అవసరమైనప్పుడు, కర్మ ఫలితం అనుభవంలోకి వస్తుంది. కొంతమంది చెబుతుంటారు. 'త్రుటిలో ప్రమాదం తప్పిపోయింది' అని. అది కేవలము నీ అదృష్టము. అదే గతజన్మలలో నువు చేసిన కర్మఫలం. కొన్నిసార్లు ఈ కర్మ ఫలితం మనమే కాకుండా మన వారసులు, కుటుంబ సభ్యులు కూడా అనుభవించాల్సి వస్తుంది. ఇక్కడ చిన్న అనుమానం వస్తుంది. కర్మ చేసింది మనం కదా? దాని ఫలితాన్ని పిల్లలు ఎందుకు అనుభవించాలి? అని. కష్టపడి నానాగడ్డి తిని ధనం సంపాదించేది, ఆస్థులు కూడబెట్టేది నువ్వే. వాటిని అనుభవించేది నీ పిల్లలే కదా? అలాగే మనం చేసిన మంచి చెడు కర్మల ఫలితాలు మనతోపాటు ఒక్కోసారి కుటుంబ సభ్యులు కూడా అనుభవించాల్సి వస్తుంది.

ఇక కర్మలు చేస్తే మోక్షం రాదా? అనేది ప్రశ్న. కర్మలు అంటే తీర్థాలలో స్నానం చెయ్యటం, క్షేత్రదర్శనం, జపతపాలు, పూజలు, అర్చనలు, వ్రతాలు, హోమాలు యజ్ఞయాగాది క్రతువులు, దానధర్మాలు, ప్రజోపయోగకరమైన పనులు సత్రాలు కట్టించటం, దారి ప్రక్కన విడిది ఏర్పాటు చెయ్యటం, విద్యాలయాలు కట్టించటం మొదలైనవి. ఈ పనులు చేస్తే మోక్షం రాదు. పుణ్యం వస్తుంది. తద్వారా స్వర్గం వస్తుంది.

తీర్థాలలో స్నానం చేస్తే	– శరీర శుద్ధి కలుగుతుంది.
క్షేత్రాలు దర్శిస్తే	– ఆత్మ నిర్మలమవుతుంది
జపతపాలు, పూజలు, అర్చనలు	– దేవతానుగ్రహం కలుగుతుంది
వ్రతాలు, హోమాలు చేస్తే	– దేవతానుగ్రహం కలుగుతుంది.
యాగాలు చేస్తే	– దానికి నిర్దేశించిన ఫలితం వస్తుంది. ఉదా : పుత్రకామేష్టి చేస్తే సంతానం కలుగుతుంది.
యజ్ఞాలు చేస్తే	– బ్రహ్మలోకప్రాప్తి. ఇక్కడ బ్రహ్మ అంటే చతుర్ముఖబ్రహ్మ. సృష్టికర్త. సత్యలోకప్రాప్తి
దానధర్మాలు చేస్తే	– దానం చేసిన వస్తువు కొన్ని వందల రెట్లై మళ్ళీ నిన్నుచేరుతుంది.
సత్రాలు కట్టించటం వంటి మంచి పనులు చేస్తే	– నిన్ను గురించి లోకంలో చెప్పుకున్నంత వరకు నువ్వు స్వర్గంలో ఉంటావు. దీనికి భారతంతో ఇంద్రద్యుమ్న మహారాజు కథ మంచి ఉదాహరణ.

ఇలా ఏ రకమైన కర్మ చేసినా దానికి తగిన ఫలితం వస్తుంది. ఇప్పుడు చెప్పిన కర్మలకు ఎక్కడా ఫలము మోక్షము అని చెప్పలేదు. కర్మలు చెయ్యటంవల్ల స్వర్గం వస్తుంది. మరుజన్మలో ఉత్తమజన్మ కలుగుతుంది. సద్బ్రాహ్మణుడుగా, జన్మించి వేదవేదాంగాలు నేర్చి చాలా గొప్ప పండితుడయ్యే అవకాశం ఉంది. దేశాన్ని పాలించే రాజవుతాడు. మంచి లక్షణాలున్నవాడుగా జన్మిస్తాడు. అంతేకాని **కర్మలు చేస్తే మోక్షం రాదు.**

ఏదైనా ఒక దాన్ని పొందాలంటే దానికి తగిన అర్హత సాధించాలి. కలెక్టరు కావాలంటే ఐ.ఎ.ఎస్. ప్యాసవ్వాలి. ఐ.ఎ.ఎస్.లో ఉత్తీర్ణుడైతే అతడు కలెక్టరు కాకుండా ఎవరూ ఆపలేరు. ఉత్తీర్ణుడు కాకపోతే అతణ్ణి కలెక్టరు చెయ్యటం ఎవరివల్లా కాదు. అలాగే మోక్షం పొందాలంటే వాసనాక్షయం కావాలి. జీవాత్మ పరమాత్మల మధ్య

తేడా లేదని తెలుసుకోవాలి. అటువంటి వాడు తప్పనిసరిగా మోక్షం పొందుతాడు. కర్మలు చేస్తే స్వర్గం వస్తుంది. ఉత్తమజన్మ వస్తుంది. అంతేకాని మోక్షం మాత్రం రాదు. ఈ విషయాన్నే ఇక్కడ వివరిస్తున్నారు.

నస్నాన మంత్రార్చనకీర్తనాది వా నతీర్థసేవాది చ కర్మ భిక్షోః ।

యుక్తం యతోఽనాత్మమతిప్రవర్ధకం హ్యనాత్మ శాస్త్రైరితమ ప్యశేషమ్॥223

భేదదృష్టి గలవారికి ప్రపంచంలో జరిగే కర్మకాండల యందు చెప్పిన అన్ని విషయాలు చెప్పటంవల్ల జగ్తులో అన్ని విషయాలు, పదార్థాలు ఆత్మకన్న వేరైనవి అనే భేదభావం ఎక్కువ అవుతుంది. మోక్షగామికి స్నానము, మంత్రము, తపము, అర్చన, యజ్ఞయాగాలు మొదలైన కర్మలు పనికిరావు. అలా అని తీర్థయాత్రలు, క్షేత్రదర్శనము వంటివి అవసరం లేదు.

బ్రహ్మము వేరు, జగత్తు వేరు అని భావన చేసేవారికి కర్మకాండల విషయము, దాని అర్థము వినరంగా చెబితే ఆ బేధభావము పెరుగుతుందే కాని తగ్గదు. మోక్షగామికి స్నానము, పూజలు, జపతపాలు, అర్చనలు అవసరం లేదు. అంతేకాదు తీర్థస్నానము, క్షేత్రదర్శనము కూడా అవసరం లేదు. వీటివల్ల పుణ్యపాపాలు, స్వర్గనరకాలు వస్తాయి. అంతేగాని మోక్షం మాత్రం రాదు.

మోక్షాన్ని కోరేవారు అందుకు కావలసిన సాధన సంపత్తిని సమకూర్చుకోవాలి. అతడు సన్యసించాలి. అంతే కాని అవబృథస్నానము, మంత్రానుష్ఠానము, దేవతార్చన, నామసంకీర్తన చేయవలసిన పనిలేదు.

మోక్షగామి చేయవలసిన విధులు చెబుతున్నారు. మోక్షం కావాలి అనుకున్నంత మాత్రంచేత మోక్షం రాదు. మోక్షం పొందటానికి కావలసిన సాధన సంపత్తిని చేకూర్చుకోవాలి. యజ్ఞయాగాది కర్మలు చేస్తే మోక్షం రాదు. యాగాంతంలో చేసేది అవబృథస్నానం. యజ్ఞయాగాది కర్మలు చేస్తే వాటికి చెప్పబడిన ఫలితం వస్తుంది.

అశ్వమేధ యాగం	–	రాజ్యవిస్తరణ, ప్రజాశ్రేయస్సు
రాజసూయం	–	చక్రవర్తిత్వం, ప్రజాశ్రేయస్సు
పుత్రకామేష్టి	–	సంతానప్రాప్తి
అగ్నిచయనం	–	శాశ్వత స్వర్గలోకప్రాప్తి.

ఇలా ఒక్కొక్క యాగానికి ఒక్కొక్క ఫలితం వస్తుంది. అంతేగాని మోక్షం రాదు. వేదాధ్యయనం చేస్తే మోక్షం రాదు. సత్యలోక ప్రాప్తి జరుగుతుంది.

మంత్రజపం వల్ల – దేవతానుగ్రహం కలుగుతుంది.

దేవతార్చన వల్ల – దేవతానుగ్రహం కలుగుతుంది

నామసంకీర్తన వల్ల – మనసుకు ఏకాగ్రత, ప్రశాంతత, దేవతానుగ్రహము కలుగుతాయి.

వీటివల్ల పుణ్యలోకాలు ప్రాప్తిస్తాయి. అంతే మోక్షం మాత్రం రాదు.

బ్రహ్మవిద్య పురుషార్ధాన్ని కలిగించటంలో కర్మను అపేక్షించదు. మోక్షం కావాలంటే కర్మలు చేయవలసిన అవసరం లేదు. అంటోంది బ్ర.సూ. 450వ సూత్రం

17. ముక్తపురుషులు మళ్ళీ జన్మిస్తారా ?

ముక్తి పొందిన పురుషుడు తిరిగి జన్మిస్తాడా? ముక్తి అనేది అనివార్యమా? పాక్షికమా ? లేక నియమమా?

ఆధ్యాత్మిక విషయాలలో మనకు సాధారణంగా ఎదురయ్యే ప్రశ్నలు ఇవి. అసలు ఈ అనుమానం ఎందుకు వచ్చింది? అంటే బ్రహ్మవేత్తలు కూడా మళ్ళీ జన్మించారని పురాణాలలో చెప్పబడింది. వేదాచార్యుడైన **అపాంతరతముడు** మళ్ళీ కృష్ణద్వైపాయనుడుగా జన్మించాడు. సనత్కుమారుడే ఈశ్వరాజ్ఞతో కుమారస్వామి అయినాడు. వీరేకాదు నారదుడు, వసిష్ఠుడు కూడా మళ్ళీ జన్మించారు అని చెబుతున్నాయి పురాణాలు. అందుచేతనే మనకి ఈ అనుమానం వస్తోంది.

అపాంతరతముడు మొ॥వారు లోకంకోసం ఈశ్వరునిచే అధికారంలో నియమించబడ్డారు. వీరు ఆ అధికార సంపాదికమైన కర్మక్షయం అయ్యేదాకా అలానే ఉంటారు. వీరంతా ముక్తపురుషులే. లోకాలను ఉద్ధరించటం కోసం శరీరం ధరించి ముల్లోకాల్లోను తిరుగుతూ, అర్హులైన వారితో మంచి పనులు చేయిస్తుంటారు. ఈ విషయం 391వ సూత్రంలో వివరించబడింది. ఒక్కొక్కసారి మళ్ళీ శరీర ధారణ చెయ్యటానికి వీరు ఏ కర్మలు చేశారో, ఆ కర్మ క్షయం అయ్యేదాకా ఆ శరీరంతోనే ఉంటారు.

తరచుగా మనం రెండు పదాలు వాడతాం. 1.ముక్తి 2.మోక్షము. మన దృష్టిలో ఈ రెండూ పర్యాయపదాలు. వీటికి అర్థం ఒకటే. నిఘంటువు కూడా ముక్తి అంటే మోక్షము అనే అర్థం చెబుతోంది. కాని ఇవి పర్యాయపదాలు కావు. వీటి మధ్య చిన్నతేడా ఉంది. **మరణానంతరము సగుణోపాసకుడు అర్చిరాది మార్గం ద్వారా ప్రయాణం చేసి బ్రహ్మలోకం చేరతాడు. అది ముక్తి. దేహపాతం జరిగిన తరువాత నిర్గుణోపాసకుడి ఆత్మ పరమాత్మలో లీనమవుతుంది. ఇది మోక్షము.** జీవుడు బ్రహ్మలోకం చేరటం – ముక్తి. పరబ్రహ్మలో లీనం కావటం మోక్షం. దీన్నే సాయుజ్యం అంటారు. సాయుజ్యం పొందిన వారికి శరీరాదులుండవు.

బ్రహ్మలోకంలో కార్యబ్రహ్మ ఉంటాడు. అతణ్ణే సగుణబ్రహ్మ, అపరబ్రహ్మ అంటారు. ఇతడు పరబ్రహ్మకు ప్రతిరూపం. అంతేకాని పరబ్రహ్మ కాదు.

వైష్ణవులకు – శ్రీమహావిష్ణువు, శ్రీమన్నారాయణుడు, రాముడు, కృష్ణుడు

శైవులకు – ఈశ్వరుడు

శ్రీవిద్యాపరులకు – పరాశక్తి అపరబ్రహ్మలు.

మరణానంతరము

వైష్ణవులు – వైకుంఠం చేరతారు

శైవులు – కైలాసం చేరతారు

శ్రీవిద్యాపరులు – మణిద్వీపం చేరతారు.

వైకుంఠంలో – లక్ష్మీదేవి, నారదుడు, గరుడుడు, ఆదిశేషుడు

కైలాసంలో – పార్వతీదేవి, నంది, భృంగి, శృంగి

మణిద్వీపంలో – కామేశ్వరి, వజ్రేశ్వరి, భగమాలిని

వీరంతా నిత్యముక్తులు అని పురాణాలు చెబుతున్నాయి. నిత్యము అపరబ్రహ్మ సన్నిధిలో ఉండేవారు నిత్యముక్తులు.

ఇప్పుడు బ్రహ్మలోకం చేరిన ముక్తపురుషుడికి శరీరముంటుందా? అనే అనుమానం వస్తుంది. ఇదంతా సగుణోపాసకుల గురించే చెప్పబడుతోంది. నిర్గుణోపాసకులకు అస్థిత్వం ఉండదు. వారు పరమాత్మలో లీనమవుతారు కాబట్టి వారికి శరీర ధారణ అనేది ఉండదు.

ముక్తపురుషుడు సంకల్పమాత్రం చేతనే కోరిన లోకాలు పొందుతాడు. అంటోంది **ఛాందోగ్యోపనిషత్తు.**

సత్యకాముడై దహరాకాశంలో బ్రహ్మను సేవించినవాడు మరణానంతరం పితృలోకాన్ని కోరితే పితృగణం ప్రత్యక్షమవుతుంది. వారితో పితృలోకాలకు పోయి పితృలోక అనుభవాలతో సంపన్నుడై మహిమాన్వితుడౌతాడు.

అతడు మాతృలోకాలు కోరితే, మాతృగణాలతో మాతృలోకాలకు పోయి అక్కడి సుఖాలనుభవిస్తాడు. భ్రాతృలోకాలు కోరితే, భ్రాతృగణాలతో భ్రాతృ లోకాలకు పోయి అక్కడి సుఖం అనుభవిస్తాడు. భగినీలోకాలు (సోదరి) కోరితే భగినీ లోకాలకు పోయి సుఖిస్తాడు. మిత్రలోకాలు కోరితే, మిత్రులంతా ప్రత్యక్షమవుతారు. వారితో ఆ లోకాలు పోయి సుఖిస్తాడు. గంధమాల్య లోకాలు (పూలదండలు, సుగంధ ద్రవ్యాలు పుష్కలంగా గల లోకం) కోరితే ఆ లోకవాసులు ప్రత్యక్షమవుతారు. వారితో కలిసి ఆ లోకంలో సుఖిస్తాడు.

అన్నపాన లోకాలు కోరితే ఆ లోకవాసులు ప్రత్యక్షమవుతారు. వారితో కలసి ఆ లోకంలో సుఖిస్తాడు. గీతావాద్య సంబంధమైన లోకాలు కోరితే ఆ లోకవాసులు ప్రత్యక్షమవుతారు. వారితో కలసి అక్కడ సుఖాలను అనుభవిస్తాడు. స్త్రీలోకాన్ని కోరితే ఆ లోకవాసులైన స్త్రీలు ప్రత్యక్షమవుతారు. వారితో కలసి ఆ లోకంలో సుఖిస్తాడు. ఈ రకంగా అతడు ఏ లోకాలు కోరితే ఆలోకవాసులు ప్రత్యక్షమవుతారు. వారితో కలిసి ఆ లోకాలలో సుఖిస్తాడు.

సంకల్పం కావాలంటే మనస్సు కావాలి. ముక్తపురుషుడికి మనస్సు, ఇంద్రియాలు అన్నీ ఉంటాయా? అనేది అనుమానం. ముక్తపురుషుడు మనసుతోనే అన్నీ అనుభవిస్తాడు అంటోంది ఛాందోగ్యోపనిషత్తు. బాదరి అభిప్రాయం ప్రకారం ముక్తపురుషుడికి ఇంద్రియాలు, శరీరము ఉండవు. (బ్ర.సూ. 543) జైమిని అభిప్రాయం ప్రకారం ముక్తపురుషుడికి శరీరాదులు ఉన్నాయి. (బ్ర.సూ. 544) అయితే బ్రహ్మలోకం పొందిన వారు స్వతంత్రులు. వారి సంకల్పం తిరుగులేనిది. వారు కావాలనుకుంటే శరీరం ధరిస్తారు అంటాడు వ్యాసుడు. (బ్ర.సూ. 545)

రావణుడి బాధలు పడలేకుండా ఉన్నాము రక్షించమని దేవతలు, మునులు ప్రార్థించినపుడు సాక్షాత్తు పరమేశ్వర స్వరూపమైన శ్రీమన్నారాయణుడు తాను

భూలోకంలో కౌసల్యాగర్భాన రాముడిగా అవతరిస్తానని చెప్పాడు. అలాగే గీతలో లోకంలో ధర్మానికి హాని ఎప్పుడైతే కలుగుతుందో, అప్పుడు నేను అవతరిస్తాను అన్నాడు పరమాత్ముడు.

సగుణారాధన చేసి బ్రహ్మలోకం చేరినవారు లోకాలను ఉద్ధరించాలనే తలంపుతో సూక్ష్మశరీరంతో ముల్లోకాల యందు తిరుగుతుంటారు. ఒకవేళ అవసరమైతే ధర్మరక్షణ కోసం వీరుకూడా శరీరధారణ చేస్తారు. ఈ ముక్తులు అలా శరీరాన్ని ధరిస్తే, ఆ శరీరంతో చేసే పాపపుణ్యాలు వారే అనుభవించాలి.

శ్రీమహావిష్ణువు సాక్షాత్తు పరమేశ్వర స్వరూపం. నారదుడి శాపం వల్లనే రాముడిగా జన్మించాడు. వాలిని చెట్టుచాటు నుంచి చంపినందుకే ద్వాపరయుగంలో కృష్ణుడుగా జన్మించాడు. కురుక్షేత్ర సంగ్రామంలో కౌరవులంతా మరణించారనే శోకంతోనే యాదవవంశం నాశనం కావాలని కృష్ణుడికి శాపంపెట్టింది గాంధారి. లక్ష్మీదేవిశాపం వల్లనే శ్రీమహావిష్ణువు తలతెగిపడింది. ఆ తరువాతే విష్ణుమూర్తి హయగ్రీవుడైనాడు. కాబట్టి ముక్త పురుషులు తిరిగి జన్మించవచ్చు. శరీరధారణ కూడా చెయ్యవచ్చు. కాని ఆ శరీరంతో చేసిన కర్మలు వారే అనుభవించాలి. అతని కర్మకు అతడే బాధ్యుడు.

18. జగద్రక్షకుడు పరమాత్మ

చరచార జగత్తులో సృష్టి స్థితి లయాలు చూసేది పరమాత్మ. ఈ జగత్తును సృష్టించేది ఆయనే. లయం చేసేది ఆయనే. జగద్రక్షకుడు కూడా ఆయనే. అయితే ఆ పరమేశ్వరుడు ఎలా ఉంటాడు? ఎక్కడ ఉంటాడు. ఆయన్ను తెలుసుకోవటం ఎలా?

కఠోపనిషత్తులో నచికేతుడు యముడి దగ్గరకు వెళ్ళి బ్రహ్మోపదేశం చెయ్యమని అడుగుతున్నాడు. "ఓ యమధర్మరాజా! నువ్వు ధర్మాధర్మాలకు భిన్నంగ, కార్యకారణములకు అతీతముగ, భూతభవిష్యద్వర్త మానములకు అతీతంగా దేనిని చూస్తున్నావో దానిని గురించి నాకు వివరించవలసినది" ఆ మాటలు విన్న యమధర్మరాజు చెబుతున్నాడు. "సమస్త వేదాలు ఎవరిని ప్రశంశిస్తున్నాయో, సమస్త తపస్సులు దేనిని ప్రకటిస్తున్నాయో, దేనిని కోరి యోగిపుంగవులు నియమనిష్ఠలతో, బ్రహ్మచర్యంతో కాలం గడుపుతున్నారో, అటువంటి దాన్ని గూర్చి నీకు వివరిస్తాను. అదే **ఓం** కారము. ఈ అక్షరమే పరబ్రహ్మ."

"ఆర్యా ! దేవతలకు కూడా ఈ విషయం అర్థం కాకపోవచ్చు కాని దాన్ని వివరించి చెప్పగల సమర్థుడవు నీవే. అందుకని నాకు ఆ విషయం వివరించు" అన్నాడు.

నచికేతా ! వంద సంవత్సరాలు జీవించే పూర్ణాయువు గల పుత్రులను కోరుకో. అసంఖ్యాకమైన పశువులు, ఏనుగులు, గుర్రాలు, బంగారము కోరుకో. గొప్ప సామ్రాజ్యం కోరుకో. నీ ఇష్టం వచ్చినంత కాలం జీవించు. అపారమైన ఐశ్వర్యము, చక్రవర్తిత్వము, నీకు ఇస్తాను. దీంతో సమానమైన వరం ఇంకేదైనా కోరుకో.

ఓ నచికేతా! భూలోకంలో దుర్లభమైన విషయాలన్నీ కోరుకో. అవన్నీ ఇస్తాను అనుభవించు. అంతేగాని మరణం తరువాత ఆత్మవిచారము మాత్రము అడగవద్దు. అన్నాడు యముడు. రాజా! ఈ భోగాలన్నీ నేడు ఉంటాయి. రేపు ఉండవు. ఇవి అనిత్యమైనవి. అశాశ్వతమైన భోగభాగ్యాలు నాకువద్దు. ఇలాంటివి ఎన్ని ఉన్నా ఆత్మజ్ఞానానికి సాటియైనది ఏదీలేదు. అందుచేత నాకు ఆత్మజ్ఞానాన్ని గురించి వివరించవలసింది" అన్నాడు నచికేతుడు. నచికేతుని పట్టుదలకు సంతసించినవాడై యముడు అతనికి ఆత్మజ్ఞానాన్ని వివరించటం మొదలుపెట్టాడు.

నచికేతా ! శ్రేయస్సు, ప్రేయస్సు అని రెండు మార్గాలున్నాయి. వీటిలో శ్రేయోమార్గాన్ని అనుసరించేవాడు శుభాన్ని పొందుతాడు. ప్రేయస్సు కోరినవాడు గమ్యాన్ని చేరలేడు.

వివేకవంతుడు ఈ మార్గాలను పరీక్షించి, విమర్శించి చూస్తాడు. ఎందుకంటే అతడు శ్రేయస్సునే కోరతాడు. కాని అజ్ఞాని లోకంలో పొందే ఐహిక సుఖాలు, విషయవాంఛల కోసం ప్రేయోమార్గాన్ని అనుసరిస్తాడు.

"నచికేతా! శ్రేయస్సు, ప్రేయస్సు అని రెండు విషయాలను శ్రుతులు చెబుతున్నాయి. ఇక్కడ శ్రేయస్సు అంటే విద్య. ప్రేయస్సు అంటే అవిద్య. పునరావృత్తి రహితమైన మోక్షమార్గమే శ్రేయస్సు. కాగా ఐహిక సుఖాలలో ఓలలాడించేది ప్రేయోమార్గము. మానవుడు ఈ రెంటిలో ఏదో ఒక మార్గాన్ని అనుసరించి తీరాలి. ఈ రెండు మార్గాలు కలిసి ఉన్నట్టుగానే కనిపిస్తాయి. విజ్ఞుడైనవాడు దీన్ని విభజించి శ్రేయోమార్గాన్నే ఎన్నుకుంటాడు. ఈ రెండూ విరుద్ధ స్వభావాలు గలవి. వీటిలో శ్రేయోమార్గము కాంతి కాగా ప్రేయస్సు చీకటి. అవిద్యలో మునిగినవాడు తనను

తాను గొప్పపండితుడుగా భావించుకుంటాడు. ధనధాన్యాలు, భార్యాపుత్రులు ఇవే లోకమనుకుంటాడు. ఇలాంటివాడు జనన మరణాలతో బాధపడుతుంటాడు.

ఆత్మజ్ఞానం అనే పదం వినటానికి కూడా చాలామందికి అర్హత ఉండదు. అందుకే వాళ్ళు దాన్ని ఇష్టపడరు. కొందరికి విన్నా అది అర్థంకాదు. అసలు దీన్ని గురించి చెప్పే గురువు దొరకటం కూడా చాలా విశేషం. 'నేను బ్రహ్మని' అనే జ్ఞానం పొందిన గురువు ద్వారా ఈ విషయాన్ని తెలుసుకోవటం పూర్వజన్మ సుకృతం.

కర్మవల్ల లభించే ఫలితం అనిత్యము. దానివల్ల ఆత్మ తత్త్వం లభించదు. కర్మలు అనిత్యం. ఆత్మనిత్యం. ఈ విషయం తెలిసికూడా నేను అగ్నిచయనం చేశాను. దాని ఫలితంగా మృత్యుదేవతనయ్యాను. నచికేతా! మానవుడు ఆత్మను ఇంద్రియాల నుండి వేరు చేసి శాశ్వత ఆనందాన్నిచ్చే ఆత్మతత్త్వాన్ని పొందుతాడు. నీవు దానికి పూర్తిగా అర్హుడవు.

వేదాలు దేన్ని గురించి చెబుతున్నాయో, దేన్ని పొందటానికి కృచ్ఛకము, చాంద్రాయణము మొ॥ వ్రతాలు చేస్తున్నారో, దేనికోసం బ్రహ్మచర్యం అవలంభించి, నియమనిష్టలు పాటిస్తున్నారో, అటువంటి పరమపదమే ఓంకారము.

ఓంకారమనే ఆ అక్షరమే పరబ్రహ్మ. దీన్ని తెలుసుకున్న వారికి సర్వకార్యాలు సిద్ధిస్తాయి. ఆ బ్రహ్మము శ్రేష్ఠమైనది. సర్వోత్కృష్ఠమైనది. దీన్ని తెలుసుకున్నవాడు బ్రహ్మలోకంలో పూజింపబడతాడు. అది అణువుకున్న చిన్నది. మహత్తులన్నింటి కన్న పెద్దది. ప్రతిజీవి యొక్క హృదయమనే గుహలో ఉంటుంది. అంటూ ఆత్మతత్త్వాన్ని వివరిస్తాడు.

ఆత్మనిత్యము, సత్యము సర్వవ్యాపకమైనది. భగవద్పాదుల వారు చెప్పినట్లుగా

దేనిని పొందిన తరువాత ఇక పొందవలసినది ఉండదో, ఏ సుఖాన్ని మించిన సుఖం ఇంకొకటి లేదో, ఏ జ్ఞానాన్ని మించిన జ్ఞానం లేదో, దేన్ని చూసిన తరువాత ఇంక చూడవలసినది ఏదీ ఉండదో, దేనిని పొందిన తరువాత పునర్జన్మ ఉండదో, దేనిని తెలుసుకున్న తరువాత ఇంకా తెలుసుకోవలసినది ఉండదో, అదే బ్రహ్మము.

కేనోపనిషత్తులో

ఆ పరబ్రహ్మను కళ్ళతో చూడటానికి వీలుకాదు. వాక్కుతో చెప్పటానికి, మనసుతో ఊహించటానికి, వీలుకాదు. అది తెలిసిన వాటికి, తెలియని వాటికి కూడా అతీతమైనది.

ఏది వాగింద్రియము చేత గ్రహించబడదో, దేనివలన వాగింద్రియము పని చేస్తున్నదో అదే పరబ్రహ్మ. ఏది మనస్సుచేత ఊహించటానికి వీలు కాదో, దేనివలన మనసు పనిచేస్తున్నదో అదే పరబ్రహ్మ.

దేనిని కళ్ళతో చూడటానికి వీలుకాదో, దేనివలన కనులు పని చేస్తున్నాయో అదే పరబ్రహ్మ. దేనిని శ్రవణేంద్రియం వల్ల తెలుసుకోలేమో, శ్రవణేంద్రియం దేనివల్ల పని చేస్తున్నదో అదే పరబ్రహ్మ. దేనిని ప్రాణాలవల్ల తెలుసుకోలేమో, దేనివల్ల ప్రాణాలు నిలుస్తున్నాయో అదే పరబ్రహ్మము" అని చెప్పబడింది.

పైన, క్రింద, ప్రక్కల అంతటా వ్యాపించినది సుఖస్వరూపము, అద్వితీయము, అనంతము అయినదే బ్రహ్మము. ఉపనిషత్తులలో మహావాక్యాల ద్వారా చెప్పబడ్డది, అద్వితీయము, అఖండానంద స్వరూపమైనదే బ్రహ్మము. అది స్థూలము కాదు సూక్ష్మము కాదు. పొడవు కాదు పొట్టి కాదు. జనన మరణాలు లేనిది, రూప, గుణ, వర్ణాదులు లేనిదే బ్రహ్మము. ఆ బ్రహ్మము యొక్క కాంతులవల్లనే సూర్యచంద్రులు, నక్షత్రాలు, గ్రహాలు అన్నీ ప్రకాశిస్తున్నాయి.

అటువంటి ఆత్మను (బ్రహ్మమును) గుర్తించగలిగిన వాడికి దుఃఖం అనేది ఉండదు. వేదాలు వల్లించటం వల్లగాని, శాస్త్రాలు చదవటం వల్ల గాని, ఉపదేశాలు పొందటం వల్ల గాని ఆత్మసాక్షాత్కారం లభించదు. అది ఆత్మవల్ల మాత్రమే లభ్యమవుతుంది."

కాబట్టి చరాచర జగత్తును రక్షించే వాడు పరమాత్మే తప్ప వేరెవరూ కాదు. ఈ విషయం 40,41 సూత్రాలలో వివరించబడింది.

19. హృదయగుహలోని ఇద్దరూ జీవాత్మ పరమాత్మలు

హృదయము అనే గుహలో ఉన్న ఇద్దరూ జీవాత్మ, పరమాత్మ.

ఈ ఇద్దరూ ఒకే రకంగా ఉంటారు. ఒకే స్వభావం కలవారై ఉంటారు. కర్మఫలాన్ని అనుభవించే వాడు జీవుడు. రెండోవాడు కర్మఫలం లేనివాడు, పరమాత్మ. అంతేగాని అచేతనమైన బుద్ధికాదు. పరమాత్మకు కర్మఫలానుభవము, పుణ్యలోకప్రాప్తి అనేవి ఉండవు. అయితే ఆ లక్షణాలు హృదయంలో ఉన్న ఇద్దరికీ ఎందుకు చెప్పారు? అంటే – ఇది 'ఛత్రిన్యాయం' కొంతమంది గొడుగులతో పోతున్నారు. కొంతమంది గొడుగులు లేకుండా పోతున్నారు. అప్పుడు వారందరినీ కలిపి 'ఛత్రధారులు

వెడుతున్నారు' అంటారు. ఇక్కడ గొడుగు లేనివారిని గురించి చెప్పవలసిన అవసరం లేదు. గొడుగు ఉన్న వానిని గురించి మాత్రమే చెప్పాలి. అందుకని అలా చెబుతారు. అదే విధంగా ఇక్కడ కూడా ఒకరికి కర్మఫలం, భోగం ఉన్నాయి. రెండవ వాడికి అవి లేవు. అయినప్పటికీ, ఈ మాట ఇద్దరికీ సంబంధించే చెబుతారు.

పరమాత్మ హృదయమనే గుహలోనే ఉంటాడు. శరీరంలో పరబ్రహ్మ ఉండేచోట ఇద్దరున్నారు. వారిలో ఒకడు కర్మఫలం అనుభవించేవాడు. రెండవ వాడు సంసార బంధనాలు లేనివాడు. వీరిద్దరే వెలుగు, నీడ. వీరిద్దరూ ఒకటే. భేదం లేదు. అజ్ఞానంలో ఉన్నప్పుడు జీవుడు. అజ్ఞానం వదిలిపోతే దేవుడు. ఆ జీవుడే పరమేశ్వరునిలో లీనమై పోతాడు.

శ్రుతులందలి విశేషణాల వల్ల కూడా వీరిద్దరూ జీవాత్మ, పరమాత్మ అని తెలుస్తోంది. **కఠోపనిషత్తులో** శరీరమే రథము. ఆత్మే యజమాని, బుద్ధిసారథి, మనస్సే కళ్ళెము. ఇంద్రియాలే గుర్రాలు. వాటి మార్గమే విషయాలు. ఆత్మ దేహేంద్రియాలతో కలసినప్పుడు దాన్ని భోక్త అంటారు.

స్థిరమైన మనస్సు, సరియైన విజ్ఞానము లేని వాని ఇంద్రియాలు సారథి అధీనంలో లేని దుష్టాశ్వాలు లాగా సాధకుని వశంలో ఉండవు. పరిణతి చెందిన మనస్సు, విజ్ఞానము గల వాడి ఇంద్రియాలు సారధి అదుపులో ఉండే మంచి గుర్రాలు లాగా ఉంటాయి. విజ్ఞానము లేనివాడు, అపవిత్రమైన మనసు గలవాడు జనన మరణ రూపమైన సంసారంలో పడి పరిభ్రమిస్తున్నాడు. విజ్ఞానము గలవాడు, పవిత్రమైన మనసు, మనోనిగ్రహము గలవాడు పునర్జన్మ లేని ఆత్మ పదాన్ని పొందుతాడు. విజ్ఞానమనే సారథి గలవాడు, మనస్సు అధీనంలో గలవాడు జీవనగమ్యమైన పరమపదం చేరతాడు.

ఇంద్రియాలు	–	మనస్సు అధీనంలోనూ
మనస్సు	–	బుద్ధి అధీనంలోనూ
బుద్ధి	–	యజమాని అధీనంలోనూ ఉంటాయి.

విజ్ఞానహీనుడు మనస్సును అదుపులో ఉంచుకోలేడు. తాను చేరవలసిన గమ్యం చేరలేడు. మోక్షాన్ని పొందలేడు. వివేకవంతమైన బుద్ధిని కలిగినవాడు, మనస్సును అదుపులో ఉంచగలిగినవాడు, పరమపదాన్ని చేరతాడు.

ఇంద్రియాలకన్న	-	వాటి విషయాలు (లక్షణాలు) శ్రేష్ఠమైనవి
విషయాలకన్న	-	మనస్సు శ్రేష్ఠమైనది
మనస్సుకన్న	-	బుద్ధి శ్రేష్ఠమైనది
బుద్ధికన్న	-	మహత్తత్త్వం శ్రేష్ఠమైనది
మహతత్త్వముకన్న	-	అవ్యాకృత ప్రకృతి గొప్పది
ప్రకృతికన్న	-	సూక్ష్మరూపి అయిన పురుషుడు గొప్పవాడు

అంతకు మించినది ఇంకేమీలేదు. ఇదే పరాకాష్ఠ. అతణ్ణి చేరిన తరువాత తిరిగి రావటం లేదు.

ఆత్మ అనేది సూక్ష్మమైన బుద్ధిచేత మాత్రమే గ్రహించబడుతుంది. ఆత్మ సర్వవస్తుజాల మందూ ఉన్నది. కాని పైకి కనపడదు. సూక్ష్మబుద్ధి గలవారు మాత్రమే దాన్ని గుర్తించగలరు. వివేకవంతుడు

ఇంద్రియాలను	-	మనస్సులో లీనం చెయ్యాలి
మనస్సును	-	బుద్ధిలో లీనం చెయ్యాలి
బుద్ధిని	-	మహత్తత్త్వంలో లీనం చెయ్యాలి
మహత్తత్త్వాన్ని	-	ఆత్మలో లీనం చెయ్యాలి

శబ్దము, రూపము, రసము, వాసన, నాశనము లేనిది, నిత్యము, అనాది అయినది. ఆత్మ సర్వభూతసాక్షియైన మహత్తత్త్వము కన్న శ్రేష్ఠమైనది. నిశ్చలమైనది; ఆత్మతత్త్వాన్ని తెలుసుకున్నవాడు మృత్యువు వాతపడడు. అతడికి అమరత్త్వం సిద్ధిస్తుంది." అంటూ నచికేతునికి ఆత్మతత్త్వాన్ని వివరించాడు యముడు.

ముండకోపనిషత్తులో చెప్పినట్లుగా, ఒకే పేరు, ఒకే రూపము గల పక్షులు రెండు ప్రపంచమనే వృక్షాన్ని ఆశ్రయించి ఉన్నాయి. అందులో ఒకటి జీవాత్మ. ఇది తన కర్మలవల్ల వచ్చిన ఫలితాలను అనుభవిస్తోంది. రెండవది పరమాత్మ. కర్మఫలం ఏమి లేకుండా చూస్తూ కూర్చుంది. శరీరమే ఆ వృక్షము. ఆ పక్షులే క్షేత్రజ్ఞ పరమాత్మలు. వారిద్దరూ వేరుకాదు. ఈ రెండూ కలిసి ఒకే చోట ఉన్నప్పటికీ జీవుడు మోహానికి వసుడై శోకాన్ని అనుభవిస్తూ ఉంటాడు. అజ్ఞానం వల్ల అనేక బాధలు పడుతుంటాడు.

కాని అతడే యోగీశ్వరులచేత సేవించబడేవాడు అని తెలిసినప్పుడు అంటే మోహం నశించినప్పుడు శోకం నుండి విముక్తుడౌతాడు. ఈ జీవుడు ఎప్పుడైతే చైతన్యరూపుడు, స్వయంప్రకాశి, జగన్నిర్మాత అయిన పరమాత్మను దర్శించ గలుగుతాడో అప్పుడు భేదభావాలు వీడి అద్వైతభావం పొందుతాడు.

సమస్త జీవులయందూ ఉంటూ భిన్నంగా కనిపించేదే పరమాత్మ. అతడు వేరు వేరు జీవుల్లో వేరువేరుగా కనిపిస్తాడు. ఈ విషయం తెలిసిన జ్ఞాని వాదాలకు, వాదనలకు పోడు. ఎందుకంటే జగత్తులోని జీవులన్నీ పరమేశ్వర స్వరూపమే. కాబట్టి ఎవరితో వాదించినా తనతో తాను వాదించుకున్నట్లే, ఈ రకంగా ఆత్మలోనే క్రీడిస్తూ, ఆత్మలో సంతోషిస్తూ, ఆత్మలోనే రమిస్తూ ఉన్నవాడు బ్రహ్మజ్ఞానులలో శ్రేష్ఠుడు. అతడే సర్వోత్తముడు. అజ్ఞానపు ముడులు వీడి తానే పరమాత్మ అని తెలిసినపుడు, అంటే ఆత్మసాక్షాత్కారం జరిగినప్పుడు జీవాత్మ పరమాత్మలో లీనమై పోతుంది.

కాబట్టి హృదయమనే గుహలో ఉండే జీవాత్మే పరమాత్మ. ఈ విషయం 42, 43 సూత్రాలలో వివరించబడింది.

౨౦. జగత్తుకు ఉపాదాన నిమిత్త కారణాలు బ్రహ్మమే.

ఈ జగత్తుకు బ్రహ్మ ఉపాదానకారణమా? నిమిత్తకారణమా? కుండకు కుమ్మరి నిమిత్త కారణము, మట్టి ఉపాదాన కారణము. అలాగే ఆభరణానికి ఉపాదాన కారణము బంగారం. నిమిత్త కారణం కంసాలి. కుమ్మరివాడు కుండను ఏ రకంగా తయారుచెయ్యాలో ముందుగా ఆలోచించుకుని తయారుచేస్తాడు. అలాగే స్వర్ణకారుడు కూడా. **ఛాందోగ్యోపనిషత్తు**లో ఈ సృష్టిని గురించి పరబ్రహ్మ ఆలోచించాడు. ఒకటిగా ఉన్న పరబ్రహ్మ తాను అనేకం కావాలి అనుకున్నాడు **ప్రశ్నోపనిషత్తు**లో ఆ పరబ్రహ్మ ఆలోచన చేశాడు. ముందుగా ప్రాణాన్ని సృష్టించాడు **ఐతరేయోపనిషత్తు**లో పరమాత్మ విరాట్స్వరూపాన్ని దృష్టిలో ఉంచుకుని తీవ్రమైన ఆలోచన చేశాడు. అని చెప్పబడింది. కాబట్టి ఈ జగత్తుకు పరబ్రహ్మ ఉపాదాన కారణమా? నిమిత్త కారణమా? ఈ విషయం చూద్దాం.

పరబ్రహ్మ ఈ జగత్తుకు ఉపాదానకారణము నిమిత్తకారణము కూడా.

ఛాందోగ్యోపనిషత్తులో ఆత్మజ్ఞానాన్ని బోధిస్తూ ఉద్దాలకుడు తన కుమారుడైన శ్వేతకేతువుతో అంటున్నాడు. "నాయనా శ్వేతకేతూ! శ్రవణ గోచరంకాని తత్త్వం ఇంద్రియ గోచరమయ్యే విధానము గురించి మీ గురువుగారిని అడిగావా."

ఎమిటా విషయం? అన్నాడు శ్వేతకేతువు. మట్టిని గురించి తెలిస్తే, మట్టితో చేసిన రకరకాల వస్తువులు వాటి పేర్లలో తేడా గురించి తెలుస్తుంది. అలాగే బంగారం గురించి తెలిస్తే దానితో తయారుచేసే నగలకు ఏ పేరు పెట్టినా అందులో ఉన్నది బంగారమే అని తెలుస్తుంది. అలాగే ఏ విషయం తెలుసుకున్నందువల్ల మనకు అన్ని విషయాలు బోధ పడతాయో, దాన్ని గురించి తెలుసుకోవాలి. ఇక్కడ మట్టి సత్యం. ఉపాదాన కారణము. అలాగే బ్రహ్మసత్యం. ఈ జగత్తుకు అదే ఉపాదాన కారణము, నిమిత్తకారణము కూడా.

పరబ్రహ్మ తాను అనేకం కావాలని కోరుకున్నాడు. ఈ కోరిక వల్ల బ్రహ్మకు కర్తృత్వము, ఉపాదానత్వము రెండూ వస్తాయి.

బ్రహ్మకు సృష్టి, లయాలు రెండూ చెప్పటంవల్ల అతడు జగత్తుకు ఉపాదాన కారణం అవుతున్నాడు. ఈ సమస్తభూతాలు ఆకాశం నుంచే పుడుతున్నాయి. ఆకాశంలోనే లీనమవుతున్నాయి అని చెప్పటం జరిగింది. ఇక్కడ ఆకాశము అంటే పరబ్రహ్మ. అంతేకాని భూతాకాశం కాదు. ఈ జగత్తంతా బ్రహ్మనుండే పుట్టి బ్రహ్మలోనే లీనమవుతుంది. ఒక వస్తువు యొక్క సృష్టికి, లయానికి ఏది కారణమవుతుందో, అది దానికి ఉపాదాన కారణము. మట్టినుండి పుట్టినకుండ మళ్ళీ మట్టిలోనే కలిసిపోతుంది. అందుకే కుండకు మట్టిలాగా జగత్తుకు బ్రహ్మ ఉపాదానకారణము.

ఆత్మసంబంధమైన ప్రకృతివల్ల, ఆత్మను స్వయంగా సృజించాడు అని చెప్పటంవల్ల బ్రహ్మ ఆ జగత్తుకు ఉపాదాన కారణము అవుతున్నాడు. అతడే స్వయంగా నామరూపాత్మకమైన జగత్తును సృష్టించాడు అని చెప్పటంవల్ల అతడికి కర్తృత్వం వస్తోంది. అంటే నిమిత్త కారణమవుతున్నాడు.

ఇక్కడ యోని అంటే ఆత్మ అని అర్థం. **ముండకోపనిషత్తు**లో వివేకవంతులు సమస్త భూతాలకు కారణమైన వానిని అంతటా చూస్తారు అని చెప్పటం జరిగింది.

కాబట్టి ఈ జగత్తుకు బ్రహ్మమే ఉపాదానకారణము మరియు నిమిత్తకారణము కూడా. ఈ విషయమంతా 129 నుంచి 133 వరకు సూత్రాలలో వివరించబడింది.

పరమేశ్వరుడు జగత్తును సృష్టించటానికి ఏ ఇతర సాధనాలు అవసరం లేదు. కుమ్మరివాడు కుండలు చెయ్యాలి అంటే కేవలము మట్టి మాత్రమే కాకుండా కుమ్మరిసారె, కర్ర, నీరు వంటి ఇతర సాధనాలు కావాలి కదా. మరి జగత్తును సృష్టి చేసే బ్రహ్మకు మాత్రం ఈ రకమైన ఇతర సాధనాలు అవసరం ఉండవా?" ఇది సందేహం. దీనికి సమాధానం చెబుతున్నారు.

పనిచేసేవాడు సాధనాలను ప్రోగు చేస్తాడు. మరి బ్రహ్మకు ఇతర సాధనాలుండవా? అంటే కుమ్మరివాడు ఇతర సాధనాలు ఉపయోగిస్తాడు. పరబ్రహ్మకు ఇతర సాధనాలు ఏమీ లేవు. కాబట్టి జగత్తుకు కారణం బ్రహ్మముకాదు అనకూడదు. ఉపకరణాలు లేకపోయినా లోకంలో పని జరుగుతుంది. పాలు పెరుగుగా మారాలంటే ఏ సాధనము అవసరం లేదు. పాలను వేడి చేస్తున్నాం అనకండి. అవి తొందరగా తోడుకోవటానికి వేడి చేస్తున్నాం అంతే. వేడి చెయ్యకపోయినా పెరుగవుతుంది. పాలల్లో పెరుగయ్యే గుణం లేకపోతే వాటిని వేడి చేసినా, ఇగరపెట్టినా పెరుగవదు. నీటిని వేడి చేస్తే పెరుగవదు. మట్టిని వేడి చేస్తే పెరుగవదు. ఆ గుణం లేకపోతే దాన్ని ఏం చేసినా అది పెరుగవదు. అలాగే పరమాత్మ సర్వశక్తి సంపన్నుడు. సర్వగుణ సంపన్నుడు. కాబట్టి అతడికి ఇతర సాధనాలు ఏమీ అవసరం లేదు.

బ్రహ్మకు కార్యము, కారణము లేదు. అతనితో సమానమైన వారు గాని, అతనికన్న అధికులు గాని లేరు. కాబట్టి అతడికి వేటి సాయము అవసరం లేదు.

మంత్రశాస్త్రంలోను, ఇతిహాసాల్లోనూ కూడా దేవతాదులు అసహాయులై కార్యం చేస్తున్నారని చెప్పబడింది.

వేదాలు, పురాణాలు, ఇతిహాసాలలో దేవతలు, పిత్రుదేవతలు ఏ సాధన సంపత్తి లేకుండానే సంకల్పబలం మాత్రంచేతనే మహత్తర కార్యాలు చేశారని చెప్పబడింది. సాలెపురుగు ఏ సహాయం లేకుండానే గూడు నిర్మిస్తుంది. కొంగ శుక్ర వీర్యాలు లేకుండానే గర్భధారణ చేస్తుంది. అలాగే బ్రహ్మకూడా ఏ సహాయము, సాధన సంపత్తి లేకుండానే జగన్నిర్మాణము చేస్తున్నాడు.

ఈ విషయమంతా 158, 159 సూత్రాలలో వివరించబడింది.

21. అక్షియందున్న పురుషుడు పరమాత్మే

ఛాందోగ్యోపనిషత్తులో సత్యకామజాబాలి విద్యాభ్యాసం పూర్తి చేసుకుని గృహస్థాశ్రమం స్వీకరించి గురుకులాన్ని స్థాపించాడు. అతడి దగ్గర ఉపకోశలుడు శిష్యరికం చేస్తున్నాడు. ఈ రకంగా పన్నెండు సంవత్సరాలు గడిచినాయి. దీక్షతో గురువుగారికి సపర్యలు చేస్తున్నాడు. అయినా గురువు గారి కటాక్ష వీక్షణాలు అతడిమీద ప్రసరించలేదు. ఉపకోశలుడితో పాటు అనేకమంది శిష్యులు సత్యకాముడి దగ్గరకు వచ్చారు. వారి అర్హతలను బట్టి వారందరికీ ఉపదేశం చేసి పంపించేశాడు సత్యకాముడు. కాని ఉపకోశలుణ్ణి మాత్రం పట్టించుకోలేదు. అతడు ఆశ్రమం వదలి వెళ్ళటానికి గురువుగారి దగ్గర నుంచి అంగీకారం ఇంకారాలేదు. గురుపత్ని కూడా ఉపకోశలుణ్ణి కనికరించ మని గురువుగారిని వేడుకుంది. మౌనం వహించాడుకాని మాట్లాడలేదు గురువుగారు.

ఒకరోజు ఏదోపనిమీద గ్రామాంతరం వెళుతూ ఉపకోశలుణ్ణి పిలిచి ఆశ్రమ ప్రాంగణంలోని అగ్నులను జాగ్రత్తగా చూస్తుండమని చెప్పాడు. ఉపకోశలుడు విచారంలో మునిగిపోయాడు. ఆహార పానీయాలు కూడా విసర్జించాడు. చివరకు రోగగ్రస్తుడు కూడా అయినాడు. అది చూసి గురుపత్ని చాలా బాధపడింది. పుత్ర వాత్సల్యంతో ఆహారం తీసుకోమని బ్రతిమాలింది. దానికి ఉపకోశలుడు "తల్లీ! నా హృదయం ఇంకా పవిత్రం కాలేదు. అందుకే గురువుగారు నన్ను ఇంకా పరీక్షిస్తున్నారు. నా హృదయంలో ఇంకా అనేకమైన దుఃసంకల్పాలుండి ఉంటాయి. నేను అన్నం ముట్టను" అన్నాడు. అతని బాధకు ఆశ్రమంలోని అగ్నులు కూడా చలించిపోయాయి. ఆ తరువాత తమలో తాము "ఈ బ్రహ్మచారి అనేక సంవత్సరాలుగా దీక్ష నవలంభిస్తున్నాడు. తపస్సు ఆచరిస్తున్నాడు. మనలను ఆరాధిస్తున్నాడు. శాస్త్రోక్తంగా తృప్తి పరుస్తున్నాడు. గురువుగారు అతడికి ఉపదేశం చెయ్యటం లేదు. పదండి మనమే ఉపదేశం చేద్దాం" ఇలా అనుకుని ఉపకోశలుని దగ్గరకు బయలుదేరాయి. ఉపకోశలుడి ఒక సందేశమిచ్చాయి. "ఉపకోశలా! ప్రాణమే బ్రహ్మ. ఆకాశమే బ్రహ్మ. ఆనందమే బ్రహ్మ. అది విన్న ఉపకోశలుడు "నాకు గతంలో ప్రాణము బ్రహ్మ అని తెలుసు కాని ఆనందము, ఆకాశము బ్రహ్మ మయమని తెలియదు" అన్నాడు. అప్పుడు అగ్నులు హృదయాకాశాన్ని గురించి వివరిస్తూ

హృదయమందే బ్రహ్మతత్త్వముంటుంది. ఆనందం ఆ తత్త్వముయొక్క నిజస్వరూపము" అన్నాయి. అప్పుడు వాటిలో ఒక అగ్ని "భూమి సూర్యుడు, చంద్రుడు ఆ పరబ్రహ్మ యొక్క రూపాంతరాలే. సూర్యునిలో ఉన్న బ్రహ్మతత్త్వం, నాలో ఉన్న బ్రహ్మతత్త్వం ఒక్కటే. తూర్పు, పడమర, ఉత్తర దక్షిణాలు, నక్షత్రాలు, నీరు, నింగిలలో ఉన్న తత్త్వము, నాలో ఉన్న తత్త్వము ఒక్కటే. ఆకాశంలోని మెరుపులో ఏ తత్త్వమైతే ఉన్నదో అదే నాలోనూ ఉన్నది. చరాచర జగత్తు అంతా వ్యాపించింది. ఆ తత్త్వమే బ్రహ్మతత్త్వము. ఈ తత్త్వాన్ని అర్థం చేసుకుని బాధలను దూరం చేసుకో" అన్నది. అంటే పరమాత్మ ప్రాణస్వరూపుడు, సుఖస్వరూపుడు, ఆకాశరూపుడు. కాబట్టి బ్రహ్మ నేత్రరూపుడా? కాదా? అనే ప్రశ్న కూడా అవసరం లేదు. అక్షియందున్న పురుషుడు పరమాత్మే. అదే పరాశక్తి. ఇతణ్ణి తెలుసుకున్నవాడికి పాపకర్మ ఉండదు.

ఈ విషయమంతా 44-48 సూత్రాలలో వివరించబడింది.

22. వైశ్వానరుడు బ్రహ్మమే

ఛాందోగ్యోపనిషత్తులో ఒక కథ ఉంది.

పూర్వకాలంలో ఉపమన్యుని కుమారుడు - ప్రాచీనశీలుడు, పులుషుని కుమారుడు సత్యయజ్ఞుడు, భల్లవుని కుమారుడు ఇంద్రద్యుమ్నుడు, శర్కరాక్షుని కుమారుడు జనుడు, అశ్వతరాశ్యుని కుమారుడు బుడిలుడు. వీరైదుగురు మంచి మిత్రులు, సదాచార సంపన్నులు. ఉత్తమ గృహస్థులు, పరమశ్రోత్రీయులు. ఒకరోజున వీరంతా ఒకచోట చేరి 'ఆత్మ అంటే ఏమిటి? బ్రహ్మతత్త్వం అంటే ఏమిటి?' అని చర్చ సాగించారు. ఆ అంశం ఎంతకీ తేలలేదు. ఆ రోజుల్లో అరుణమహర్షి కుమారుడు ఉద్దాలకుడికి ఈ విషయాలు తెలుసునని ప్రతీతి. అందుచేత వీరందరూ అతని వద్దకు వెళ్ళాలని నిశ్చయించుకున్నారు. అనుకున్నదే తడవుగా ఉద్దాలకుడి దగ్గరకు బయలుదేరివెళ్ళి ఆయనకు నమస్కరించి వైశ్వానరాత్మను గూర్చి ఉపదేశం చెయ్యమని వేడుకున్నారు. ఆ విషయం విన్న ఉద్దాలకుడు "వీరంతా వైశ్వానరాత్మను గురించి తెలుసుకోవటానికి నా దగ్గరకు వచ్చారు. కాని వీరి అనుమానాలు తీర్చేశక్తి సామర్థ్యాలు నాకులేవు. వీరి సందేహాలు నేను తీర్చలేకపోయినా, వీరికి వైశ్వానరాత్మను గురించి వివరించగల మంచి గురువును చూపవలసిన బాధ్యత నాకున్నది. అని

ఆలోచించినవాడై వారితో "ఆత్మ స్వరూపులారా! వైశ్వానరాత్మను గురించి క్షుణ్ణంగా తెలిసినవాడు అశ్వపతిమహారాజు. ఆయన కేకయదేశపురాజు. మీతోపాటు నేను కూడా వస్తాను. మనమంతా అతనివద్దకు పోయి సందేహ నివృత్తి చేసుకుందాం" అన్నాడు. వారందరూ కలిసి కేకయదేశం బయలుదేరారు.

అశ్వపతి మహారాజు వీరందరినీ సాదరంగా ఆహ్వానించి అందరినీ సత్కరించాడు. మరునాడు ఉదయం వారిని పిలిచి "బ్రాహ్మణులారా! నా రాజ్యంలో దొంగలులేరు. ధనముండి దానధర్మాలు చెయ్యనివారు లేరు. మద్యం త్రాగి అల్లరి చేసే త్రాగుబోతులూ లేరు. అగ్నిహోత్ర విధులు నిర్వహించని బ్రహ్మచారులుగాని, గృహస్థులుగాని లేనేలేరు. అందరూ విద్వాంసులే. రాజ్యమంతా ఎన్నిసార్లు వెదకినా విద్వాంసుడు కానివాడంటూ దొరకడు. ఇప్పుడు నేను యజ్ఞం నిర్వహిస్తున్నాను. అందులో ఋత్విక్కులకిచ్చే దక్షిణలే మీక్కూడా ఇస్తాను. ఇక్కడే ఉండి మీరుకూడా యజ్ఞంలో పాల్గొనండి" అన్నాడు.

ఆ మాటలకు బ్రాహ్మణులు రాజు చెప్పిన దానికి ఒప్పుకుని "రాజా! వైశ్వానరాత్మను గురించి తెలుసుకోవటానికి నీ దగ్గరకు వచ్చాము. అది తెలుసుకోకుండా ఇక్కడ నుంచి వెళ్ళము" అన్నారు.

ఆ మాటలకు అశ్వపతి మహారాజు సంతోషించాడు. వారి ఆధ్యాత్మిక జిజ్ఞాసను కొనియాడాడు. తరువాత రేపుఉదయాన్నే ఈ విషయం గురించి చర్చిద్దాం విశ్రాంతి తీసుకోండి" అన్నాడు.

మరునాడు తెల్లవారకుండానే వారు పనులు ముగించుకుని, చేత సమిధలు పట్టుకుని వినయంగా రాజు వద్దకు వెళ్ళారు. అప్పుడు రాజు ఔపమన్యుని కుమారుడైన ప్రాచీనశీలుణ్ణి పిలిచి "నీవు వైశ్వానరాత్మను ఏ విధంగా ఉపాసన చేస్తున్నావు?" అన్నాడు.

"రాజా! నేను ద్యులోకాన్ని వైశ్వానరాత్మగా భావించి ఉపాసన చేస్తున్నాను" అన్నాడు ప్రాచీనశీలుడు. దానికి అశ్వపతి మహారాజు" నువు ఉపాసించేది "సుతేజ" అనే పేరుతో ప్రసిద్ధి చెందిన వైశ్వానరాత్మ. ఈ ఉపాసన వల్ల నీ కులంవారు తరతరాలుగా కర్మ నిష్టపరతంత్రులౌతారు. సుతేజమనే ఈ ఆత్మ వైశ్వానరాత్మలో

నాల్గవ భాగం మాత్రమే. అది వైశ్వానరాత్మకు శిరోభాగమువంటిది. నువు ఈ కొంచెం భాగాన్నే మొత్తము అనుకొని ఉపాసన చేస్తే నీ తలతెగి క్రింద పండిపోతుంది. నువు ఇక్కడికి వచ్చి ఈ విషయం తెలుసుకోవటం మంచిదయింది" అన్నాడు. తరువాత రాజు అదే ప్రశ్న సత్యయజ్ఞుని అడిగాడు.

నేను వైశ్వానరాత్మను ఆదిత్యరూపంలో ఉపాసిస్తాను అన్నాడు సత్యయజ్ఞుడు. ఆ మాటలు విన్న రాజు "సత్యయజ్ఞా! నువు ఉపాసించేది నిజంగా వైశ్వనరాత్మే. ఈ ఉపాసనవల్ల నీ వంశంలో చాలామందికి విశ్వరూప సాధన తేలిక అవుతుంది. నువు ఉపాసించే ఆదిత్యుడు వైశ్వానరాత్మకు నేత్రం. వైశ్వానరాత్మలో ఇది నాల్గవ వంతు మాత్రమే. ఈ విషయం తెలియకుండా ఉపాసన చేసే సాధకుడు అంధుడవుతాడు అన్నాడు. ఆ తరువాత మహారాజు జనుణ్ణి కూడా ప్రశ్న అడిగాడు. దానికి జనుడు నేను ఆకాశాన్ని వైశ్వానరాత్మగా ఉపాసిస్తాను అన్నాడు.

ఆ మాటలు విన్న మహారాజు "నువు ఉపాసించే ఆకాశము వైశ్వానరాత్మ యొక్క మధ్య భాగము. దీన్ని ఉపాసించటంవల్ల నీ వశంలోనివారు అంతులేని ధనాన్ని పొందుతారు. ప్రియమైన వస్తుదర్శనం చేసుకుంటారు. కాని ఇది వైశ్వానరాత్మలో ఒక భాగమని తెలియకుండా గనక ఉపాసనచేస్తే సాధకుని మధ్యభాగం నాశనమై పోతుంది" అన్నాడు.

ఆ తరువాత బుడిలుడిని అదే ప్రశ్న అడిగాడు. దానికి బుడిలుడు "రాజా! నేను జలాన్ని వైశ్వానరాత్మగా భావిస్తున్నాను" అన్నాడు. ఆ మాటలు విన్నరాజు "నువ్వు ఉపాసించేది ధనసంజ్ఞగల వైశ్వానరాత్మ. దీన్ని ఉపాసించినవారు ధనవంతులవుతారు. బ్రహ్మతేజస్సు పొందుతారు. కాని ఇదే వైశ్వానరాత్మ పూర్తిరూపమని ఉపాసనచేస్తే సాధకుని మూత్రకోశం బ్రద్దలైపోతుంది" అన్నాడు.

తరువాత గౌతముణ్ణి "నువ్వు ఏ ఆత్మను ఉపాసన చేస్తావు?" అని అడిగాడు. దానికి గౌతముడు "రాజా! నేను పృథివిని వైశ్వానరాత్మగా ఉపాసిస్తాను" అన్నాడు. ఆ మాటలు విన్నరాజు ఈ విధంగా అన్నాడు. "కుమారా! నీవుపాసించే భూమి వైశ్వానరాత్మకు పాదాలు. అంతేకాని అదే పూర్ణరూపం కాదు. దీని ఉపాసనవల్ల సంతానము, పశుసంపద కలుగుతాయి. కాని ఇదే పరిపూర్ణమని ఉపాసన చేసినవాడి పాదాలు శిథిలమై పోతాయి"

ఓ బ్రాహ్మణ కుమారులారా! సంపూర్ణ వైశ్వానరాత్మను నేనే అని భావించేవాడు వైశ్వానరావేత్త అయి అన్నీ భక్షణ చేస్తాడు. అంటే సమస్త లోకాల్లోనూ, ప్రాణాల్లోనూ, ఆత్మల్లోనూ తానే ఉండి అన్నీ భక్షణ చేస్తాడు.

ఆ వైశ్వానరునికి శిరస్సు	–	ద్యులోకం;
		నేత్రాలు ఆదిత్యుడు;
ప్రాణం	–	వాయువు;
శరీరమధ్యభాగం	–	ఆకాశం;
మూత్రకోశం	–	జలం.
పాదాలు	–	పృథివి,
వక్షస్థలమే	–	వేదిక;
రోమాలు	–	దర్భలు,
హృదయం	–	గార్హపత్యాగ్ని
మనస్సు	–	దక్షిణాగ్ని
నోరు	–	ఆహవనీయాగ్ని.

ఈ సిద్ధాంతం ప్రకారం వైశ్వానరోపాసకుడు భోజన సమయంలో ముందుగా వడ్డించిన అన్నాన్ని హవనం చెయ్యాలి. ప్రాణాహుతులివ్వాలి. మొదటి ఆహుతి ప్రాణాయ స్వాహా అంటే ప్రాణం తృప్తి పొందుతుంది. దీనివల్ల నేత్రము, ఆదిత్యుడు, ద్యులోకము, దేవతలు తృప్తి పొందుతారు. అందువల్ల భోక్త సంతానము, పశువులు, తేజస్సు, బ్రహ్మవర్చస్సు పొందుతాడు.

రెండవ ప్రాణాహుతి 'వ్యానాయ స్వాహ' దీనివల్ల వ్యానవాయువు తృప్తి పొందుతుంది. దీనివల్ల శ్రోత్రము, చంద్రుడు, దిక్కులు, దిక్కులకు అధిష్ఠాన దేవతలు తృప్తి పొందుతారు. అందువల్ల భోక్త సంతానము, పశువులు, శరీర తేజస్సు, బ్రహ్మవర్చస్సు పొందుతాడు.

మూడవ ఆహుతి 'అపానాయ స్వాహా!' దీనివల్ల అపానవాయువు తృప్తి పొందుతుంది. దీనివల్ల అగ్ని, పృథివి, పృథివికి అధిష్ఠాన దేవతలు తృప్తి పొందుతారు. భోక్తకు సంతానము, పశువులు, తేజస్సు, బ్రహ్మవర్చస్సు లభిస్తాయి.

నాల్గవ ఆహుతి 'సమానాయ స్వాహ' దీనివల్ల సమానవాయువు తృప్తి పొందుతుంది. దానివల్ల మనస్సు, పర్జన్యుడు, విద్యుత్తు, వీరి అధిష్ఠాన దేవతలు తృప్తి చెందుతారు. భోక్తకు ఇందాకటి ఫలమే వస్తుంది.

ఐదవ ఆహుతి 'ఉదానాయస్వాహా' దీనివల్ల ఉదాన వాయువు తృప్తి చెందుతుంది. దాని వలన చర్మము, వాయువు, ఆకాశము, వాటి అధిష్ఠాన దేవతలు తృప్తి చెందుతారు. భోక్తకు ఇందాకటి ఫలమే వస్తుంది.

ఈ రకంగా మూడు లోకాలు శరీరమే అనటంచేత అతడు పరమాత్మ తప్ప వేరు కాదు. స్మృతులలో చెప్పిన రూపం కూడా దీనికి ప్రమాణంగానే ఉంది. పురాణాలలో పరమేశ్వరుణ్ణి వర్ణిస్తూ ఎవరికైతే

అగ్ని – ముఖము, ద్యులోకము – శిరస్సు, ఆకాశం – నాభి, భూమి – పాదాలు, సూర్యుడు – కనులు, దిక్కులు – శ్రోత్రములు అయినాయో, అటువంటి పరమాత్మకు నమస్కారము. ఇక్కడ చెప్పిన వైశ్వానరుడు, పురాణాలలోని పరమేశ్వరుడు ఇద్దరూ ఒకటే. వైశ్వానర శబ్దం అగ్నికి సంబంధించినది కాదు పరమాత్మకు సంబంధించినది. వైశ్వానరుడు అంటే విశ్వావికేనరుడు. విశ్వంలోని జీవులన్నింటికీ ప్రతిరూపం. సమస్త జీవులు అతనికి సంబంధించినవే. వాజసనేయ బ్రాహ్మణంలో సత్యలోకం మొదలు భూమి వరకు వైశ్వానరుని శిరస్సు నుంచి గడ్డం వరకు ఉన్న అవయవాలు.

మాండూక్యోపనిషత్తులో "కనుపించే జగత్తంతా పరబ్రహ్మ స్వరూపమే. పైకి కనుపించే విశ్వము మాత్రమే బ్రహ్మముకాదు. కనుపించకుండా లోపల ఉండే ఆత్మకూడా బ్రహ్మమే. కంటికి కనుపించేది, కనుపించనిది అంతా బ్రహ్మమే. బ్రహ్మానికి నాలుగు పాదాలున్నాయి. అందులో మొదటిపాదం వైశ్వానరుడు. అంటే విశ్వంలోని నరులందరిలోను సమానంగా ఉండేవాడు. అందరికీ ప్రతినిధి. విశ్వము యొక్క వ్యష్టిరూపం వైశ్వానరుడు, సమిష్టిరూపం విరాడ్రూపం" అని చెప్పబడింది. కాబట్టి వైశ్వానరుడు అంటే పరమాత్మే. బ్రహ్మమే.

ఈ విషయమంతా 55–63 వరకు సూత్రాలలో వివరించారు.

23. భూమము బ్రహ్మమే

ఒకసారి నారదమహర్షి సనత్కుమారుని వద్దకు వెళ్ళి తనకు ఆత్మానుభూతిని కలుగజేయమని కోరాడు. దానికి సనత్కుమారుడు. 'గతంలో ఏ ఏ విద్యలు అభ్యసించావు?' అన్నాడు.

"స్వామీ ! వేదవేదాంగాలు చదివాను. ఎన్నోకళలు నేర్చుకున్నాను. శాస్త్రాలు అభ్యసించాను. సంగీత సాధన చేశాను. కాని నాకు మనశ్శాంతి లభించలేదు. ఆత్మజ్ఞానం కలుగలేదు. ఆత్మజ్ఞానంవల్ల దుఃఖాలు నశిస్తాయని విన్నాను. కాబట్టి ఆత్మజ్ఞానాన్ని ఉపదేశించి నాకు దుఃఖ విమోచనం కలుగచేయండి" అన్నాడు నారదుడు.

అప్పుడు సనత్కుమారుడు "నారదా! నువ్వు ఇంతవరకు అభ్యసించినది కష్ట సాధ్యమైన 'పరావిద్య' కాదు. నీకు ఎన్నో సిద్ధాంతాలు తెలుసు. కాని వాటి ఆచరణ లేదు. వాటి ఆంతర్యం నీకు తెలియదు. నీకు తెలిసినదంతా 'అపరావిద్య' అదంతా పదాల గారడి. కాబట్టి వాటన్నిటినీ వదలిపెట్టి విశ్వమంతా వ్యాపించి ఉన్న ఆత్మతత్త్వాన్ని తెలుసుకో. అదే పరావిద్య. అది సాధించాలంటే మానసిక పవిత్రత కావాలి. **మనస్సు మలినరహితమైతేనే ఆత్మానుభవం కలుగుతుంది. అంతఃకరణ నిర్మలమవుతుంది. అప్పుడు సత్యదర్శనమవుతుంది.** సత్యం అప్పుడు బాలభానునివలె పసిడికాంతులతో హృదయాంతరాళాల్లో ప్రకాశిస్తుంది. అదే పరావిద్య. దానివల్లనే శాశ్వతమైన ఆనందం లభిస్తుంది.

నారదా ! నువ్వు తెలుసుకున్నదంతా పదాలు మాత్రమే. అది పారిభాషిక పరిజ్ఞానము. ఆ పదజాలం ఏం సాధించగలదో అదే నీకు లభిస్తుంది. అంతకన్నా నీకేమీ దొరకదు.

ఇంతవరకు నీవు తెలుసుకున్నది నామమాత్రమైనది. నువ్వు చదివిన వేదశాస్త్రాలన్నిటికీ పేరు ఉన్నది. ఋగ్వేదము అనేది ఒక పేరు. అలాగే మిగిలిన వేదాలు, పురాణాలు అన్నీ పేర్లే. వ్యాకరణం, తర్కం, జ్యోతిషం, నీతిశాస్త్రం, ధనుర్వేదం, సర్పశాస్త్రం, సంగీతం. ఇవన్నీ పేర్లే కాబట్టి ఒక ప్రతిమలో విష్ణురూపాన్ని భావించి ఉపాసించినట్లు వీటి నామాలన్నీ పరబ్రహ్మ స్వరూపమనే బుద్ధితో ఉపాసించు.

నామాన్ని పరమాత్మగా ఉపాసించేవాడు నామం వ్యాపించి ఉన్నంత మేర స్వేచ్ఛగా సంచరించగలుగుతాడు. అంటే ఆ ఉపాసకుడు విశ్వమంతా సంచరించగలుగుతాడు" అన్నాడు.

అది విన్న నారదుడు "నామం కన్నా గొప్పది ఏది?" అని ప్రశ్నించాడు. నామం కన్నా గొప్పది వాక్కు. వాక్శక్తి కనక లేకపోతే పదాలు లేవు. వేదాలు లేవు. వేదాలలో చెప్పబడిన సత్యాసత్యాలు లేవు. శుభాశుభములు లేవు. వాక్కే బ్రహ్మగా ఉపాసించేవాడు వాక్కు వ్యాపించి ఉన్నంతమేర అంటే శబ్దం, స్వరం వ్యాపించి ఉన్నంత మేర స్వేచ్ఛగా సంచరించగలుగుతాడు.

అది విన్న నారదుడు "దేవా! వాక్కు కన్న శ్రేష్ఠమైనదేమైనా ఉన్నదా?" అన్నాడు.

"ఉన్నది మహర్షి ! వాక్శక్తి కన్న గొప్పది మనస్సు. ఒక మనిషి వేదాలు నేర్చుకుంటాడు. మనస్సులోంచి వచ్చిన ఆలోచన మూలంగా వేదమంత్రాలను సంతగా చెప్పుకుంటాడు. ఆలోచనే రాకపోతే ఆ పని చెయ్యడు. ఏ పని చెయ్యాలన్నా ఆలోచన రావాలి. అందుచేతనే ఆలోచన చేసే మనస్సు వాక్కు కన్న గొప్పది. మనస్సు బ్రహ్మ అని ఉపాసన చేసేవాడు మనస్సు పొందగలిగినంత మేర స్వేచ్ఛగా విహరించగలుగుతాడు" అన్నాడు సనత్కుమారుడు.

అది విన్న నారదుడు "స్వామీ ! మనస్సుకన్న శ్రేష్టమైనది ఏది?" అన్నాడు.

"ఆలోచించే మనస్సుకన్న గొప్పది సంకల్పం. అసలు సంకల్పమనేది కలగకపోతే జరిగేది ఏమీలేదు. సంకల్పమంటూ చేస్తే, దాన్ని క్రియ అనుసరిస్తుంది. ఈ సంకల్పమే సమస్త క్రియాకలాకల్పాన్ని కట్టిపెట్టి ఉంచుతుంది. మనస్సు, వాక్కు, నామం, మంత్రం, కర్మ మొదలైనవన్నీ సంకల్పంలోనే లయమవుతాయి. కాబట్టి సంకల్పమే బ్రహ్మ అని ఉపాసన చేసేవాడు భగవంతుడిచేత సంకల్పించబడిన లోకాలన్నీ పొందుతాడు. అన్నాడు సనత్కుమారుడు.

'అలాగయితే సంకల్పం కన్న గొప్పది ఏదైనా ఉన్నదా?" అన్నాడు నారదుడు.

"సంకల్పం కన్న గొప్పది చిత్తం. చిత్తం వలన అన్ని పనులను గురించిన ఆలోచన ప్రవర్తిల్లుతుంది. చిత్తంవల్లనే సంకల్పం కలుగుతుంది. ఇది ఆలోచనా ప్రేరకమైన చిత్తప్రక్రియను అనుసరిస్తుంది. వాక్కు వస్తుంది. పదాలు ఆకారం

దాలుస్తాయి. ఒక మనిషి యొక్క చిత్తం. ఛిన్నాభిన్నమైపోతే. అతనికి స్పృహ తప్పుతుంది. అప్పుడు ఏ పనీ చెయ్యలేడు. ఈ చిత్తమే బ్రహ్మ అని ఉపాసన చేసేవాడు శోకహీనుడై శోకరహితమైన లోకాలు పొందుతాడు." అన్నాడు సనత్కుమారుడు.

"స్వామీ! చిత్తం కన్న శ్రేష్ఠమైనది ఏమైనా ఉన్నదా?" అన్నాడు నారదుడు.

"ధ్యానం అనేది చిత్తం కన్నా గొప్పది. ధ్యానంతో చిత్తానికి స్థాయి, స్థిరత్వము ఏర్పడతాయి. ఈ భూమి, ఆకాశం, పర్వతాలు అన్నీ ధ్యాన నిష్ఠలో ఉన్నట్లు. క్రమం తప్పకుండా, స్థిరత్వం కోల్పోకుండా నిలిచి ఉన్నాయి. ఆ ధ్యానస్థితే లేకపోతే ఏదీ స్థిరంగా నిలబడలేదు. ధ్యానమే బ్రహ్మ అనే భావనతో ఉపాసన చేసేవాడు ధ్యానానికి ఎంతవరకు వ్యాప్తి ఉంటుందో అంతవరకు స్వేచ్ఛగా సంచరిస్తాడు" అన్నాడు సనత్కుమారుడు.

"దేవా ! ధ్యానాన్ని మించినది ఇంకా ఏదైనా ఉన్నదా?" అన్నాడు నారదుడు.

"ధ్యానంకన్న గొప్పది విజ్ఞానం, శుభాశుభాలు, సత్యాసత్యాలు, పురాణాలు, ఇహపరాలు, అన్నీ విజ్ఞానంవల్లనే గ్రహింపుకు వస్తాయి. విజ్ఞానమే బ్రహ్మ అని ఉపాసించేవాడు జ్ఞానంతో కూడిన లోకాలు పొందుతాడు" అన్నాడు సనత్కుమారుడు.

నారదుడు "స్వామీ ! ఇంతకన్న శ్రేష్ఠమైనదేమయినా ఉందా." అన్నాడు.

"ఉన్నది. విజ్ఞానం కన్న మించినది బలం. ఒక బలవంతుడు తన విజ్ఞాన విశేషాలతో వందమందిలోనైనా భయాన్ని రేకెత్తించగలడు. ఒక బలవంతుడు విద్యావంతుడైనప్పుడు, మేధావిగా, ఋషిగా, కర్మిష్ఠిగా మారినప్పుడు అందరిలోకీ అతనిదే పై చేయి అవుతుంది. మర్త్యలోకంలోగాని, స్వర్గలోకంలోగాని వాటిని సాధించి పెట్టేది భౌతికబలం. భూమ్యాకాశాలను, పర్వతాలను, పశుపక్ష్యాదులను, దేవసమూహాలనూ, అందరినీ నిలబెట్టగలిగేది భౌతికశక్తే కాబట్టి బలమే బ్రహ్మ అని తెలుసుకుని ఉపాసన చేసేవాడు బలానికి వ్యాప్తి ఉన్నంత మేర స్వేచ్ఛగా విహరిస్తాడు' అన్నాడు సనత్కుమారుడు.

"దేవా! ఇంతకంటె శ్రేష్ఠమైనదేదైనా ఉన్నదా?" అన్నాడు నారదుడు.

"శారీరకబలం కన్న మించినది అన్నం. మనిషి కొన్ని రోజులపాటు అన్నం తినకుండా మాడితే చచ్చిపోతాడు. కొంతకాలం బ్రతికినా నీరసంతో మాట

పడిపోతుంది. నడవలేడు. చూడలేడు. ఏ పనీ చెయ్యలేడు. వినే శక్తి కూడా పోతుంది. ఆలోచనా శక్తి హరించుకుపోతుంది. ఆహారం తీసుకోవటం ప్రారంభిస్తే తిరిగి అన్ని శక్తులూ పొందుతాడు. మునుపటిలాగా పని చేయగలుగుతాడు." అన్నమే బ్రహ్మ అని ఉపాసన చేసినవాడు అన్నం ఉన్నంత మేర స్వేచ్ఛగా సంచరించ గలుగుతాడు. అన్నాడు సనత్కుమారుడు.

"స్వామీ ! అన్నంకంటె శ్రేష్ఠమైనదేమైనా ఉన్నదా?' అన్నాడు నారదుడు.

"నారదా ! మేఘాలు వర్షించకపోతే పంటలు పండవు. ఆహారం దొరకదు. నీరు లేకపోతే అన్ని జీవరాశులు మొగంవాచి చావుకు సిద్ధమవుతాయి. తొలకరిలో వర్షాలు కురవటం ప్రారంభం కావటంతో జీవులన్నీ ఆనందంతో చిందులు వేస్తాయి. జలమే బ్రహ్మ అని ఉపాసన చేసేవాడు తాను కోరిన వస్తువులన్నీ పొంది తృప్తి చెందుతాడు. జలం ఉన్నంతమేర స్వేచ్ఛగా తిరుగుతాడు" అన్నాడు. సనత్కుమారుడు.

"స్వామీ ! జలంకన్న శ్రేష్ఠమైనదేది?" అన్నాడు నారదుడు.

"జలం కన్న శ్రేష్ఠమైనది తేజస్సు. ఆ తేజస్సే లేకపోతే భూమిమీద నదులలోను, సముద్రాలలోను నీరు ఆవిరి అవదు. నీరు ఆవిరి కాకపోతే మేఘాలు వర్షించవు. కాబట్టి తేజస్సే బ్రహ్మ అని ఉపాసించేవాడు తాను తేజస్వియై, తేజోసంపన్నమైన లోకాలు పొందుతాడు. అన్నాడు సనత్కుమారుడు.

"స్వామీ ! తేజస్సుకన్న గొప్పది ఏది?" అని అడిగాడు నారదుడు.

"తేజస్సుకన్న గొప్పది ఆకాశం. ఆకాశం అంటూ ఉంది కాబట్టే అన్ని వస్తువులూ అందులో ఇముడుతున్నాయి. సూర్యుడు, చంద్రుడు, భూమి గ్రహగోళాలు, నక్షత్రాలు మొదలైన తేజోమండలమంతా ఆకాశంలోనే చోటు చేసుకుని ఉన్నాయి. ఆకాశం శబ్ద తరంగాలకాధారం శబ్దాన్ని మన చెవులు గ్రహించటానికి కారణం ఆకాశం. కాబట్టి ఆకాశమే బ్రహ్మగా ఉపాసించేవాడు విశాలమైన, దుఃఖము లేని, ప్రకాశవంతమైన లోకాలు పొందుతాడు. ఆకాశం వ్యాపించినంతమేర స్వేచ్ఛగా మనగలుగుతాడు." అన్నాడు సనత్కుమారుడు.

"ఇంతకన్న శ్రేష్ఠమైనది ఏమైనా ఉన్నదా?" అన్నాడు నారదుడు.

"అంతఃకరణ యొక్క ధర్మమైన స్మరణ ఇంతకన్న శ్రేష్ఠమైనది ఈ స్మరణయే జ్ఞాపకశక్తి. ఇది లేకపోతే మానవుడు వినవలసిన దానిని వినలేడు. మాట్లాడవలసిన దానిని మాట్లాడలేదు. ఆలోచించనూలేడు. స్మరణయే బ్రహ్మ అని భావించి ఉపాసన చేసేవాడు స్మరణశక్తి వెళ్ళగలిగినంత మేర స్వేచ్ఛగా సంచరించగలుగుతాడు" అన్నాడు సనత్కుమారుడు.

"ఇంతకన్న గొప్పది?" అన్నాడు నారదుడు.

"ఆశ ! ఆశతో స్మరణశక్తి ఎక్కువ అవుతుంది. మానవుడు ఆశతోనే వేదమంత్రాలు చదువుతాడు. ఫలితాన్ని పొందుతాడు. ఆ ఫలితమే పుత్రులు, పశువులు, ధనము మొదలైనవి. ఆశనే బ్రహ్మగా ఉపాసించేవారి కోరికలన్నీ నెరవేరతాయి. అతని ప్రార్థనలు వ్యర్థం కావు" అన్నాడు సనత్కుమారుడు.

"అంతకన్న శ్రేష్ఠమైనదేది?" అన్నాడు నారదుడు.

"ఆశకన్న శ్రేష్ఠమైనది ప్రాణం. బండి చక్రంలోని కుండలో ఆకులన్నీ ఉన్నట్లుగా, సమస్త ప్రపంచమూ శరీరంలోని ముఖ్యప్రాణంలో అమరి ఉన్నది. ఈ ముఖ్యప్రాణమే జీవాత్మ. ఈ ప్రాణమే తనశక్తి అయిన ప్రాణంద్వారా నడుస్తోంది. అంటే ప్రాణమే ప్రాణానికి ప్రాణం ఇస్తోంది. ఇచ్చేది, ఇవ్వబడేది కూడా ప్రాణమే కాబట్టి ఈ ప్రాణమే తల్లి, తండ్రి, గురువు. వీరందరిలో ఉన్నది ప్రాణమే. ప్రాణం పోయిన తరువాత వారిక ఆ పేర్లతో పిలువబడరు. చరాచర జగత్తు అంతా ప్రాణమయమే" అన్నాడు. సనత్కుమారుడు.

"ప్రాణం కన్న శ్రేష్ఠమైనదేది?" అన్నాడు నారదుడు.

"ప్రాణంకన్న శ్రేష్ఠమైనది ఆత్మవిజ్ఞానం. ఆత్మయే సర్వానికి అధిష్ఠానమని గుర్తించు. మానవుడు అనేకమైన పనులు తలబెడతాడు. వాటివల్ల అతడికి ఆనందం లభిస్తుందనే భావిస్తాడు. ఆనందం దొరకదు అనుకుంటే మనిషి ఏ పనీ చెయ్యడు. ఈ ఆనందం అనేది కలిమిలో ఉంది కాని లేమిలో లేదు. ఉనికిలో ఉంది కాని శూన్యంలో లేదు. వాంఛలో ఆనందం లేదు. వాంఛాపూర్తిలో ఆనందం ఉంది. జగత్తులోని ఏ వస్తువూ అపరిమితానందం ఇవ్వలేదు. అపరిమిత ఆత్మానందమే

పరిపూర్ణానందాన్ని ప్రసాదిస్తుంది. అపరిమితానందము ఒక్కతురీయావస్థ ద్వారానే సాధ్యము. అది ఇంద్రియాల పరిధికి దాటిన స్థితి. ఆత్మకు భిన్నంగా ఉన్నదాన్ని చూడటం, వినటం, తెలుసుకోవటం ప్రారంభించాలని ప్రయత్నించటమే దుఃఖానికి నాంది. ఆత్మ స్వతఃప్రజ్ఞవల్లే నిలబడి ఉంటుంది. తత్త్వవేత్త అయినవాడు మృత్యువును చూడడు. రోగాన్ని కూడా చూడడు. అతడికి జరామృత్యువులు లేవు. విద్వాంసుడు అంటే జ్ఞానియైనవాడు అన్నిటినీ ఆత్మభావంతో చూస్తాడు. అందుకనే అతడు అన్నింటినీ పొందుతాడు. ఆత్మజ్ఞానం పొందటంలో ఉన్న ఆనందం ఇల్లుకట్టినా, పాడిపంటలు సమృద్ధిగా ఉన్నా, ధన ధాన్యాదులు సంపాదించినా రాదు.

ఆత్మ సర్వవ్యాపకమైనది. ఊర్ధ్వలోకాలలో, అథోలోకాలలో కూడా అది వ్యాపించి ఉంది. ఆత్మానందం అనిర్వచనీయం. ఆత్మజ్ఞాని తనకు తానే ప్రభువు. తనను నియంత్రించే శక్తి తానే.

ఆత్మానుభూతి పొందాలంటే మనస్సు పరిశుభ్రం కావాలి. పవిత్రమూ, పరిశుభ్రమూ అయిన ఆహారం తీసుకున్నప్పుడే మనస్సు పరిశుభ్రమవుతుంది. పరిశుభ్రమైన మనస్సుతో ప్రకాశించే వ్యక్తికే ఆత్మసాక్షాత్కారం కలుగుతుంది. అతడే జీవన్ముక్తుడు" అని సనత్కుమారుడు నారదునికి భూమావిద్యను ఉపదేశించాడు. కాబట్టి ఆత్మయే సర్వానికి అధిష్ఠానము. భూమము అంటే బ్రహ్మమేకాని ప్రాణం కాదు. ఈ విషయం 71, 72 సూత్రాలలో వివరించారు.

24. దర్శనీయుడు పరమాత్మ

ప్రశ్నోపనిషత్తులోసత్యకాముడు పిప్పలాద మహర్షికి నమస్కరించి ఈ విధంగా అడుగుతున్నాడు. "మహర్షీ ! మానవులలో ఎవరైనా చివరిదాకా అంటే చనిపోయే వరకూ ఓంకార ధ్యానము చేస్తే ఏ లోకానికి పోతాడో నాకు వివరించండి" "అది విన్న పిప్పలాదుడు సమాధానం చెప్పటం మొదలుపెట్టాడు.

"సత్యకామా! ఓంకారమనేది పరబ్రహ్మము. అపరబ్రహ్మము కూడా. పరబ్రహ్మము అంటే సర్వాతీత నిర్గుణబ్రహ్మము. అపరబ్రహ్మము అంటే సాకారము. వ్యక్తరూపం గల హిరణ్యగర్భుడు. అందుచేత పండితులు జ్ఞానులు ఓంకారాన్నే ఉపాసిస్తారు.

ఇదే నాదబ్రహ్మము. దీన్నే ప్రణవము అంటారు. దీన్నుంచే సమస్త శబ్దాలు, మంత్రాలు ఉత్పన్నమైనాయి. అందుకనే ఓంకారము సర్వమంత్రాలకూ హేతువు.

సగుణ బ్రహ్మాన్ని ఓంకారంతో ఉపాసన చేయవచ్చు. అవ్యక్తమైన పరబ్రహ్మాని శబ్దంతో సూచించటానికి ఓంకారమే గుర్తు. ఓంకారంలో అకార ఉకార మకారాలనే మూడు అక్షరాలున్నాయి. ఓంకారమనేది మూడు వేదాలకు ప్రతీక. ఇందులో

అ కారము	–	ఋగ్వేదము
ఉ కారము	–	యజుర్వేదము
మ కారము	–	సామవేదము

దీనిలో ఒక అక్షరాన్ని మాత్రమే ధ్యానించినట్లైతే సాధకుడు మరణాంతరము స్వర్గసుఖాలనుభవించి తరువాత భూలోకంలో మళ్ళీ జన్మిస్తాడు. ఒకవేళ రెండు అక్షరాలు కలిపి ధ్యానించినట్లైతే సాధకుడు సూక్ష్మశరీరంతో చంద్రలోకానికి పోయి అక్కడ సుఖాలను అనుభవించి తిరిగి మానవలోకంలో జన్మిస్తాడు. మూడు అక్షరాల రూపమైన ఓంకారాన్ని కనుక ధ్యానిస్తే సాధకుడు తేజోవంతమైన సూర్యలోకానికి పోతాడు. పాము కుబుసాన్ని వదిలినట్లుగా తన శరీరానికి అంటుకున్న పాపాలు వదిలించుకుంటాడు. ఆ తరువాత సామవేద భావంచేత బ్రహ్మాలోకానికి పోతాడు. కల్పాంతమువరకు అక్కడ ఉండి ఆ తరువాత పరబ్రహ్మాలో లీనమవుతాడు. దీనినే క్రమముక్తి అంటారు.

ఓంకారము యొక్క మూడు మాత్రలను విడివిడిగా ధ్యానించేవాడు మృత్యుంజయుడు కాలేడు. మూడు మాత్రలను కలిపి ధ్యానించే వాడు అచంచలమైన ఆత్మనిష్ఠను పొందుతాడు. ఆత్మానుభూతి నుండి చలించడు.

ఓంకారోపాసకుడు ఋగ్దేవతలచే భూలోకము, యజుర్వేద దేవతలచే చంద్రలోకము, సామదేవతలచే విద్వాంసులకు మాత్రమే తెలిసిన బ్రహ్మాలోకము పొందుతాడు. ఓంకారం ద్వారానే జ్ఞాని అయినవాడు శాశ్వతమైన బ్రహ్మాలోకాన్ని పొంది, కల్పాంతమున ఆ పరబ్రహ్మాలో లీనమవుతాడు?"

ఈ రకంగా పిప్పలాదుడు ఓంకారాన్ని గురించి వివరించాడు.

కాబట్టి దర్శనీయుడు సూర్యుడు కాదు. సాధకుడు చంద్రలోకం వెళ్ళినట్లే, సూర్యలోకం చేరతాడు. అంతే ఇక్కడ ఉపాసన చేయవలసినది సూర్యుణ్ణి కాదు. అలాగే దర్శనీయుడు కూడా సూర్యుడు కాదు. ఆ పరమాత్మయే.

ఈ విషయం 76వ సూత్రంలో వివరించారు.

25. హృదయాకాశము బ్రహ్మమే

ఛాందోగ్యోపనిషత్తులో గాయత్రిఉపాసన గురించి చెబుతూ పృధ్వీరూపమైన గాయత్రి, శరీరంలో ఉండే పంచభూతాలు, ఇంద్రియాల సమూహమూ ఒకటే. పురుషుని శరీర రూపమైన గాయత్రి, పురుషుని హృదయ కమలంలో ఉండే పురుషుడు ఒకటే. ఆ పురుషునిలోనే అంటే గాయత్రిలోనే ప్రాణాలు ప్రతిష్ఠితమై ఉన్నాయి. ఇంతవరకు గాయత్రి పేరుతో బ్రహ్మను గూర్చి అతని మహిమను గూర్చి వివరించారు. ఇది కార్యబ్రహ్మ విభూతి. ఇక శుద్ధ బ్రహ్మ మహత్వం వివరిస్తున్నారు.

"శుద్ధబ్రహ్మ కార్యబ్రహ్మ కన్న గొప్పది. పాంచ భౌతికమైన ఈ జగత్తంతా శుద్ధబ్రహ్మ యొక్క మొదటి పాదమే. మిగిలిన మూడు పాదాలు ఆ పరబ్రహ్మలోనే ఉన్నాయి. గాయత్రి ద్వారా ప్రతిపాదించబడి, మూడు పాదములు గల అమృత స్వరూపమైన బ్రహ్మ ఇదే. ఆ పురుషునికి లోపలా బయటా కూడా ఉన్న ఆకాశము ఒకటే. అలాగే హృదయంలోపలా బయటా ఉన్న ఆకాశము ఒకటే. అదే ఆత్మ. ఈ రకంగా బ్రహ్మను గురించి తెలుసుకున్నవాడు జీవించి ఉండగానే బ్రహ్మస్వరూపం పొందుతాడు అని చెప్పబడింది. బాహ్యాకాశము ఎంత ఉన్నదో, సూక్ష్మాకాశం, దహరాకాశం కూడా అంత ఉన్నది. ఇందులో స్వర్గము, పృథివి రెండూ ఉంటాయి. ఆత్మపాపరహితుడు. జన్మమృత్యుజరాదులు లేనివాడు. ఆకలి దప్పికలు లేనివాడు. సత్యకాముడు, సత్యసంకల్పుడు. దహరాకాశము, భూతాకాశము రెండూ ఒకటి కాదు. స్వర్గము, పృథివి రెండూ దహరాకాశంలో ఉన్నాయి. కాబట్టి భూమికీ, ఆకాశానికి, స్వర్గానికి కూడా దహరాకాశమే ఆధారము.

గతి అంటే గమనము, బ్రహ్మలోకము. అందుచేత, దహరాకాశము అంటే పరమాత్మే కాని వేరు కాదు. **ఛాందోగ్యోపనిషత్తు**లో ఉద్దాలకుడు తన కుమారుడైన శ్వేతకేతువుకు సుషుప్తిని గురించి వివరిస్తున్నాడు. మానవుడు గాఢనిద్రలో ఉన్నప్పుడు

అతడు సుషుప్తిలో ఉన్నాడు అంటారు. ఆ సమయంలో జీవుడు పరమసత్తను పొందుతాడు. అంటే తన నిజస్వరూపాన్ని పొందుతాడు. తన ఆత్మను తాను పొందుతాడు. కాబట్టి అతనిని గురించి చెప్పేటప్పుడు అతడు నిద్రిస్తున్నాడు అంటారు. సుషుప్త్యావస్థలో మనస్సు, ఇంద్రియాలు పని చెయ్యటం మానివేస్తాయి. అప్పుడు మిగిలేది ఆత్మ మాత్రమే. ఆ ఆత్మ నిజరూపంలో మిగులుతుంది. ప్రతిబింబంలాంటి జీవభావం పోయి మిగిలేది ఆత్మభావం ఒక్కటే. ఇంద్రియాలన్నీ అలసట చెంది ఒక్కొక్కటే మనసులో లీనమై పోతాయి. మనసు ప్రాణంలో లీనమై పోతుంది. అంటే సుషుప్త్యావస్థలో ఒక్క ప్రాణం మాత్రమే మేల్కొని ఉంటుంది. అదే ఇంద్రియాల అలసటను తీరుస్తుంది. సుషుప్తిలో జీవుడు పరమాత్మను పొందుతున్నాడు. కాబట్టి దహరాకాశము అంటే బ్రహ్మమే.

ఈ విషయం 77,78 సూత్రాలలో వివరించబడింది.

26. శూద్రుడికి బ్రహ్మవిద్యాధికారం లేదు

బ్రహ్మవిద్య కావాలంటే ఉపనయనాది సంస్కారాలు కావాలి. అటువంటి సంస్కార హీనుడికి బ్రహ్మవిద్యాధికారం లేదు. ఆచారహీనుడు, సంప్రదాయ హీనుడు వీరికి బ్రహ్మవిద్యాధికారం లేదు.

జన్మనాజాయతే శూద్రః కర్మణాజాయతే ద్విజః

జన్మచేత అందరూ శూద్రులే. కాని కర్మచేత ద్విజులౌతారు.

మనదేశంలో వర్ణవ్యవస్థ అనేది అనాదిగా ఉన్నది. బ్రహ్మ, క్షత్రియ, వైశ్య, శూద్ర అని నాలుగు వర్ణాలు ఉన్నాయి. వీటినే చాతుర్వర్ణాలు అన్నారు. ఈ వర్ణ వ్యవస్థ మొట్టమొదటగా పురుష సూక్తంలో చెప్పబడింది. పరమేశ్వరుని యొక్క ముఖం నుంచి బ్రాహ్మణులు, బాహువుల నుంచి క్షత్రియులు, ఊరువుల నుంచి వైశ్యుడు, పాదాల నుంచి శూద్రులు జన్మించారు అని వేదంలో (పురుషసూక్తం) చెప్పబడింది. ఆ తరువాత భగవానుడు గీతలో **చాతుర్వర్ణం మయాసృష్టం గుణకర్మ విభాగచ** మానవులు చేసే కర్మల ననుసరించి వారిని నాలుగు వర్ణములుగా నేనే విభజించాను అన్నాడు. అయితే ఇది ఈనాడు మనకున్న కులవ్యవస్థ కాదు. వారు చేసే వృత్తిని బట్టి వర్ణనిర్ణయం జరిగింది. ఒక వర్ణం వారు ఇంకొక వర్ణంలోకి

మారటం జరిగేది. అలాగే క్షత్రియుడైన విశ్వామిత్రుడు బ్రాహ్మణుడైనాడు. ఐతే ఇప్పుడు మనముందున్న ప్రశ్న ఏమంటే ఇవాల్టి రోజున అందరూ ఉద్యోగాలు చేస్తున్నారు. అటువంటి పరిస్థితిలో మరి బ్రాహ్మణుడు అంటే ఎవరు. అయితే ఈ ప్రశ్న ఇవాళ కాదు. కొన్నివేల సంవత్సరాల క్రితమే వచ్చింది. దానికి సమాధానం కూడా వేదంలోనే చెప్పబడింది. **'వజ్రసూచికోపనిషత్తు'**లో ఈ విషయం వివరించబడింది. వజ్రసూచికోపనిషత్తు సామవేదానికి సంబంధించినది.

ఈ ఉపనిషత్తు మొదటి మంత్రంలోనే "బ్రాహ్మణ క్షత్రియ వైశ్యశూద్రులని నాలుగు వర్ణాలు ఉన్నాయని, ఆ వర్ణాలలో బ్రాహ్మణుడు శ్రేష్ఠుడని వేదవాక్యానుసారము స్మృతులు కూడా చెబుతున్నాయి. ఆ విషయాన్ని విచారణ చెయ్యాలి" అంటే అప్పటికే ఎవరు బ్రాహ్మణుడు? అనే ప్రశ్న వచ్చింది. బ్రాహ్మణుడు అంటే ఎవరు? జీవుడా? దేహమా? వర్ణమా? జ్ఞానమా? కర్మమా? ధర్మాన్ని ఆచరించే వాడా? ఎవడు బ్రాహ్మణుడు?

అనాదిగా బ్రాహ్మణుడు వేదవేదాంగాలను అభ్యసిస్తున్నాడు. అగ్నికార్యం చేస్తున్నాడు. యజ్ఞయాగాది కర్మలు చేస్తున్నాడు. అటువంటివాడు బ్రాహ్మణుడు, ఉత్తముడు అనటంలో సందేహం లేదు. కాని రానురాను చాతుర్వర్ణాలు శాఖోపశాఖలుగా పెరిగి కులాలయినాయి. ఈ రోజున కులవిద్య ఎవరూ చెయ్యటం లేదు. బ్రాహ్మణ కులంలో పుట్టినవారు కూడా వేదాధ్యయనం మానేసి బతుకుబాటలో ఇతర వృత్తులు చేపడుతున్నారు. మిగిలిన వారితో బాటుగానే జీవిస్తున్నారు. ఇప్పుడు వేదాధ్యయనం చెయ్యనివాడు, యజ్ఞయాగాది క్రతువులు ఆచరించనివాడు, కనీసం సంధ్యావందనం కూడా చెయ్యనివాడు కేవలం బ్రాహ్మణ కులంలో పుట్టినంత మాత్రంచేతనే బ్రాహ్మణుడవుతాడా? ఇదీ అనుమానం. దీనికి సమాధానమే ఈ ఉపనిషత్తు.

జీవుడే బ్రాహ్మణుడా? కాదు. ఎందుకంటే గతంలో జరిగిపోయినవి, భవిష్యత్తులో వచ్చేవి అనేక దేహాలున్నాయి జీవుడికి. అంటే జీవి అనేక జన్మలు ఎత్తుతాడు. ఇక్కడ జన్మలు అనేకం. కాని జీవుడు ఒక్కడే. జీవి తాను చేసిన కర్మవల్లనే అనేక జన్మలు ఎత్తటం జరుగుతోంది. అనేక శరీరాలు ధరిస్తోంది. ఈ శరీరాలన్నింటిలోను ఉన్న జీవుడు ఒక్కడే. క్రిమికీటకాదుల నుంచి మానవుడిదాకా

84 లక్షల రకాల జీవజాలమున్నది. తాను చేసిన కర్మవల్ల రకరకాల శరీరాలు ధరించే జీవుడే బ్రాహ్మణుడు అని చెప్పటం సరికాదు.

పోనీ **దేహమే బ్రాహ్మణుడా?** అంటే కాదు అని చెప్పాలి. ఈ దేహం పంచభూతాలతో నిండినది. అన్ని వర్ణాల వారికి, అన్ని కులాల వారికి, అన్ని మతాల వారికి కూడా ఈ దేహం ఉన్నది. బాల్య, కౌమార, యవ్వన, వృద్ధాప్య దశలు అందరికీ సమానమే. జరామరణాలు అన్ని దేహాలకు ఉన్నాయి. కర్మలు ధర్మాలు అందరికీ ఒక్కటే. బ్రాహ్మణుడు తెల్లగా ఉండాలని, వైశ్యుడు నల్లగా ఉండాలనీ ఏమీ లేదు. కాబట్టి ఈ దేహము బ్రాహ్మణుడు కాదు.

పోనీ **వర్ణమే బ్రాహ్మణుడా?** అంటే చాతుర్వర్ణాలలో మొదటివాడు బ్రాహ్మణుడా? అలా ఏం కాదు. ఒకే వర్ణంలో మళ్ళీ రకరకాల తేడాలున్నాయి. ఉదాహరణకు బ్రాహ్మణ కులంలోనే చూస్తే వైదికులు, నియోగులు, తెలగాణ్యులు, కాసలనాటి వారు, ప్రథమ శాఖవారు, ఇలా అనేక రకాలు. అంతేకాదు. వీరి జన్మలలో కూడా తేడా ఉంది. ఋష్యశృంగుడు జింకవల్ల జన్మించాడు. కౌశికుడు దర్భ నుంచి, జంబూక మహర్షి జంబూకంవల్ల, వ్యాసుడు మత్స్యగంధివల్ల, శుకుడు ఘృతాచి అనే అప్సరాంగనవల్ల, గౌతముడు కుందేటి వీపునుంచి, వశిష్టుడు ఊర్వసివల్ల, అగస్త్యుడు కుండనుండి జన్మించారు. వీరందరూ తమ జాతి ప్రవృత్తిలేని మహాజ్ఞానులు, మహర్షులు. కాబట్టి కేవలము వర్ణమే బ్రాహ్మణుడు కాదు.

పోనీ **జ్ఞానమే బ్రాహ్మణుడా?** అంటే – కాదు. అని చెప్పాలి. ఎందుకంటే – జ్ఞానం కలిగిన క్షత్రియులు చాలామంది ఉన్నారు. మిథిలానగరాన్ని పాలించిన జనక మహారాజు, కాశీరాజు అశ్వపతి, మహావృష సామ్రాజ్యాన్ని పాలించిన జానశృతి ఇలాటివారు అనేక మంది మహాజ్ఞానులున్నారు. కాబట్టి జ్ఞానము గలవాడు బ్రాహ్మణుడు అనరాదు.

కర్మలు చేసేవాడు బ్రాహ్మణుడా? అంటే కాదు, ప్రతి వ్యక్తికి 1. ప్రారబ్ధము 2. సంచితము 3. అగామి అని మూడు రకాల కర్మలున్నాయి. కర్మలవలన ప్రేరేపించ బడిన జీవుడు ఆ కర్మలు చేస్తాడు. కాబట్టి కర్మలు చేసేవాడే బ్రాహ్మణుడు కాదు.

మరి **ధర్మం చేసేవాడు బ్రాహ్మణుడా?** అంటే కాదు అని చెప్పాలి. ఎందుకంటే దానం చేసేవారు అనేకమంది ఉన్నారు. బలిచక్రవర్తి వంశనాశనం అవుతుందని

తెలిసికూడా మూడడుగులు పేరుతో సర్వస్వాన్నీ దానం చేశాడు. దానగ్రహీత సాక్షాత్తు శ్రీమహావిష్ణువు, అతనికి దానం ఇస్తే తాను సర్వనాశనమై పోతాడు అని తెలిసి కూడా దానమిచ్చాడు. అలాగే శిబిచక్రవర్తి తన దేహాన్ని కోసి దానమిచ్చాడు కర్ణుడు తన కవచకుండలాలను ఇంద్రునికి దానమిచ్చాడు. ఇలాటి వారు ఇంకా చాలామంది ఉన్నారు. వారు బ్రాహ్మణులు కాదు. అందుచేత దానం చేసినవాడే బ్రాహ్మణుడు కాదు.

మనం గొప్ప గుణాలు గల వారెవరిని చెప్పినా అతడు బ్రాహ్మణుడు కాదు. అంటున్నారు మరి బ్రాహ్మణుడంటే ఎవరు? అద్వితీయుడు, జాతి, గుణ, క్రియారహితుడు, షడూర్ములు, షడ్భావాలు, షడ్వికారాలు లేనివాడు. **(షడూర్ములు** – ఆకలి, కోరిక, శోకము, మోహము, జర, మరణము, **షడ్వికారాలు** – పుట్టుట. పెరుగుట, ముదియుట, చిక్కుట, చచ్చుట, గర్భనరకస్థితి) సత్యజ్ఞానానంద స్వరూపుడు, నిర్వికల్ప సంకల్పుడు, అన్ని సంకల్పాలకు ఆధారమైన వాడు, అన్ని భూతాలకు అంతర్యామి, ఆకాశం లాగా బాహ్యాంతరాలలో అంతటా వ్యాపించిన వాడు, అవిచ్ఛిన్నమైన ఆనందము గలవాడు, అప్రమేయుడు, స్వానుభవముతో మాత్రమే గ్రహించతగ్గవాడు, స్వయంప్రకాశి, భగవస్సాక్షాత్కారము పొంది కృతార్థుడైన వాడు, ఏ రకమైన దోషాలు లేనివాడు, శాంతి మొదలైన సద్గుణాలు కలవాడు, అరిషడ్వర్గాలను జయించిన వాడు, దంభము, అహంకారము ఏ మాత్రము లేనివాడు, నిరంతర సత్యాన్వేషి మాత్రమే బ్రాహ్మణుడు అని చెబుతోంది ఈ ఉపనిషత్తు.

జన్మనా జాయతే శూద్రః కర్మణా జాయతే ద్విజః

కాబట్టి బ్రాహ్మణత్వము అనేది కేవలము పుట్టుకతోనే రాదు మనం చేసే కర్మని బట్టి వస్తుంది. ఆ రోజు పరిస్థితులు వేరు. నేటి సామాజిక పరిస్థితులు వేరు. అందుచేత విద్యమీద ఆసక్తిగల వారందరూ కులమతాల ప్రసక్తి లేకుండా బ్రహ్మవిద్యకు అర్హులేను అంటున్నారు పరమానందనాథులు.

ఇక్కడ మనం గుర్తించాల్సిన విషయం ఏమంటే బ్రాహ్మణుడుగా జన్మించినా ఉపనయనం కానివాడు, ఆచారహీనుడు, వేదవిద్యకు, బ్రహ్మవిద్యకు అనర్హుడు. అదే ఉపనయనమయి, ఆచారాలు, సంప్రదాయాలు పాటించే సంస్కారవంతు లందరూ వేదవిద్యకు, బ్రహ్మవిద్యకు అర్హులే.

ఈ విషయం 97 నుంచి 101 వరకు గల సూత్రాలలో వివరించబడింది.

27. ఒకే కాలంలో అనేక శరీరాలు

ముక్తపురుషుడు ఒకే కాలంలో అనేక శరీరాలు పొందగలడా? అంటే అనేక శరీరాలు ధరించలేడు, కాని ప్రదీపంలాగా ఆవేశిస్తాడు. అంటే దీపం ఒకటే కాని వత్తులు అంటుకుని వేరువేరు దీపాలవుతుంది. అలాగే ముక్తుడు కూడా తానొక్కడే అయినా అనేక రూపాలు పొందుతాడు. అనేక శరీరాలను అవేశిస్తాడు.

'నారీ నారీ నడుమ మురారీ' శ్రీకృష్ణుడు తాను ఒక్కడే అయి ఉండి కూడా పదహారు వేలమంది గోపికలతో ఏకకాలంలో విహరించాడు.

భాగవతంలో బలరామకృష్ణులను చంపే ఉద్దేశ్యంతో వీరిద్దరినీ ధనుర్యాగానికి తీసుకురమ్మని అక్రూరుణ్ణి పంపాడు కంసమహారాజు. అక్రూరుడు ద్వారకకు వచ్చి యశోదానందులను ఒప్పించి బలరామకృష్ణులను తీసుకుని రథంలో మధురకు బయలుదేరతాడు. త్రోవలో యమునానది వస్తుంది. అక్కడ రథం ఆపి బలరామకృష్ణులను కాళ్ళు చేతులు కడుగుకుని దాహం తీర్చుకు రమ్మంటాడు. తరువాత వారిని రథంలో కూర్చోమని అక్రూరుడు నదివద్దకు వెళ్ళి అర్ఘ్యప్రదానం చేసి కంసుడు మహాక్రూరుడు వీరు చూస్తే పిల్లలు. వీరిని చంపేస్తాడు. ఏం చెయ్యాలి? పై పెచ్చు కంసుడు మహాబలవంతుడు. అందులోను రాజు. పైగా రాక్షసుడు. కంసుడు అంతఃపురంలో ఉండగా అక్రూరుణ్ణి పిలిపించి బలరామకృష్ణులను తీసుకు రమ్మన్నాడు. 'వారు చిన్న పిల్లలు. వారిని చంపవద్దు' అని బ్రతిమాలాడు అక్రూరుడు. చివరకు 'నేను వెళ్ళను' అన్నాడు. అప్పుడు కంసుడు "రాజు ఏ పరిస్థితిలో ఉన్నప్పటికీ, అతని నోటి వెంట వచ్చిన మాట రాజాజ్ఞ. దానికి తిరుగులేదు. మీరటానికి వీలులేదు" అని హెచ్చరించాడు. చేసేది లేక తప్పనిసరి పరిస్థితిలో బయలుదేరి వచ్చాడు అక్రూరుడు. ఇప్పుడు పిల్లల్ని తీసుకుని వెళుతున్నాడు. త్రోవలో వీరి గురించే ఆలోచిస్తున్నాడు. విచారిస్తున్నాడు. మనసులో వ్యాకులపడుతున్నాడు. ఎంతసేపూ బాలుర గురించే ఆలోచన. ఈ స్థితిలో తలపైకి ఎత్తాడు అక్రూరుడు. ఎదురుగా నదిలో బాలురు ఇద్దరూ కనుపించారు. వీరిని రథంలో కూర్చోబెట్టి తను నదికి వచ్చాడు. ఇప్పుడేమో బాలురిద్దరూ నీటిలో కనిపిస్తున్నారు. ఆశ్చర్యపోయాడు.

వెనక్కి తిరిగి చూశాడు. పిల్లలిద్దరు రథం మీద ఉన్నారు. ముందుకు తిరిగాడు నది నీటిలో ఉన్నారు. రెండువైపులా కనుపిస్తున్నారు. మహదాశ్చర్యము. ఇంతవరకు

వీళ్ళు చిన్నపిల్లలు కంసుడు మహాబలవంతుడు. రాక్షసుడు. అందులోను రాజు. వీళ్ళని చంపేస్తాడు. నేను ఏం చెయ్యగలను. అని ఆలోచిస్తూ మథనపడుతున్న అక్రూరుడుకి భగవానుడు ఇచ్చిన సందేశమది. అక్రూరా ! కంసమహారాజు నన్ను ఏమీ చెయ్యలేడు' అని చెప్పిన సందేశమది.

ఈ రకంగా ముక్తపురుషుడు ఒకే సమయంలో వివిధ ప్రదేశాలలో దర్శనమివ్వగలడు. కాని వివిధ శరీరాలు పొందటం మాత్రం జరగదు. చూసేవారికి మాత్రం వివిధ శరీరాలు పొందినట్లుగా అనుభూతి కలుగుతుంది.

ఈ విషయమంతా 548, 549 సూత్రాలలో వివరించారు.

28. తెలుసుకోవలసింది పరబ్రహ్మను గురించే

పూర్వకాలంలో కాశీనగరాన్ని 'అజాత శత్రువు' అనే రాజు పాలిస్తూండేవాడు. అతడు బ్రహ్మవేత్త. గార్గ్యవంశంలో పుట్టిన బాలాకి అనేవాడు వాచాలుడు. గర్విష్టి. అతడు ఒకసారి కాశీరాజు దగ్గరకు వెళ్ళి "రాజా! నీకు బ్రహ్మోపదేశం చేస్తాను" అన్నాడు. ఆ మాటలు విన్న కాశీరాజు ఆ బ్రాహ్మణుడికి వేయిగోవులు దానమిచ్చి "ఓ వేదవిదుడా! బ్రహ్మవేత్తలు, ఆధ్యాత్మిక చింతనాపరులు అందరూ జనకుని పేరే తలుస్తున్నారు. అతని దగ్గరకే పోతున్నారు. నీ ప్రభావం వల్ల నేను కూడా బ్రహ్మవేత్తనై జనకునితో సమానమైన వాడనిపించుకుంటాను. కాబట్టి నాకు బ్రహ్మోపదేశం చెయ్యవలసినది" అన్నాడు. బాలాకి చెప్పటం మొదలుపెట్టాడు. ఇతణ్ణే "గార్గ్యుడు" అని కూడా అంటారు.

"రాజా! సూర్యునిలో ఉన్న పురుషుడే బ్రహ్మ. అతన్నే నేను ఉపాసిస్తాను" అన్నాడు బాలాకి.

ఆ మాటలు విన్నరాజు సూర్యుని గురించి నాకు తెలుసును. అతణ్ణి అన్ని భూతాలకు మకుటాయమానంగా కాంతివంతంగా నేను ఉపాసన చేస్తాను. అంతేకాని అతను బ్రహ్మకాదు. ఈ రకంగా సూర్యుని ఉపాసించే వాడు రాజవుతాడు" అన్నాడు.

"చంద్రునిలో ఉన్న పురుషుని బ్రహ్మగా నేను ఉపాసిస్తాను" అన్నాడు బాలాకి.

"చంద్రుడు గొప్పవాడు. తెల్లని వస్త్రాలు ధరించిన సోమరాజు. అంతేకాని చంద్రుడు బ్రహ్మకాదు. ఈ రకంగా చంద్రుని ఉపాసన చేసేవారికి అన్నం లోటురాదు" అన్నాడు కాశీరాజు.

"విద్యుత్తులో పుట్టిన పురుషుణ్ణి బ్రహ్మగా ఉపాసన చేస్తాను" అన్నాడు బాలాకి.

"ఆ విద్యుత్తును మహాశక్తివంతమైన దాన్నిగా నేను ఉపాసిస్తాను. అంతేకాని విద్యుత్తు మాత్రం బ్రహ్మకాదు. ఈ రకంగా అతణ్ణి ఉపాసించేవారు సంతానము పొంది తేజోవంతులు, శక్తివంతులు అవుతారు" అన్నాడు కాశీరాజు.

"ఆకాశంలో ఉన్న పురుషుణ్ణి బ్రహ్మగా ఉపాసిస్తాను" అన్నాడు బాలాకి.

"నేను ఆకాశాన్ని పూర్ణమైన దాన్నిగా, నిశ్చలమైనదాన్నిగా భావించి ఉపాసిస్తాను. ఈ విధంగా ఆకాశాన్ని ఉపాసించేవారు సంతానము, పశువులతో సుఖంగా ఉంటారు." అన్నాడు కాశీరాజు.

"నేను వాయువులో ఉన్న పురుషుణ్ణి బ్రహ్మగా ఉపాసిస్తాను" అన్నాడు బాలాకి.

"నేను వాయురూపంలో. ఓటమి ఎరుగని సేవ చేస్తున్నాను. ఈ విధంగా ఉపాసించే వారు శత్రువులను జయిస్తారు" అన్నాడు రాజు.

"నేను జలంలో ఉండే పురుషుణ్ణి బ్రహ్మగా ఉపాసిస్తాను" అన్నాడు బాలాకి.

"జలాన్ని ప్రతిరూపంగా భావించి నేను ఉపాసన చేస్తాను. ఈ విధమైన ఉపాసన చేసిన వారికి అన్నీ వారు కోరిన వస్తువులే లభిస్తాయి" అన్నాడు రాజు.

"అద్దంలో ఉండే పురుషుణ్ణి బ్రహ్మగా భావించి ఉపాసన చేస్తాను" అన్నాడు బాలాకి.

"నేను అద్దంలో ఉండే పురుషుణ్ణి కాంతివంతుడుగా భావించి ఉపాసిస్తాను. ఆ రకంగా ఉపాసించినవాడు దీప్తిమంతుడౌతాడు. అతని సంతానం కూడా దీప్తివంతమవుతుంది అన్నాడు అజాత శత్రువు.

"మనం నడిచేటప్పుడు వెనుక నుంచి వచ్చే శబ్దాన్ని నేను బ్రహ్మగా భావించి ఉపాసన చేస్తాను" అన్నాడు బాలాకి.

"ఆ విషయం నాకు తెలుసు. నేను ఆ శబ్దాన్ని వాయువు లేక ప్రాణంగా ఉపాసిస్తాను. ఈ రకంగా ఉపాసించేవాడు పూర్ణాయుర్దాయాన్ని పొందుతాడు" అన్నాడు రాజు.

"నేను దిక్కులందుండే పురుషుని బ్రహ్మగా ఉపాసిస్తాను. అన్నాడు బాలాకి.

“ఆ విషయం నాకు తెలుసు. నేనా పురుషుణ్ణి రెండవవాడు కలవానినిగా వేరు చేయబడని వానినిగా భావించి ఉపాసిస్తాను. దిక్కులందుండే పురుషుణ్ణి ఈ రకంగా ఉపాసించేవాడు స్నేహితులు, అనుచరులు కలవాడవుతాడు” అన్నాడు రాజు.

నేను నీడలో ఉండే పురుషుణ్ణి బ్రహ్మగా ఉపాసిస్తాను” అన్నాడు బాలాకి.

“ఆ విషయం నాకు తెలుసు. ఆ ఛాయలో ఉండే పురుషుణ్ణి మృత్యువుగా భావించి నేను ఉపాసిస్తాను. ఈ రకంగా ఉపాసించేవాడు పూర్ణాయుర్దాయుడౌతాడు” అన్నాడు రాజు.

“బుద్ధిలో ఉన్న పురుషుణ్ణి నేను బ్రహ్మగా భావించి ఉపాసన చేస్తాను” అన్నాడు బాలాకి.

“ఆ విషయం నాకు తెలుసు. అతన్ని నేను ఆత్మగల వానిగా ఉపాసిస్తాను. ఈ రకంగా ఉపాసన చేసేవాడు ఆత్మవంతుడౌతాడు. బుద్ధిమంతుడౌతాడు” అన్నాడు రాజు.

గార్గ్యుడికి ఇంతకన్న విషయం తెలియదు. అందుకని మాట్లాడకుండా ఊరుకున్నాడు. అప్పుడు ఆ బ్రాహ్మణ్ణి చూసి “నీకు తెలిసిన బ్రహ్మజ్ఞానం ఇంతేనా? ఇంకేమైనా ఉన్నదా అన్నాడు రాజు.

“ఇంతే! ఇంకేంలేదు” అని సమాధానమిచ్చాడు బాలాకి.

“ఈ కొంచెం తెలిసినంత మాత్రంచేత బ్రహ్మజ్ఞానం తెలిసినట్లు కాదు” అన్నాడు రాజు.

ఆ మాటలు విన్న గార్గ్యుడు “రాజా! నీవే శరణు. నాకు బ్రహ్మోపదేశం చెయ్యి” అన్నాడు.

తెలుసుకోవలసినది పరమాత్మనుగురించి. ప్రాణము, బ్రహ్మ. వీరిలో తెలుసుకోదగిన వాడు బ్రహ్మ మాత్రమే. ఈ విధంగా బ్రహ్మను గురించి తెలుసుకున్న వాడు సమస్తపాపాలను నాశనంచేసుకుని అమరుడౌతాడు.

ఇక్కడ బ్రహ్మ ప్రతిపత్తి కోసమే జీవ పరామర్శ జరిగింది.

బృహదారణ్యకోపనిషత్తులో అజాతశత్రువు గార్గ్యుణ్ణి నిద్రపోతున్న ఒక మనిషి దగ్గరకు తీసుకుపోయి “ఓ బ్రాహ్మణ శ్రేష్టుడా! నిద్రలే” అన్నాడు. అతడు లేవలేదు. చేతితో తట్టిలేపాడు నిద్రిస్తున్నవాడు లేచి కూర్చున్నాడు.

అప్పుడు రాజు గార్గ్యునితో, “చేతితో తట్టి లేపటానికి పూర్వం పురుషుడు నిద్రిస్తున్నాడు పిలిచినా లేవలేదు. అప్పుడతడు ఎక్కడ ఉన్నాడు? ఇప్పుడు ఎక్కడ నుంచి వచ్చాడు?

జీవుడు నిద్రిస్తుండగా ఇంద్రియాల యొక్క విషయాలన్నింటినీ అనగా వాక్కు మొదలైన ప్రాణాల విజ్ఞానాన్ని పూర్తిగా గ్రహించి హృదయాకాశంలో నిద్రిస్తున్నాడు. హృదయాకాశము పరమాత్మ ఉండే చోటు. నిద్రావస్థలో ఉన్నప్పుడు పురుషుడు శరీరము, ఇంద్రియాలను తనలో లీనం చేసుకుంటాడు. ప్రాణాలన్నింటినీ తనలోకి ఆకర్షించుకుంటాడు. వాక్కు, చక్షువు, శ్రోత్రము మొ॥ ఇంద్రియాలు మనస్సుతో సహా లోపలకు ఆకర్షింపబడతాయి. ఆ స్థితిలో క్రియ అనేది ఉండదు. క్రియాఫలం ఉండదు. కాబట్టి ఆత్మ తన నిజస్థితిలో ఉంటుంది.

ఆత్మ స్వప్నావస్థలో ఉన్నప్పుడు దాని కర్మఫలాలు ప్రారంభమవుతాయి. స్వప్నస్థితిలో ఆత్మ మహారాజులాగా ఉంటుంది. గొప్పబ్రాహ్మణునిలా ఉంటుంది. దేవతలవలె ఉచ్ఛస్థితులు, అసురులవలె నీచస్థితులు కూడా పొందుతుంది. రాజుగారు తన దేశంలో స్వేచ్ఛగా తిరిగినట్లుగానే, ఆత్మస్వప్నంలో ప్రాణాన్ని, ఇంద్రియాలను గ్రహించి తన దేహంలో యధేచ్ఛగా తిరుగుతుంది. అదే సుషుప్తావస్థలో ఆనందంతో కూడిన స్థితిని పొందుతుంది.

అగ్ని నుండి చిన్న చిన్న రవ్వలు పైకి లేచినట్లుగానే ఆత్మనుండి అన్ని ప్రాణులు. ఇంద్రియాలు, లోకాలు, దేవగణాలు, భూతగణాలు పుడుతున్నాయి. ఇదే ఆత్మకు సంబంధించిన విషయాన్ని వివరించే రహస్యోపనిషత్తు” అంటూ అజాత శత్రువు అనే రాజు గార్గ్యవంశంలోని బాలాకికి ఆత్మతత్త్వాన్ని ఉపదేశించాడు. కాబట్టి ఇక్కడ ఆకర్షింపబడే పురుషుడు బ్రహ్మమే.

కాబట్టి మోక్షగామి అయినవాడు తెలుసుకోవలసింది పరబ్రహ్మను గురించే

ఈ విషయమంతా 122, 123, 124 సూత్రాలలో వివరించబడింది.

29. ద్రష్టవ్యము అయినది పరమాత్మే

బృహదారణ్యకోపనిషత్తులో యాజ్ఞవల్క్యుడు సన్యాసం స్వీకరించాలనే కోరికతో తన ఇద్దరు భార్యలకు తన ఆస్తిపాస్తులు పంచుతానంటాడు. రెండవ భార్యయైన మైత్రేయి ఈ సిరిసంపదలు నాకు వద్దు. శాశ్వతమైన ఆనందాన్ని ఇచ్చే బ్రహ్మవిద్యను నాకు ఉపదేశించండి అంటుంది. అప్పుడు యాజ్ఞవల్క్యుడు చెబుతాడు.

"మైత్రేయీ ! ఆత్మప్రయోజనం కోసమే ఒకరికొకరు ప్రియులౌతారు. భార్యభర్తను ప్రేమిస్తోంది అంటే ఈ ప్రేమ భర్తకోసం కాదు. కేవలం భార్య ప్రయోజనం కోసమే. అలాగే భర్తకూడా తన ప్రయోజనం కోసమే భార్యను ప్రేమిస్తాడు. తల్లితండ్రులు పుత్రులను తమ ప్రయోజనం కోసమే ప్రేమిస్తున్నారు. అంతేకాని పుత్రుల ప్రయోజనం కోసం కాదు. అదే విధంగా ధనాన్ని మన ప్రయోజనం అంటే ఆత్మ ప్రయోజనం కోసమే ప్రేమిస్తున్నాము. ఈ విధంగా లోకాలను, క్షత్రియులను, పంచభూతాలను ఒకటేమిటి? లోకం దేన్నయినాసరే ఆత్మ ప్రయోజనం కోసమే ప్రేమిస్తున్నాము. కాబట్టి ఈ ఆత్మ ఒక్కటే దర్శనీయమైనది, తెలుసుకోతగినది. ముందుగా దీన్ని గురించి గురువు ద్వారా వినాలి. శాస్త్రాలు చదవాలి. ఇతరులతో తర్కించాలి. ఆత్మతత్త్వాన్ని గూర్చి దర్శనం, శ్రవణం, మననం, విజ్ఞానం ద్వారా అన్నీ తెలుస్తాయి. రజ్జుసర్పభ్రాంతి కలిగినప్పుడు, అది కేవలం త్రాడు అని తెలిస్తే అది సర్పమనే భ్రాంతి తొలగిపోతుంది. విజ్ఞానం కలగగానే ఆత్మస్వరూపం గోచరిస్తుంది.

బ్రాహ్మణజాతిని ఎవరైనా ఆత్మకన్న భిన్నమైనదిగా భావిస్తే వాళ్ళను ఆజాతి నిర్లక్ష్యం చేసి దూరంగా త్రోసివేస్తుంది. పురుషార్థాల నుండి భ్రష్టుల్ని చేస్తుంది. అదే విధంగా క్షత్రియజాతిని ఎవరైనా ఆత్మకన్న భిన్నమైనదిగా భావిస్తే వాళ్ళని ఆ జాతి త్రోసివేస్తుంది. దేవతలను ఆత్మకన్న భిన్నంగా భావించిన వారిని దేవతలు తృణీకరిస్తారు. ఈ విధంగా బ్రాహ్మణజాతి, క్షత్రియజాతి, లోకాలు, దేవతలు, పంచభూతాలు ఒకటేమిటి? కంటికి కనుపించే ప్రతిదీ ఆత్మస్వరూపమే. ఆత్మకన్న భిన్నమైనది ఏదీలేదు. అన్నీ ఆత్మనుండే పుడుతూ, ఆత్మలోనే లీనం అవుతున్నాయి.

ఏది లేకుండా ఒక వస్తువును మనం గ్రహించలేమో, అది దానియొక్క తత్త్వము, ధర్మము అవుతుంది. ఒక నగారాను కర్రతో కొట్టినప్పుడు దానినుంచి వచ్చే స్వరాలు

దాని యొక్క సామాన్య స్వరానికి భిన్నంకావు. ఎన్నిరకాల శబ్దాలు వచ్చినా అవి సామాన్య స్వరంతో కలిసిపోతాయి. వాటికి ప్రత్యేకమైన అస్థిత్వం ఉండదు. ముందుగా సామాన్య స్వరం గ్రహిస్తే తరువాత విశేష శబ్దం పట్టుబడుతుంది. అలాగే ముందు చిదాత్మను గ్రహిస్తే, తరువాత దానిలోని కల్పితమైన నామరూపాత్మకమైన జగత్తు పట్టుబడుతుంది. కన్ను ముందుగా వెలుగును గ్రహించిన తరువాతనే నీలము, ఎరుపు, నలుపు రంగులను చూడగలము. అదే విధంగా చిదాత్మను దర్శించిన తరువాతనే నామరూపాత్మకమైన జగత్తును చూడగలము.

శంఖాన్ని ఊదినప్పుడు వెలువడే ప్రత్యేకమైన శబ్దాలను గ్రహించగలిగితే దాని నుండి వెలువడిన శబ్దాలు వాటంతటవే పట్టుబడతాయి. కాబట్టి ముందు సామాన్య శబ్దం పట్టుబడాలి. అగ్నినుంచి వచ్చే రవ్వలు అగ్ని కన్న వేరైనవి కావు. అలాగే వేదాలు, పురాణాలు, ఉపనిషత్తులు, మంత్రాలు, కళలు, సూత్రాలు ఇవన్నీ పరమాత్మ యొక్క స్వరూపాలు. ప్రయత్నం లేకుండానే ఇవన్నీ విజ్ఞానఘనుడైన పరమాత్మ నుంచి ఉత్పన్నమైనాయి. రవ్వలు, జ్వాలలు రావటానికి ముందు అంతా అగ్నిమయమే. అలాగే నామరూపాత్మక స్థితికి ముందు జగత్తంతా ప్రజ్ఞానఘనుని స్వరూపమే.

అన్ని నదులకు గమ్యస్థానం సముద్రమే. సముద్రంలో చేరగానే నదులు తమ అస్థిత్వాన్ని కోల్పోతాయి. అలాగే

అన్ని రకాల స్పర్శలకు గమ్యస్థానం	– చర్మము
అన్ని రకాల వాసనలకు ప్రళయస్థానం	– నాసిక
అన్ని రుచులకు ప్రళయ స్థానం	– నాలుక
అన్ని శబ్దాలకు ప్రళయ స్థానం	– చెవులు
అన్ని ఆలోచనలకు ప్రళయ స్థానం	– మనస్సు
అన్ని విద్యలకు ప్రళయ స్థానం	– హృదయం
అన్ని కర్మలకు ప్రళయ స్థానం	– చేతులు
అన్ని సుఖాలకు ప్రళయ స్థానం	– జననేంద్రియము
అన్ని నడకలకు గమ్యస్థానం	– కాళ్ళు
అన్ని విషయాలకు గమ్యస్థానం	– ఇంద్రియాలు.

ఈ రకంగా కార్యాలన్నీ కారణాలలో కలిసిపోయి ఇవన్నీ ప్రజ్ఞాన ఘనుడిలో చేరిపోతాయి.

నీళ్ళలో ఉప్పు వేస్తే అది కరుగుతుంది. అంటే ఆ ఉప్పు నీరంతా వ్యాపించి ఉంటుంది. అదే విధంగా అద్భుతమైన శక్తి గల పరమాత్మ అనంతుడు, అవ్యయుడు, విజ్ఞానఘనుడు. అతడు దేహాది ఉపాధులతోబాటుగా కలిసిపోయి, అవి నాశనమయి నప్పుడు తాను కూడా నాశనమయినట్లు కనిపిస్తాడు. దేహంనుండి విడివడిన తరువాత విశేష సంజ్ఞలు ఏమీ ఉండవు.

లోకంలో ఉన్నదంతా ఆత్మే. ఆత్మయే అందరిలోనూ సమానంగా ఉన్నది. ఆత్మనుండే అన్నీ పుట్టినాయి. మళ్ళీ ఆత్మలోనే లయం అవుతాయి. అందుచేతనే ఆత్మను గురించి తెలుసుకుంటే మిగిలిన విషయాలన్నీ తెలుసుకున్నట్లే.

ఈ జగత్తులోని ప్రతి వస్తువు, ప్రతి ప్రాణి ఒకదానికొకటి ఉపకార్య, ఉపకారిక స్వభావాలు కలిగి ఉంటాయి.

పిపీలికాది బ్రహ్మపర్యంతము సృష్టియే జగత్తు. తేనెటీగలు అసంఖ్యాకంగా చేరి తేనెతుట్టెను నిర్మించినట్లుగా సమస్త భూతాలు చేరి ఈ పృథివిని నిర్మించాయి. సమస్త భూతాలకు ఈ భూమియే మధువు. తేనెతుట్టె తేనెటీగలకు ఆశ్రయం అయినట్లుగా భూతాలన్నింటికీ భూమి ఆశ్రయం, ఆహారం అవుతోంది. అందుకే భూమిని కూడా మధువు అంటారు. ఈ పృథివిలో చిన్మాత్రుడు, ప్రకాశమయుడు, అమృతమయుడు అయిన పురుషుడే ఈ అధ్యాత్మ శరీరంలోని తేజోమయుడైన, అమరణ ధర్ముడైన పురుషుడు కూడా! ఇద్దరూ ఒకటే. అదే ఆత్మ. ఈ ఆత్మ జ్ఞానమే అమృతత్త్వానికి సాధనం. వీటన్నింటిలో ఉన్న ఏకత్వమే బ్రహ్మ. అదే సర్వస్వరూపం. పృథివి అనేది శరీరానికి ప్రతీక. ఈ బ్రహ్మజ్ఞానమే సమస్తమూ తాను అవటానికి సాధనం.

అదే విధంగా జలం సమస్త భూతాలకు, ప్రాణాలకు మధువు. భూతాలు జలానికి మధువు. జలాన్ని రేతస్సు అంటారు. జలంలో ఉన్న ప్రకాశమయుడు, అమృత స్వరూపుడే ఈ శరీరాల్లో బీజంగా ఉన్న ప్రకాశమయుడు, అమృతమయుడు. అదే ఆత్మ. ఈ రెంటిలో ఉన్న ఏకత్వమే బ్రహ్మ. ఈ బ్రహ్మజ్ఞానమే సర్వమూ తాను అవటానికి సాధనం.

జీవులన్నింటికీ అగ్నిమధువులాంటిది. అలాగే అగ్నికి ఈ ప్రాణులన్నీ మధువు లాంటివి. అగ్నిలో ఉన్న తేజోమయుడైన పురుషుడే శరీరంలో వాగ్రూపంలో ఉన్న పురుషుడు. ఈ ఇద్దరూ ఒకటే. ఇదే బ్రహ్మ. అదే అమృతము.

వాయువు జీవరాశులన్నింటికీ మధువు వంటిది. ఈ జీవరాశులు వాయువుకు మధువు వంటివి. వాయువులో ఉన్న తేజోమయుడు, అమృతమయుడు అయిన పురుషుడు శరీరంలో ప్రాణరూపంలో ఉండే తేజోమయుడైన పురుషుడు ఇద్దరూ ఒకటే. అదే ఆత్మ. అదే అమృతం.

సూర్యుడు అన్ని భూతాలకు మధువు. అన్ని భూతాలు ఆదిత్యునికి మధువు లాంటివి. ఆదిత్యునిలో ఉన్న ప్రకాశవంతుడైన పురుషుడే శరీరంలోని కనులలో ఉండే తేజోమయుడైన పురుషుడు. వీరిద్దరూ ఒకటే. అదే ఆత్మ. అదే అమృతం. అదే బ్రహ్మ.

దిక్కులన్నీ సమస్త భూతాలకు మధువు వంటివి. అలాగే సమస్త భూతాలు దిక్కులన్నింటికి మధువు వంటివి. ఈ దిక్కులలో ఉన్న తేజోమయుడైన పురుషుడే శరీరంలో ఉండే శ్రోత్రపురుషుడు. శ్రవణ సమయంలో ఉండే పురుషుడు. ఈ ఇద్దరూ ఒకటే. అతడే ఆత్మ అతడే బ్రహ్మ స్వరూపుడు.

చంద్రుడు సమస్త భూతాలకు, మధువు వంటివాడు. అలాగే సమస్త భూతాలూ చంద్రునికి మధువులాంటివి. చంద్రునిలో ఉన్న తేజోమయుడైన పురుషుడు, శరీరంలో ఉన్న మనస్సంబంధమైన అమృతమయుడైన పురుషుడు ఇద్దరూ ఒకటే. అదే అమృతం. అదే బ్రహ్మ. అదే సర్వస్వరూపం.

విద్యుత్తు సమస్త జీవకోటికి మధువు. అలాగే సమస్త జీవరాసులు విద్యుత్తుకు మధువు. విద్యుత్తులో ఉండే ప్రకాశవంతమైన పురుషుడూ, శరీరంలో ఉండే తేజోమయుడైన అమృతమయుడు ఇద్దరూ ఒకటే. అతడే ఆత్మ. అతడే అమృతమయుడు, అతడే బ్రహ్మ.

సమస్త భూతాలకు మేఘం మధువు. అలాగే సమస్త భూతాలు మేఘానికి మధువు. మేఘంలో ఉన్న తేజోమయుడైన పురుషుడు, శరీరంలో శబ్దము, స్వరము రూపంలో ఉన్న పురుషుడు, ఇద్దరూ ఒకటే. అదే ఆత్మ. అదే అమృతం. అతడే బ్రహ్మ.

సమస్త భూతాలకు ఆకాశం మధువు. అలాగే సమస్త జీవులు ఆకాశానికి మధువు. ఆకాశంలో ఉండే తేజోమయుడైన పురుషుడు శరీరంలోని హృదయాకాశంలో ఉండే తేజోమయుడైన పురుషుడు ఇద్దరూ ఒకటే. అదే ఆత్మ. అమృతమయమైనది. అదే బ్రహ్మ.

ధర్మమనే పేరుతో వ్యవహరింపబడి మనం ఆచరించదగ్గది అయిన ధర్మము ఈ భూతాలన్నింటికి మధువు. ఈ భూతాలన్నీ ఆ ధర్మానికి మధువు లాంటివి. ధర్మంలో ఉండే తేజోమయుడైన పురుషుడు, శరీరంలో ఉండే తేజోమయుడైన పురుషుడు ఇద్దరూ ఒకటే. అతడే ఆత్మ. అతడే అమృతుడు. అతడే బ్రహ్మ.

సత్యమనేది సమస్త భూతాలకు మధువు. అలాగే సమస్త భూతాలు సత్యానికి మధువు. సత్యంలో ఉండే తేజోమయుడైన పురుషుడు శరీరంలో ఉండే తేజోమయుడైన పురుషుడు ఇద్దరూ ఒకటే. అతడే ఆత్మ. అతడే అమృతుడు. అతడే బ్రహ్మ.

మనుష్యాది జాతులన్నీ భూతాలకు మధువు. భూతాలన్నీ మనుష్యాది జాతులకు మధువు. భూతాలలో ఉన్న తేజోమయుడైన పురుషుడే శరీరానికి సంబంధించిన తేజోమయుడైన పురుషుడు. అతడే ఆత్మ. అతడే బ్రహ్మ.

విజ్ఞానమయుడైన ఆత్మయే సమస్త భూతాలకు అధిపతి. సమస్త భూతాలకు రాజు. సమస్త దేవతలు, సమస్త లోకాలు, సమస్త ప్రాణులు, అన్నీ పరమాత్మలో ఇమిడి ఉన్నాయి. ఆ ఆత్మయే పరబ్రహ్మ.

ఇదే మధువిజ్ఞానము. పూర్వకాలంలో దీనిని దధ్యమహర్షి తన శిష్యులయిన అశ్వనీదేవతలకు వివరించాడు" అని యాజ్ఞవల్క్యుడు తన భార్య మైత్రేయికి బ్రహ్మతత్త్వాన్ని వివరించాడు అని చెబుతాడు. ఆత్మ అనే పదాన్ని ముందు చెప్పటంచేత ఇక్కడ చెప్పింది జీవుణ్ణి గురించి కాదు. జీవవిజ్ఞానం వల్ల అమృతత్వం లభించదు. ఆత్మవిజ్ఞానం చేతనే సమస్తమూ తెలుస్తుంది. కాబట్టి ద్రష్టవ్యుడు పరమాత్మే కాని వేరు కాదు. ఈ విషయమంతా 125, 126, 127 సూత్రాలలో వివరించారు.

౩౦. సన్యాసం వేదంలో ఉన్నది

సన్యాసాశ్రమం గురించి చెప్పటంలో విధాయకమైన గుణాలేమీ లేవు. కొన్ని శ్రుతులు దీన్ని నిషేధిస్తున్నాయి. అయినప్పటికీ శాస్త్రాలు సన్యాసాశ్రమాన్ని అంధ పరంపర న్యాయంగా చెప్పాయి అని జైమిని అభిప్రాయం.

అంధ పరంపర న్యాయమంటే ఒక గ్రుడ్డివాడి చెయ్యి పట్టుకుని ఇంకొక గ్రుడ్డివాడు. అలా నడిచి వెళుతుంటారు. త్రోవలో ఏమున్నదో ముందు నడిచేవాడికీ తెలియదు. వెనక నడిచే వాడికీ తెలియదు. కాబట్టి అందరూ కలిసి గోతిలో పడతారు. అదే విధంగా ఒక శాస్త్రంలో చెప్పారు కాబట్టి ఇంకొక శాస్త్రంలో సన్యాసాశ్రమం గురించి వ్రాశారు అంటాడు జైమిని.

ఆశ్రమాలు మూడే చెప్పబడినాయి.

1. బ్రహ్మచర్యం – గురుకులవాసంలో గడిపేది
2. గృహస్థాశ్రమం – యజ్ఞము, వేదాధ్యయనము, దానము చేసేది
3. వానప్రస్తం – తపస్సు చెయ్యటం

బహుశః వ్యాసుడు బ్రహ్మసూత్రాలు వ్రాసే నాటికి సన్యాసోపనిషత్తులు ఉండి ఉండకపోవచ్చు. అందుకే ఈ రకంగా మూడు ఆశ్రమాలే చెప్పబడ్డాయి. వాటిలో సన్యాసాశ్రమం లేదు అన్నాడు జైమిని.

సన్యాసాశ్రమం అనుష్టింపదగినది అని వ్యాసుడంటాడు. వేదంలో గృహస్త్రాశ్రమంతో పాటే సన్యాసాశ్రమం కూడా చెప్పారు. వేదంలో పైన చెప్పిన మూడు ఆశ్రమాలకు ఒకే ఫలం పుణ్యలోకాలు అని చెప్పారు. సన్యాసాశ్రమం దీనికి భిన్నమైనది. మోక్షప్రాప్తికి ఉపయోగిస్తుంది. అందుకే దాన్ని అనుష్ఠించాలి.

విధిలో చెప్పకపోయినప్పటికీ సన్యాసావస్థ ఉన్నది. మొదటి మూడు ఆశ్రమాలలోనూ ఫలితం పుణ్యలోకాలు. సన్యాసాశ్రమానికి ఫలం మోక్షము. ఇది వేదాలలో చెప్పబడింది. చతురాశ్రమాలలోను సన్యాసం చాలా ఉత్తమమైనది, పవిత్రమైనది. సన్యాసికి సంఘంలో మంచి గౌరవం ఉంది. ప్రజల దృష్టిలో అతడు సర్వసంఘ పరిత్యాగి. సాక్షాత్తు పరమేశ్వరుడు. పై పెచ్చు సన్యాసాశ్రమానికి ఫలితం మోక్షం అని నమ్మకం. అంటే సన్యసించిన ప్రతివాడు తప్పనిసరిగా మోక్షం

పొందుతాడు. ఇది సన్యాసం గురించి ప్రజల భావన, అందుకే పూర్వకాలంలో సామాన్యంగా ప్రతిగృహస్తూ కనీసం చివరి దశలోనైనా సన్యసించేవాడు.

మా ముత్తాత గారు పరమగురువు కూడా గుంటూరు జిల్లా, కొల్లూరు గ్రామ కాపరస్తులు కూచిభొట్ల నాగభూషణ శాస్త్రి గారు. ఆ రోజుల్లో వారింట్లో దొంగలు లోపలికి వచ్చారు. శాస్త్రి గారికి ఆ విషయం తెలియదు. వారికి ఉబ్బసం ఉన్నది. దాంతో ఊపిరి అందక లేచి కూర్చుని దగ్గుతున్నారు. తాము వచ్చినది తెలిసి లేచి ఇంట్లో అందర్నీ లేపటం కోసం దగ్గుతున్నాడు అనుకుని, కర్రతో బుర్ర పగలకొట్టి వెళ్ళిపోయారు దొంగలు. ఆ దెబ్బ నుంచి ఆయన ఇంకా కోలుకోలేదు. కొద్ది రోజులలోనే మరణించారు. ఐతే మరణించటానికి రెండు రోజుల ముందు సన్యసించారట. లేచి కూర్చునే ఓపిక లేకపోయినా ఆయనతో 'సన్యసించాను' అనిపించారు. సన్యసించిన మరునాడే స్వర్గస్తులైనారు. సన్యాసికి మోక్షం వస్తుంది అని నమ్మకం. అందుకే కొద్దిపాటి జ్ఞానమున్న ఏ బ్రాహ్మణుడైనా, కనీసం అంత్యకాలంలోనైనా సన్యసించే వాడు. బ్రాహ్మణేతరుడికి సన్యాసార్హత లేదు. అంటున్నాయి వేదాలు.

సన్యాసం ఒకరిస్తే పుచ్చుకునేది కాదు. జ్ఞాన వైరాగాలు సిద్ధించిన తరువాతనే సన్యసించాలి. సన్యాసము అంటే **మంచి నడవడి** అని అర్థం. సన్యాసి భిక్షుక వృత్తిలో ఉండాలి. భిక్షుకుడికి కూడా కొన్ని లక్షణాలు చెప్పింది **నారద పరివ్రాజకోపనిషత్తు.**

భిక్షుకుడికి ముఖ్యంగా ఆరు లక్షణాలుండాలి.

1. అజిహ్వా : నాలుక ఉండి కూడా జిహ్వా చాపల్యము లేనివాడు.
2. షండకః : పుంసత్వము ఉండి కూడా నపుంసకుడు.
3. పంగుః : కాళ్ళు ఉండి కూడా లేనివాడు
4. అంధః : కళ్ళు ఉండి కూడా చూడనివాడు
5. బధిరః : చెవులుండి కూడా విననివాడు
6. ముగ్ధః : ఇంద్రియాలు ఉండి కూడా వికారాలు లేనివాడు.

ఈ లక్షణాలున్నవాడు, ఈ ఆరుఇంద్రియాలకు లోబడనివాడు భిక్షుకుడనబడతాడు. దీనికి వివరణ ఇస్తున్నారు.

ఆహారం తీసుకుంటున్నప్పుడు దాని యందు ఇష్టాఇష్టాలు ప్రదర్శించని వాడు, ప్రజలందరికీ ఉపయోగించే మాటలు, సత్యము, మితసంభాషణ చేసేవాడు అజిహ్వుడు అనబడతాడు.

నిండు యవ్వనంలో ఉన్న స్త్రీని, అప్పుడే పుట్టిన పసిపాపని, వంద సంవత్సరాల ముసలిస్త్రీని సమానమైన దృష్టితో చూసేవాడు షండుడు. పుంసత్వము ఉండి కూడా లేనివాడు అనబడతాడు.

భిక్షాటన చెయ్యటానికి, మలమూత్ర విసర్జనకు మాత్రమే కూర్చున్న ప్రదేశం నుంచి నడిచి వెళ్ళేవాడు, ఎంత అవసరమైనా యోజనము దూరము (8 మైళ్ళు) కన్న వెళ్ళనివాడు పంగుడు అనబడతాడు. అంటే ఎప్పుడూ నియమనిష్ఠలతో ఒకేచోట ఉంటూ స్వస్వరూప ధ్యానంలో కాలం గడిపేవాడు.

నుంచున్నా, కూర్చున్నా, ఏ పని చేస్తున్నా దృష్టి నాలుగు కాడిమానుల దూరం కన్న పోనివాడు అంధుడు అనబడతాడు. ఏకాగ్ర దృష్టి గలవాడు. ప్రక్కచూపులు చూడనివాడు అంధుడు.

కష్టం కాని, సుఖం కాని, ఇష్టంకాని, అయిష్టంకాని ఏవార్త విన్నప్పటికీ ఏ రకమైన చలనము లేనివాడు బధిరుడు అనబడతాడు. స్తుతి నిందల యందు, సుఖదుఃఖముల యందును సమానభావం కలవాడు.

విషయాల మధ్యన ఉంటూనే వాటిని గ్రహించని వాడు ముగ్ధుడు అనబడతాడు. అంటే ఇంద్రియ వికారాలు లేనివాడు అని అర్థం. ఈ లక్షణాలు గల యతీశ్వరుడు మాత్రమే భిక్షకుడు అనబడతాడు.

సన్యాసి చేయకూడని పనులు. వీటినే ప్రతిబంధకాలు అంటారు.

1. ఆసనము 2. పాత్రలోపము 3. సంచయము 4. శిష్య సంగ్రహము 5. దివాస్వాపము 6. వృధాలాపము. ఇవి యతీశ్వరులకు ప్రతిబంధకాలు.

ఈ ఆరుపనులు సన్యాసి చెయ్యరాదు.

గ్రామంలో ఒకరోజు, పట్టణంలో ఐదు రోజులు, వర్షాకాలములో నాలుగు నెలలు తప్ప ఎక్కువ కాలము ఒకే ప్రదేశంలో ఉండటాన్ని ఆసనము అంటారు.

భిక్షాన్నం తింటున్నప్పటికీ, సొరకాయ బుర్ర మొదలైన పాత్రలలో ఒకదానినైనా ఉపయోగించకపోవటమే పాత్ర లోపము.

సొరకాయబుర్ర, చెక్కకమండలము, మట్టికమండలము, వెదురుగొట్టము. ఇవి యతీశ్వరుడు వాడవలసిన పాత్రలు. లోహపాత్రలవల్ల దొంగలభయం ఉంటుంది. అందుకని వాటిని వాడరాదు.

కాషాయాంబరాలు, దండము ధరించినప్పటికీ అవి పాడైపోతే వాడుకోవటానికి విడిగా రెండు మూడు దండాలు, బట్టలు సంపాదించి పెట్టుకోవటమే సంచయము అనబడుతుంది.

సేవలు చేయించుకోవటానికి గాని, మరి ఏ ఇతర అపేక్షతో గాని శిష్యులను చేర్చుకోవటమే శిష్యసంగ్రహము అనబడుతుంది.

బ్రహ్మవిద్య వెలుగు, ప్రకాశము కాబట్టి పగలు అని, అజ్ఞానము చీకటి, రాత్రి అనబడతాయి. ఉపనిషద్విద్య అనే పగటియందు ప్రమాదము కలిగించుట అంటే ఉపనిషద్విద్యకు స్వస్తి పలకటం దివాస్వాపము పగటినిద్ర అనబడుతుంది.

ఆధ్యాత్మిక విషయాలు చెప్పటం, భిక్షాందేహి అనటం, పరమేశ్వరస్తుతికి మాత్రమే సన్యాసి మాట్లాడాలి. మిగిలిన ఏ విషయం కోసం మాట్లాడినా అది వృథాలాప మనబడుతుంది.

బ్రహ్మజ్ఞానం అపేక్షించే వాడు శమదమాది గుణాలు కలిగి, శ్రవణ, మననముల చేత పరబ్రహ్మ స్వరూపాన్ని తెలుసుకుని, పరబ్రహ్మ సాక్షాత్కారం కోసం నిరంతరము నిధి ధ్యాస (నిరంతర భావన) చెయ్యాలి. ఉపయోగం లేని మాటలు మాట్లాడరాదు. దాని వల్ల నోటినొప్పితప్ప ఇంకేమీ ఉపయోగం లేదు.

బ్రహ్మజ్ఞాన సంపన్నుడు ఒంటరిగా ఉంటేనే నిరంతరము స్వస్వరూపానుసంధానము సాధ్యమవుతుంది. ఇద్దరుచేరితే సంసారము, ముగ్గురుచేరితే గ్రామము, నలుగురు ఆ పైన గనక చేరితే పట్టణమని అంటారు. ఇటువంటిస్థితిలో ఊళ్ళోజరిగే విషయాలు చెప్పుకుంటారు. ఒకరంటేఒకరికి స్నేహము, ద్వేషము కలుగుతాయి. కాబట్టి సన్యాసి ఎప్పుడూ ఒంటరిగానే ఉండాలి.

పరమాత్మధ్యానము నందు ఆసక్తిగలవాడు, పరమాత్మకు సంబంధించని విషయాలలో ఆసక్తిలేనివాడు, ఈషణత్రయము లేనివాడు, ఆత్మధ్యానతత్పరుడే భిక్షాన్నానికి అర్హుడు.

ఇటువంటి సన్యాసికే మోక్షం సిద్ధిస్తుంది. అందుకే విధిలో చెప్పకపోయినప్పటికీ సన్యాసావస్థని ఒప్పుకున్నాడు వ్యాసభగవానుడు. **సన్యాసికి సత్ప్రవర్తన అవసరం అంటున్నారు పరమానందనాథులు.**

వేదంలో సన్యాసాశ్రమము చెప్పినా చెప్పకపోయినా, సన్యాసాశ్రమము అనుష్ఠింపతగినది అంటున్నాడు వ్యాస భగవానుడు.

ఈ విషయమంతా 443, 444, 445 సూత్రాలలో వివరించబడింది.

*శ్రీ క్రోవి పురుషోత్తమశర్మ, శ్రీమతి లక్ష్మీనరసమ్మ గార్ల పౌత్రుడు, శ్రీ క్రోవి కృష్ణమూర్తి శ్రీమతి సత్యపర్వతవర్ధనమ్మ గార్ల జ్యేష్ఠ పుత్రుడు, హరితస గోత్రీకుడు, **పరమానందనాథ** దీక్షానామధేయుడు అయిన **క్రోవి పార్థసారథి** సర్వజనామోదము పొందునట్లుగా, సులభశైలిలో వ్రాసిన **'బ్రహ్మసూత్రకథామంజరి'** సమాప్తము.*

సర్వేజనాః సుఖినోభవన్తు

సమస్త సన్మంగళాని భవన్తు

ఓం తత్సత్